www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
గురువారం 3 జూలై 2025
సంపుటి :07 సంచిక : 37 , పేజీలు : 12 వెల:రూ. 5/-



## బీజేపీ జాతీయ మండలి సభ్యులు గా ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్ వెలుతురు జూలై 02:**
బీజేపీ జాతీయ మండలి సభ్యులు గా ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ గారిని ను ఏకగ్రీవంగా నియమించారు. మంగళవారం ఆయన నియామకంపై ప్రకటన వేలువడంతో పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ జాతీయ మండలి సభ్యులుగా ఎంపిక కావడం పట్ల ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేస్తూ తనపై బాధ్యత మరింత పెరిగిందని పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి... గుర్తింపు ఇచ్చిన పార్టీ అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే జాతీయ మండలి సభ్యులుగా నియామకం కావడంతో స్థానికంగా పార్టీ శ్రేణులు ఆయనకు అభినందనలు తెలియచేశారు.




# హెల్త్ టూరిజం హబ్‌గా హైదరాబాద్ అభివృద్ధి

- కార్పోరేట్ ఆస్పత్రులతో పోటిగా ప్రభుత్వాసుపత్రులు
- బంజరాహిల్స్‌లో ఎఐజి ఆస్పత్రిని ప్రారంభించిన సిఎం
- నాగేశ్వర్ వైద్య సేవలను అభినందించిన రేవంత్

**హైదరాబాద్,జులై 2( వెలుతురు):**
రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు నిర్మాణంలో ఉన్నాయని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులతో పోటీపడి ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందిస్తామని స్పష్టంచేశారు .ఒకప్పుడు ఉన్న ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థపోయి ఇప్పుడు స్పెషలిస్ట్ డాక్టర్స్ రోజులు వచ్చాయన్నారు. హెల్త్ ప్రొఫైల్ క్రియేట్ చేయడం ద్వారా దీన్ని బ్రేక్ చేయొచ్చని సీఎం అన్నారు. ప్రపంచ దేశాలతో పోటీ పడగలుగుతున్నామని చెప్పడానికే మిస్ వరల్డ్ పార్టిసిపెంట్స్‌కు ఏఐజీ హాస్పిటల్ విజిట్ లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి తెలిపారు.



గరంలోని బంజారా హిల్స్‌లో ఏఐజీ ఆస్పత్రిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం

## ప్రతి విద్యార్థి ఇంటర్ పూర్తి చేయగలగాలి

- డ్రాపవుట్స్‌కు గల కారణాలను పరిశీలించండి
- చాకలి ఐలమ్మ వర్సిటీ నిర్మాణ టెండర్లు త్వరగా ఖరారు
- విద్యాశాఖపై సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,జులై 2( వెలుతురు):**
పదో తరగతిలో ఉత్తీర్ణులైన ప్రతి ఒక్క విద్యార్థి తప్పనిసరిగా ఇంటర్మీడియట్ పూర్తి చేసేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పదో తరగతిలో పెద్ద సంఖ్యలో ఉత్తీర్ణత కనిపిస్తోందని ఇంటర్మీడియట్ పూర్తయ్యే సరికి ఆ సంఖ్య గణనీయంగా తగ్గిపోవడానికి గల సమస్యలను గుర్తించి వాటి

## మృతుల కుటుంబాలకు కోటి పరిహారం

- అన్ని బీమా క్లెయిమ్‌లు అందిస్తాం
- క్షతగాత్రుల వైద్య ఖర్చుల బాధ్యత మాదే
- ప్రమాదంలో 40 మంది మృతి..33మందికి గాయాలు
- ప్రభుత్వ దర్యాప్తుకు పూర్తిగా సహకరిస్తాం
- కంపెనీ సెక్రటరీ వివేక్ కుమార్ ప్రకటన



## దేశానికి మోడల్‌గా తెలంగాణ డిజాస్టర్ మేనేజిమెంట్

- తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ పునర్వ్యవస్థీకరణ
- నదీపరివాహక ప్రాంత నిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్లు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

## బకనచర్ల ప్రాజెక్టుపై ఇష్టానుసారంగా, నోటికి వచ్చినట్లు మాట్లాడడానికి సిగ్గుండాలి...

- కాంగ్రెస్, బీఆర్ఎస్ లు బిజెపిపై విమర్శలు చేయడం హాస్యాస్పదం..
- బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు...




**హైదరాబాద్ వెలుతురు జూలై 02:**
తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్ రెండూ కలసి భారతీయ జనతా పార్టీపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని,ప్రత్యేకంగా నీటి వినియోగంపై, బనకచర్ల ప్రాజెక్టుపై ఇష్టానుసారంగా, నోటికొచ్చినట్టుగా మాట్లాడడానికి

## పంపుసెట్లకు ఉచితంగా సౌర విద్యుత్

- ప్రతి ఇంట్లో సౌర విద్యుత్ ఏర్పాటుకు చర్యలు
- రాయలసీమ హార్టికల్చర్ హబ్‌గా కుప్పం నియోజకవర్గం
- స్వర్ణ కుప్పంలో భాగంగా రూ.1292.74 కోట్ల అభివృద్ధి పనులు
- తుమ్మిశల ప్రజావేదికలో సిఎం చంద్రబాబు నాయుడు



వెలుతురు

(మొదటి పేజీ తరువాయి..)

## ప్రతి విద్యార్థి ఇంటర్ పూర్తి చేయగలగాలి

పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. విద్యా శాఖపై కమాండ్ కంట్రోల్‌లో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ దశ కీలకమైనందున.. ఆ దశలో విద్యార్థికి సరైన మార్గదర్శకత్వం లభించాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. ఇతర రాష్ట్రాల్లో 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉంటుందని.. అక్కడ డ్రాపౌట్స్ సంఖ్య తక్కువగా ఉందని అధికారులు సీఎంకు తెలియజేశారు. ఇంటర్మీడియట్ వేరుగా.. 12వ తరగతి వరకు పాఠశాలలు ఉన్న రాష్ట్రాల్లో అధికారులు అధ్యయనం చేసి ఈ విధానంపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ విషయంలో విద్యా కమిషన్, ఆ విభాగంలో పని చేసే ఎన్జీవోలు, పౌర సమాజం సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకోవాలని సీఎం సూచించారు. ఇంటర్మీడియట్ విద్య మెరుగుకు అన్ని దశల్లో చర్చించి శాసనసభలోనూ చర్చకు పెడతామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇంటర్మీడియట్‌లో విద్యార్థుల చేరికతో పాటు వారి హాజరుపైనా దృష్టిపెట్టాలన్నారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్స్ స్కూళ్ల నమూనాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. ప్రతి పాఠశాల ఆవరణలో భారీ జాతీయ జెండా ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. పాఠశాలల నిర్మాణం ప్రక్రియను వేగవంతం చేయాలని , నిర్మాణాల ప్రగతిపై ప్రతి వారం తనకు నివేదిక సమర్పించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో బాలురకు ఒకటి, బాలికలకు ఒకటి యంగ్ ఇండియా రెసిడెన్షియల్స్ స్కూళ్ల నిర్మాణాలను చేపడతామన్నారు. ఇప్పటికే ఒక్కో పాఠశాలకు సంబంధించి స్థల సేకరణ పూర్తయినందున, రెండో పాఠశాలకు సంబంధించిన స్థల గుర్తింపు, సేకరణ ప్రక్రియపై దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం నిర్మాణ నమూనాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. పలు మార్పులను సూచించారు. సాధ్యమైనంత త్వరగా టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిత, జేఎన్టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు కోటి పరిహారం

**సంగారెడ్డి,జులై2 ( వెలుతురు):**

పాశమైలారంలో జరిగిన ప్రమాదంపై సిగాచీ కంపెనీ స్పందించింది. పరిశ్రమలో పేలుడు కారణంగా 40 మంది మృతి చెందారని, మరో 33 మంది గాయపడినట్లు పేర్కొంది. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ప్రమాదంలో గాయపడిన వారికి పూర్తి వైద్యం అందిస్తామని, అన్ని బీమా క్లెయిమ్ ఇస్తామని స్పష్టం చేసింది. బాధిత కుటుంబాలకు అన్నివిధాలా అండగా ఉంటామని సిగాచీ కంపెనీ హామీ ఇచ్చింది. ఈ మేరకు సిగాచీ తరపున కంపెనీ సెక్రటరీ వివేక్ కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు. 'ప్రమాదంలో 40 మంది మృతి చెందారు. 33 మందికి గాయాలయ్యాయి. మృతుల కుటుంబాలకు పరిశ్రమ నుంచి కోటి పరిహారంతో పాటు అన్ని రకాల బీమా క్లెయిమ్ చెల్లిస్తాం. గాయపడ్డ వారికి పూర్తి వైద్యం అందిస్తాం. బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం. పరిశ్రమ ప్రమాదంపై నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కి లేఖ రాశాం. మూడు నెలల పాటు కంపెనీ కార్యకలాపాలు మూసివేస్తున్నాం. ప్రమాదానికి రియాక్టర్ పేలుడు కారణం కాదు. ప్రమాదంపై తెలంగాణ ప్రభుత్వం దర్యాప్తు చేస్తుంది. ప్రభుత్వం దర్యాప్తు నివేదిక కోసం వేచి చూస్తున్నాం' అని సిగాచీ కంపెనీ సెక్రటరీ వివేక్ కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రమాదం ఘటనకు సంబంధించి దర్యాప్తుకు సహకరిస్తామని.. నిబంధనలు పాటిస్తాం అని ప్రకటనలో తెలిపింది. ప్రమాదంలో గాయపడిన వారికి సాయం చేయటంతో పాటు వారి కుటుంబాలకు పునరావాసం కల్పిస్తామని వివేక్ కుమార్ పేర్కొన్నారు. 35 ఏళ్లలో ఎలాంటి ప్రమాదం జరగలేదని.. ఇది ఘోర ప్రమాదని పేర్కొన్నారు. 3 నెలల పాటు కంపెనీని తాత్కాలికంగా మూసివేస్తున్నా ప్రకటించారు. కంపెనీని పదేళ్ల క్రితం ఎలాంగో గౌడకు లీజుకు ఇచ్చామని.. కంపెనీ బాధ్యతలు ఆయనే చూస్తున్నారని తెలిపారు. పేలుడు ఘటనలో ఎలాంగో గౌడ చనిపోవటంతో వివరాలు తెలియడం లేదని తెలిపారు. ప్రమాదంపై స్టాక్ ఎక్ఛేంజ్ కు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇక సిగాచి కంపెనీపై 4 సెక్షన్ల కింద కేసు నమోదైంది. కంపెనీ ఉద్యోగి యశ్వంత్ ఇచ్చిన కంప్లైంట్ తో కేసు నమోదయ్యింది. కంపెనీలో వాడుతున్న పాత మిషనరీ కారణంగా పేలుడు సంభవించినట్లు ఎఫ్ఐఆర్ లో పోలీసులు పేర్కొన్నారు.

## దేశానికి మోడల్‌గా తెలంగాణ డిజాస్టర్ మేనేజిమెంట్

**హైదరాబాద్ వెలుతురు జూలై 02 :**



ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కొని వీలైనంత వరకు ప్రాణ నష్టం, ఆస్థి నష్టం జరగకుండా ఉండేలా తెలంగాణ డిజాస్టర్ మేనేజిమెంట్ అధారిటీ (తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ)ని బలోపేతం చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. దేశానికి ఒక మోడల్‌గా ఉండేలా వ్యవస్థను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణా సంస్థ (TGSDMA) ను పునర్వ్యవస్థీకరించినట్లు వెల్లడించారు. ఈ సంస్థకు గౌరవ ముఖ్యమంత్రి ఛైర్మన్‌గా ఉంటారని ఇందులో రెవెన్యూ, హోమ్, ఆర్థిక, వైద్య ఆరోగ్యం, భారీ నీటిపారుదల, రహదారులు భవనాలు, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రులు సభ్యులుగానూ, చీఫ్ సెక్రటర్ మెంబర్ కన్వీనర్‌గాను, రెవెన్యూశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ప్రత్యేక ఆహ్వానితునిగా ఉంటారని తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో గోదావరి మరియు కృష్ణా నదీ పరివాహక జిల్లాల్లో వరద నిర్వహణపై ఆయా జిల్లాల కలెక్టర్లు , ఇతర ఉన్నతాధికారులతో చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణారావు, విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ "వాతావరణ మార్పుల వల్ల ఆకస్మికంగా వచ్చే వరదలు, వర్షాల సమాచారాన్ని ఐఎండీతో సమన్వయం చేసుకొని శాస్త్రీయంగా విశ్లేషించుకొని ఎప్పటికప్పుడు పై స్థాయి నుంచి కింది స్థాయి వరకు అందించేలా వ్యవస్థను రూపొందించుకోవాలి.సమాచార వ్యవస్థ మరింత బలోపేతం కావాలి. రాష్ట్ర స్థాయిలో వర్షాలు, వరదలకు సంబంధం ఉన్న ఇరిగేషన్, విద్యుత్, హెల్త్, వ్యవసాయం, పోలీస్, రవాణా తదితర విభాగాలకు ప్రత్యేక నోడల్ అధికారులను నియమిస్తున్నాం. ప్రకృతి వైపరీత్యాలను మనం అడ్డుకోలేం కానీ వాటి ప్రభావాన్ని తగ్గించడానికి ముందస్తుగా పటిష్టమైన చర్యలు తీసుకుంటే నష్టాన్ని వీలైనంతవరకు తగ్గించగలుగుతాం. ప్రధానంగా కృష్ణా గోదావరి పరీవాహక ప్రాంతాల అధికార యంత్రాంగం వరద ముంపును ముందుగానే గుర్తించి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. దీనివలన మనం నష్టాన్ని తగ్గించినవారమవుతాం. నదీపరివాహక ప్రాంతాల్లో ఏ మేరకు వరద ఉధృతి వస్తే ఏఏ గ్రామాలు ముంపునకు గురౌతాయోనన్న సమాచారాన్ని నీటిపారుదల శాఖ ముందుగానే అందించాలి. ఇతర రాష్ట్రాలలో వచ్చే వరద వివరాలు, స్థానికంగా పడిన వర్షం వివరాలు, ఎంత నీటిని విడుదల చ్నేరనే విషయాలు సవివరంగా ఉండాలి. నదీ పరివాహక ప్రాంతాల్లోని నివాసితులను వరదలు వచ్చిన ప్రతిసారీ సురక్షిత ప్రాంతాలకు తరలించడం కంటే వారికి శాశ్వత నివాసం కల్పించాలి. ఇందుకు సంబంధించి నివాసితుల వివరాలను గుర్తిస్తే అదనపు కోటా కింద ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇస్తాం." భారీ వర్షాలు, వరదల సమయంలో వాగుల్లో వంకల్లో చెరువుల్లో చిక్కుక్నువారిని రక్షించడానికి ఎయిర్ లిఫ్ట్ మెకానిజాన్ని సిద్ధం చేసుకోవాలి. ఈ ఎయిర్ లిఫ్ట్ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల గత ఏడాది నా నియోజకవర్గం పాలేరులో చిక్కుకున్న బాధితులను రక్షించుకోలేకపోయానని ఈ సందర్భంగా మంత్రిగారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎయిర్ లిఫ్ట్ మెకానిజం ఏవిధంగా ఉండాలి, విపత్తు సంభవించిన ప్రాంతానికి ఏవిధంగా చేరుకోవాలి వంటి అంశాలపై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్, సెక్రటరీ శివశంకర్, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి, హైడ్రా కమీషనర్ రంగనాథ్, పంచాయితీరాజ్ కమీషనర్ సృజన, సిపి డిసిఎల్ డైరెక్టర్ ముష్రాఫ్ అలీ, వ్యవసాయ సహకార శాఖ డైరెక్టర్ బి. గోపి. ఐఎండీ అధికారిణి నాగరత్నం. సివిల్ సప్లయిస్ డైరెక్టర్ ముజముల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# హెల్త్ టూరిజం హబ్‌గా హైదరాబాద్ అభివృద్ధి

ప్రారంభిం చారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. నగర ప్రజలకు రెండో అతిపెద్ద హాస్పిటల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినందుకు డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని అభినందించారు. హైదరాబాద్, తెలంగాణకు నాగేశ్వర్ రెడ్డి గొప్ప పేరు తీసుకొచ్చారని.. ఆయన సేవలను గుర్తించి కేంద్రప్రభుత్వం పద్మవిభూషణ్ ఇచ్చిందని తెలిపారు. నాగేశ్వర్ రెడ్డి భారతరత్నకు అర్హులన్నారు. ఆయనకు భారతరత్న వచ్చేలా తెలంగాణ నుంచి తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు. 66 దేశాల నుంచి పేషంట్స్ ఏఐజీ ఆసుపత్రిలో చికిత్సకు వస్తున్నారని ఇది గర్వకారణమన్నారు. ఇకపోతే గోశామహల్ లో నూతన ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించబోతున్నామని.. పనులు కూడా ప్రారంభమయ్యాయని అన్నారు. నిర్మాణంలో ఉన్న వివిధ ఆసుపత్రులు పూర్తయితే మొత్తం 7 వేల పడకలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తున్నామని.. అందులో హెల్త్ టూరిజం ఒక చాప్టర్‌గా ఉంటుందని సీఎం తెలిపారు. హైదరాబాద్‌ను హెల్త్ టూరిజం హబ్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామని.. అందులో భాగంగానే డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని క్యాన్సర్ కేర్ సలహాదారుడిగా నియమించామన్నారు. తెలంగాణ రాష్ట్రం చేపట్టే ప్రణాళికలో డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని కూడా భాగస్వాములు కావాల్సిందిగా ముఖ్యమంత్రి కోరారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 10 లక్షల వరకు ప్రభుత్వం పేదలకు ఉచిత వైద్యం అందిస్తోందన్నారు. సమస్య రాకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాల్సిన అవసరం ఉందని.. ఇందుకు సరైన విధానంతో ముందుకు వెళ తున్నామని వెల్లడించారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలకు హెల్త్ ప్రొఫైల్ కార్డును క్రియేట్ చేయాలని భావిస్తున్నామన్నారు. ఒక యూనిక్ ఐడీతో ఈ హెల్త్ ప్రొఫైల్ కార్డులు ఉంటాయని తెలిపారు. వైద్య రంగం అభివృద్ధికి రూ.11500 కోట్లు కేటాయించామని.. రూ.21500 కోట్లు విద్యా రంగం అభివృద్ధికి కేటాయించామని తెలిపారు. పేదలకు ఉచిత వైద్యం, నాణ్యమైన విద్య అందించాలనే ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నాని పేర్కొన్నారు. వైద్యులు ఏడాదిలో ఒక నెల రోజులు సామాజిక బాధ్యతగా ప్రభుత్వ ఆసుపత్రులలో సేవలందించాలన్నారు. సాంకేతిక రంగంలో ప్రపంచంలో హైదరాబాద్ కూడా ఒక వేదికగా మారిందని అన్నారు. మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి హైదరాబాద్‌కు డైరెక్ట్ కనెక్టివిటీ పెంచేలా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతున్నామని.. కనెక్టివిటీ పెరిగితే హైదరాబాద్ మరింత అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## బకనచర్ల ప్రాజెక్టుపై ఇష్టానుసారంగా, నోటికి వచ్చినట్లు మాట్లాడడానికి సిగ్గుండాలి...

సిగ్గుండాలని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు ఘాటుగా విమర్శించారు. బుధవారం హైదరాబాద్లోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాసం మీడియాతో మాట్లాడిన విశేషాలు ఏమిటంటే. . అసలు తెలంగాణకు ఎంత నీరు వస్తుంది? దాన్ని ఎలా వాడుకోవాలి? అనే విషయంలో అప్పట్లో బీఆర్ఎస్, ఇప్పుడున్న కాంగ్రెస్.. రెండూ ప్రభుత్వాలు విఫలమయ్యాయి. అలాంటివాళ్లు కేంద్రంపై, భారతీయ జనతా పార్టీపై దుమ్మెత్తి పోసేందుకు వీళ్ళు ప్రయత్నిస్తున్నారు. ప్రజలను రెచ్చగొట్టి, విభేదాలు సృష్టించే ప్రయత్నంలో రెండు పార్టీలు ఒకరికి మించి మరొకరు పోటీ పడుతున్నాయి. వాస్తవాలను దాచిపెట్టి, తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను రాజకీయంగా వాడుకునే పనిలో ఉన్నాయి. బనకచర్ల విషయంలో కేంద్రం న్యాయబద్ధంగా, సాంకేతికంగా సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటుంది. బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర పర్యావరణ శాఖ ఇప్పటికే అనుమతులను నిలిపివేసింది. ఈ ప్రాజెక్టు ముందుకు సాగాలంటే తప్పనిసరిగా CWC అనుమతి అవసరం. ముందుగా నీటి లభ్యతపై CWC సమీక్ష చేయాల్సిన అవసరం ఉంది. కేంద్రం ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పినప్పటికీ, కాంగ్రెస్ – బీఆర్ఎస్ విమర్శలు ఆపడం లేదు. నిజంగా ఇది ఫ్లడ్ వాటర్ ప్రాజెక్టు అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చెబుతున్నప్పటికీ CWC అనుమతి తప్పనిసరి. నీటి లభ్యతపై అసెస్మెంట్, జలవిభాగ అనుమతులు, అంతర్రాష్ట్ర వివాదాల పరిష్కారం.. ఇవన్నీ అవసరమవుతాయి. ఈ అంశాలను కేంద్రం శాస్త్రీయంగా పరిశీలిస్తుంది. కృష్ణా నదిపై తెలంగాణకు 299 టీఎంసీల నీటి వాటా ఉంది. కానీ ఈ నీటిని ఉపయోగించుకోవడంలో గత బీఆర్ఎస్ సర్కారు, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పాలమూరు జిల్లాకి చెందినవారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అదే జిల్లాకు చెందినవారు. నల్లగొండ, పాలమూరు ఉమ్మడి జిల్లాల నుంచే ఐదుగురు మంత్రులు ఉన్నా కూడా ఇప్పటివరకు ఈ రెండు జిల్లాలకు సంబంధించి నీటి వినియోగంలో ఏమాత్రం పురోగతి లేదు. బీఆర్ఎస్ పార్టీ 10 ఏళ్లపాటు పాలనలో ఉండి నిద్రపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలలుగా గాఢనిద్రలో మునిగిపోయింది. ఇప్పటివరకు ఈ 299 టీఎంసీలలో తెలంగాణ ఎంత నీటిని వినియోగించింది? ఎంత వృథా అయింది? అనే విషయాలను బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ధైర్యంగా ప్రజలకు చెప్పాలి. ఎందుకు పూర్తిగా వాడుకోలేకపోతున్నారు? అనే అంశాన్ని కూడా ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం ఉంది. పాలమూరు రంగారెడ్డి, ఎస్ఎల్బీసీ, డిండి ప్రాజెక్టులు.. ఇవన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి. కొత్తగా ఒక్క ప్రాజెక్టు కూడా ప్రారంభించలేదు. పూర్తిచేయలేదు. శ్రీశైలం, జూరాల, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు నీటితో నిండిపోయినా వాటి వినియోగానికి ప్రభుత్వానికి ప్రణాళికలు లేవు. ఇటీవల జూరాల గేట్లు తుప్పు పట్టిపోవడమే దీనికి ఉదాహరణ. ఈ స్థితిలో కూడా కాంగ్రెస్ పార్టీ నీటి వినియోగంపై నాటకాలు ఆడుతున్నది తప్ప సరైన ప్రణాళికలు మాత్రం చూపడం లేదు. ఈ ప్రాజెక్టులను పూర్తిచేయాలన్న ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు. ఎటూ తెలియని పరిస్థితిలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం నడుస్తోంది. నిజంగా నీటి వినియోగంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి స్పష్టత లేదు. ప్రజలకు చెప్పదగిన విధంగా వాస్తవాలు దాచేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు గేట్లు తుప్పుపట్టి పోయినాయని బయటపడినప్పుడు కూడా కేంద్రాన్ని విమర్శించడమే వీళ్ళ పనిగా పెట్టుకున్నారు. నల్లగొండ, పాలమూరు జిల్లాలకు ఐదుగురు మంత్రులు ఉన్నా ప్రజలు నీటి కోసం తిప్పలు పడటం ఈ ప్రభుత్వ వైఫల్యం. ఒక్క నీటి ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేని ఈ రెండు పార్టీలు ఇప్పుడు కేంద్రాన్ని అడ్డగోలుగా విమర్శించడం తెలివితక్కువతనానికి నిదర్శనం. కేసీఆర్, రేవంత్ రెడ్డి.. ఇద్దరూ కలిసి నీటి వినియోగంలో, ప్రాజెక్టుల అమలులో తెలంగాణ ప్రజలకు ద్రోహం చేస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన 10 మంది ఎమ్మెల్యేలు ఎవరు ఏ పార్టీలో ఉన్నారో కూడా తెలియని పరిస్థితి ఉంది. ఒక రోజు ఒక పార్టీ కండువా, మర్నాడు మరో పార్టీ కండువా కప్పుకుంటున్న దుస్థితి.. ఇవాళ తెలంగాణలోని రాజకీయ దివాళాకోరుతనానికి, దుర్మార్గానికి నిదర్శనం. అసలు బిజెపి ఎవరికి అనుకూలం కాదు, ఎవరికి వ్యతిరేకం కాదు, ఎక్కడ వివక్ష చూపదు. శాస్త్రీయంగా, న్యాయబద్ధంగా కేంద్ర ప్రభుత్వం ఏది చేయాలో అదే చేస్తుంది. ఎవరికో భయపడి, ఎవరో మావాళ్ళు ,, మీవాళ్లు అని వ్యవహరించే ప్రభుత్వం కాదు. ప్రధాని నరేంద్ర మోదీ గారి ప్రభుత్వం ఎప్పుడూ నిబంధనల ప్రకారం ప్రజలకు న్యాయం చేస్తుంది. చంద్రబాబు మావాడా? అంటూ కొంతమంది నాయకులు విమర్శిస్తున్నారు. అసలు ఒకరేమో నదులకు నడకలు నేర్పానని చెబుతారు... ఇంకొకరు దేవాదుల ప్రాజెక్టు ఏ బేసిన్‌లో ఉందో అడుగుతారు. అలాంటి వారు ముఖ్యమంత్రులుగా ఉండటం దురదృష్టకరం. అసలు దేవాదుల ప్రాజెక్ట్ ఏ బేసిన్‌లో ఉంది అనే సాధారణ విషయమే తెలియని వ్యక్తి ఈరోజు ముఖ్యమంత్రి అయ్యి, తన పదవి ఎప్పుడు పోతదో అన్న భయంతో అటూ ఇటూ ఊగిసలాడుతున్నారు. ఇష్టానుసారంగా కేంద్రంపై, మోదీ గారి మీద, కిషన్ రెడ్డి గారి మీద విమర్శలు చేయడమే వీళ్లు పనిగా పెట్టుకున్నారు. అసలు మీకు ఏ ప్రాజెక్టు ఏ బేసిన్‌లో ఉందో తెలియదు. అలాంటి స్థితిలో ఉన్న మీరు కేంద్రాన్ని, కిషన్ రెడ్డి గారిని విమర్శించడం దౌర్భాగ్యం. తెలంగాణ ఎన్నో సంవత్సరాలుగా కలలు కన్న నీటిపారుదల ప్రాజెక్టుల కలలను ఈ దౌర్భాగ్యపు నాయకులు కల్లోల తెలంగాణగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. నిన్న మొన్నటి బనకచర్ల ప్రాజెక్టు విషయంలో కూడా కేంద్రం ఖచ్చితంగా పర్యావరణ అనుమతులు నిలిపివేసినట్లు చెప్పింది. అయినా కూడా నోటికి వచ్చినట్లు మాట్లాడటం సిగ్గుచేటు. ఆ నాయకులకు పబ్లిసిటీ స్టంట్‌గా మారింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు దాటింది. ఒక్క డీపీఆర్ అయినా కేంద్రానికి పంపించారా? నీటి వినియోగం ఎలా చేయాలో తెలియని, నీ జిల్లాలో ఉన్న ప్రాజెక్టులకు కూడా అనుమతులు కోరని మీరు, నోటికి వచ్చినట్టు బిజెపి నాయకులపై విమర్శలు చేస్తే ఉపేక్షించేది లేదు. అసలు మీకు బిజెపి గురించి మాట్లాడే అర్హత ఉందా? కేంద్రం తెలంగాణపై వివక్ష చూపుతోందంటారా? మేము ఎవరికీ అనుకూలం కాదు, వ్యతిరేకం కాదు. శాస్త్రీయ పద్ధతిలో కేంద్ర ప్రభుత్వం పని చేస్తుంది. తెలంగాణకు కేంద్రం, నరేంద్ర మోడీ గారి నేతృత్వంలో 12 లక్షల కోట్ల రూపాయలు అందించిందని, అనేకసార్లు మీడియా ముందే ప్రూఫ్‌తో చెప్పాం. రేవంత్ రెడ్డికి అదికూడా తెలియకపోతే చెప్పాలి. పుస్తకాలు పంపి చదివిస్తాం. రాష్ట్ర అభివృద్ధి చేస్తున్నానంటూ ఊపదంపుడు ఉపన్యాసాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు.. తెలంగాణకు ఒక్క కొత్త కంపెనీ పెట్టుబడులు అయినా తీసుకొచ్చారా? ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారు? స్పష్టం చేయాలి. పెట్టుబడులొస్తున్నాయంటూ మాట్లాడుతారు, కానీ స్థాపించిన కంపెనీలేవో చెప్పరు. ఉద్యోగాలపై లెక్క చూపలేరు. బిజెపి ని విమర్శించడం మాత్రమే కాంగ్రెస్ నాయకులకు పరిపాటిగా మారిపోయింది. మేం తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాం, మేమే అభివృద్ధి చేశాం. కానీ మీ లాంటి వారు మాత్రం పార్టీలు మార్చుకుంటూ, కప్పం కడుతూ అధికారంలోకి వచ్చారు. బిజెపి నాయకులు ఎప్పటికీ అధికారానికి, పదవికి కప్పం కట్టలేదు. కానీ కాంగ్రెస్ నాయకులు కేంద్రానికి కప్పం కట్టి తెలంగాణ ఆస్తుల్ని తాకట్టు పెట్టారు. రేవంత్ రెడ్డి వైఖరిని చూసి ప్రజలు అసలు అధికారంలోకి ఎందుకు తీసుకొచ్చాం అని బాధపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ దేశంలో కనుమరుగైనట్టే, ఇక తెలంగాణలోనూ మీకు అదే గతి పడ్తుంది. కేంద్రం బనకచెర్ల పైన స్పష్టంగా పర్యావరణ అనుమతులు నిలిపివేసినట్టు చెప్పినా, కాంగ్రెస్ నాయకులు పదేపదే కేంద్రంపై విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇది కాంగ్రెస్ పబ్లిసిటీ స్టంట్ అనేది ప్రజలకు తెలిసిపోయింది. రేవంత్ రెడ్డి గారు ప్రధాని నరేంద్ర మోదీ గారిపై, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గారిపై ఇష్టానుసారంగా మాట్లాడితే.. మీరు కూడా రానున్న రోజుల్లో కేసీఆర్ లాగే ఫామ్‌హౌస్ కు పరిమితమవ్వక తప్పదు. తస్మాత్ జాగ్రత్త!

# పంపుసెట్లకు ఉచితంగా సౌర విద్యుత్

**చిత్తూరు,జులై 2( వెలుతురు):**


రైతుల పంపుసెట్లకు ఉచితంగా సౌర విద్యుత్ అందిస్తామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. శాశ్వతంగా విద్యుత్ ఛార్జీలు చెల్లించే పనిలేకుండా ప్రతి ఇంట్లో సౌర విద్యుత్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌గా నియోజకవర్గం నిలవబోతోందని చెప్పారు.'అభివృద్ధి, సంక్షేమం రెండూ సమానంగా ఉండాలి. సంపద సృష్టించి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలి. కుప్పం ప్రజలు తొమ్మిదిసార్లు నన్ను ఎమ్మెల్యేగా ఆశీర్వదించారు. వైకాపా పాలనతో రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. అది తలచుకుంటే భయమేస్తోంది. వ్యవస్థలను నాశనం చేశారు.చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో రూ.1292.74 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం తుమ్మిశిలో నిర్వహించిన 'ప్రజావేదిక' సభలో చంద్రబాబు మాట్లాడారు. కుప్పం రూపులేఖలు మార్చబోతున్నామని అన్నారు. గుంతలు లేని రోడ్లు చేస్తామని చెప్పాం.. పూర్తిచేశాం. కుప్పంలో రూ.1292.74కోట్లతో పనులు చేపట్టాం. రూ.3829 కోట్లతో హంద్రీనీవా ద్వారా చివరి ఆయకట్టుకు నీళ్లిస్తాం. 10 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి నియోజకవర్గంగా కుప్పం నిలిచేలా చర్యలు చేపడతాం. పీఎం సూర్యఘర్ కింద మూడు కిలో వాట్ల విద్యుత్ ఉత్పత్తికి బీసీలకు రూ.98 వేల రాయితీ ఇస్తాం. కుప్పం ప్రాంతానికి విమానాశ్రయం వస్తుంది. కుప్పం-హోసూరుకు సమాంతరంగా మరో రోడ్డు నిర్మాణం జరుగుతుంది. నియోజకవర్గానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు రానున్నాయని చంద్రబాబు తెలిపారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం బెంగళూరు నుంచి కుప్పం చేరుకున్న సీఎంకు జిల్లా, కుప్పం నియోజకవర్గ నేతలు, కలెక్టర్ సహా ఇతర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. స్వర్ణ కుప్పం ప్రాజెక్టులో భాగంగా మొత్తం రూ.1292.74 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి, సంక్షేమ, ప్రత్యేక పథకాలను ముఖ్యమంత్రి ప్రారంభించారు. వీటిలో ఇప్పటికే రూ.125.13 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తి అయ్యాయి.రూ.47 కోట్లతో 30 కిలోమీటర్ల మేర హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు పూర్తయ్యాయి. రూ. 42.5 కోట్ల వ్యయంతో 46 కిలోమీటర్ల మేర సీసీ రహదారులు, 65 కిలోమీటర్ల బీటీ రోడ్లు పూర్తి అయ్యాయి. అలాగే తాగునీటి సరఫరా నిమిత్తం రూ.8.97 కోట్లతో పనులు పూర్తి అవగా.. గోకులం షెడ్లు రూ.7.63, వీధిదీపాలు రూ.3.7 కోట్లు, రూ.1.64 కోట్లతో పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణం పూర్తి అయ్యింది. 1000 మంది మహిళా లబ్దిదారులకు కొత్తగా గ్యాస్ కనెక్షన్లను, 3041 మంది లబ్దిదారులకు కొత్తగా పెన్షన్లను ముఖ్యమంత్రి అందజేశారు. 7,488 ఎస్సీ ఎస్టీ గృహాలకు రూ.21.80 కోట్ల వ్యయంతో పీఎం సూర్యఘర్ యోజన కింద సోలార్ రూఫ్ టాప్ ప్యానళ్లు ఏర్పాటు చేశారు. వచ్చే ఏడాది జనవరి నాటికల్లా సోలార్ ప్యానళ్లు ఏర్పాటు పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించారు. అలాగే కుప్పం నియోజకవర్గంలో చెత్త సేకరణకు 130 ఎలక్ట్రిక్ ఆటోలను సీఎం ప్రారంభించారు.

ఇంటింటి చెత్త సేకరణకు ఎలక్ట్రిక్ ఆటోలను వినియోగిస్తున్న తొలి నియోజకవర్గంగా కుప్పం అవతరించనుంది. కామన్ ట్రీట్‌మెంట్ సెంటర్‌లో చెత్తను రీసైకిల్ చేయటం ద్వారా జీరో ల్యాండ్ ఫిల్ పాలసీ అమలు చేస్తున్న నియోజకవర్గంగా కుప్పం నిలువనుం దన్నారు. అలాగే పేటీఎం సంస్థ సీఎస్ఆర్ నిధులతో అడ్వాన్స్ లైఫ్ సపోర్టు అంబులెన్సులను సీఎం ప్రారంభించారు. 400 అంగన్‌వాడీ కేంద్రాల్లో కేర్ అండ్ గ్రో కార్యక్రమాన్ని కూడా మొదలుపెట్టారు. పీఎం కుసుమ్ పథకం కింద రూ.564 కోట్లతో వ్యవసాయ ఫీడర్లకు సౌర విద్యుత్ అందేలా కార్యాచరణ రూపొందించారు. దీని ద్వారా 32,106 వ్యవసాయ పంపుసెట్లకు సౌర విద్యుత్ అందనుంది. కుప్పంలో టూరిజం అభివృద్ధికి తోడ్పడనున్న లీ కంఫర్ట్ 3 స్టార్ రిసార్ట్‌ను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. 1387 మంది దివ్యాంగులకు ఉపకరణాలను అందజేశారు. అలాగే 400 మంది డ్వాక్రా మహిళలకు ఈ –సైకిళ్లు సీఎం చేతుల మీదుగా పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీ దగ్గుమల్ల ప్రసాద్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, అధికారులు పాల్గొన్నారు.

## పహల్గామ్ దాడిని ఖండించిన క్వాడ్ గ్రూప్

**న్యూఢిల్లీ,జులై 2( వెలుతురు):**

భారతదేశానికి అతిపెద్ద దౌత్య విజయం దక్కింది. క్వాడ్ గ్రూప్ (భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్) ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన పహల్గామ్ ఉగ్రవాద దాడిని ఖండించింది. 26 మంది అమాయకుల ప్రాణాలు తీసిన వారిపై చర్యలు తీసుకోవాలని క్వాడ్ గ్రూప్ విదేశాంగ మంత్రులు కోరారు. ఉగ్రదాడి నేరస్తులు, నిర్వాహకులు, ్ర÷నాన్షియర్లపై చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. వాషింగ్టన్‌లో జరిగిన సంయుక్త ప్రకటనలో.. సరిహద్దు ఉగ్రవాదంతో సహా అన్ని రకాల ఉగ్రవాదం, హింసాత్మక తీవ్రవాదాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించారు. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాము. ఈ దారుణమైన చర్యకు పాల్పడిన వారిని, నిర్వాహకులను, ఆర్థిక సహాయం చేసిన వారిని ఎటువంటి ఆలస్యం లేకుండా న్యాయం ముందు నిలబెట్టాలి. అంతర్జాతీయ చట్టం, సంబంధిత జఔ÷ూఅఖీల ప్రకారం వారి బాధ్యతలకు అనుగుణంగా, ఈ విషయంలో అన్ని సంబంధిత అధికారులతో చురుకుగా సహకరించాలని అన్ని జఔ సభ్య దేశాలను కోరుతున్నాము' అని ప్రకటన పేర్కొంది.ఈ సమావేశంలో భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌తో



పాటు అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, జపాన్ విదేశాంగ మంత్రి తకేషి ఇవాయా, ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్ పాల్గొన్నారు. ప్రపంచ సమస్యలు, ఉగ్రవాద నిరోధక సహకారంపై నాలుగు దేశాల విదేశాంగ మంత్రులు విస్తృతంగా చర్చించారు. ఉగ్రవాదంపై ప్రపంచం 'జీరో టాలరెన్స్'తో ఉండాలని, బాధితులను, నేరస్తులను ఎప్పుడూ సమానం చూడొద్దని, ఉగ్రవాదం నుంచి తమ పౌరుల్ని రక్షించుకునే బాధ్యత భారత్‌కు ఉందని జైశంకర్ అన్నారు.

# విష్ణు కార్స్ కు మరో ప్రతిష్టాత్మక గుర్తింపు

- టాప్ టాక్స్ పేయర్ మరియు అత్యుత్తమ మహిళా పారిశ్రామికవేత్త విభాగాల్లో సి.జి.ఎస్.టి. పురస్కారాలు
- రెండు విభాగాల్లో ఉత్తమంగా నిలిచిన విష్ణు గ్రూప్ ఆఫ్ కంపెనీస్




**చెన్నై వెలుతురు 02 జూలై 2025:**
లక్షలాది కస్టమర్ల ఆదరణతో కార్ల వ్యాపారంలో నమ్మకానికి మారుపేరుగా నిలిచిన విష్ణు కార్స్ మరో ప్రతిష్టాత్మక పురస్కారాన్ని తన ఖాతాలో వేసుకుంది. చెన్నై జి.ఎస్.టి. శాఖ ప్రకటించిన టాప్ టాక్స్ పేయర్, అత్యుత్తమ పారిశ్రామిక వేత్తల విభాగాల్లో రెండు పురస్కారాలకు ఏక కాలంలో ఎంపికైన సంస్థగా నిలిచింది. రెండు విభాగాల్లో ఒకే సంస్థ నిలవడం ఇదే తొలిసారి. టాప్ టాక్స్ పేయర్ గా విష్ణు కార్స్, ఉత్తమ మహిళా పారిశ్రామికవేత్తగా విష్ణు గ్రూప్ ఆఫ్ కంపెనీస్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి దీపా వెంకట్ ఎంపికయ్యారు. 8వ సి.జి.ఎస్.టి. దినోత్సవాన్ని పురస్కరించుకుని జి.ఎస్.టి. తమిళనాడు మరియు పుదుచ్చేరి జోన్ చెన్నైలోని కళైవర్ ఆరంగంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రీమతి దీపా వెంకట్ ఈ రెండు పురస్కారాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో CUMI మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ శ్రీధరన్ రంగరాజన్, ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ డా. రామ్ నివాస్, ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ శ్రీ ఏ.ఆర్.ఎస్. కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీమతి దీపా వెంకట్ మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా నమ్మకానికి మారుపేరుగా నిలిచిన విష్ణు కార్స్ ను రెండు విభాగాల్లో సి.జి.ఎస్.టి. వారు గుర్తించడం ఆనందంగా ఉందని తెలిపారు. కస్టమర్ల ఆదరణ మరియు సంస్థలో సేవలు అందిస్తున్న ఉద్యోగుల నిబద్ధతతోనే ఇది సాధ్యమైందన్న ఆమె, ఈ పురస్కారాలను వారికి అంకితం చేస్తున్నట్లు తెలిపారు. వ్యాపార రంగంలో ఈ పురస్కారాలు తమ బాధ్యతను మరింత పెంచాయన్న ఆమె, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.



# ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి అమలుకు కలెక్టర్లే మార్గదర్శకులు

**పథకాల ఫలితాలు పేదల గుడిసె వరకు చేరాలి**

**కలెక్టర్లకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచన**

**8 జిల్లాల కలెక్టర్లతో సచివాలయంలో సమావేశం**

**హైదరాబాద్ వెలుతురు జూలై 02:**
గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం దార్శనికతతో తీసుకువచ్చిన భూభారతి చట్టం అమలు, పేదల కలలను సాకారం చేసే ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేసి వాటి ఫలితాలు పేదలకు అందేలా చూడాల్సిన బాధ్యత కలెక్టర్లపైనే ఉందని రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా రూపుదిద్దుకున్న ఈ రెండు పథకాలను విజయవంతంగా అమలు చేయడానికి జిల్లా కలెక్టర్లు నిరంతరం శ్రమించాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం నాడు డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో నిర్మల్, నారాయణపేట్, జోగులాంబ గద్వాల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల, వనపర్తి జిల్లాల కలెక్టర్లతో భూభారతి, ఇందిరమ్మ ఇండ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ “ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడితే స్వరాష్ట్రంలో పదేళ్లలో ఎదుర్కొన్న భూ సమస్యలకు విముక్తి లభిస్తుందని, సొంతింటి కల నెరవేరుతుందని తెలంగాణ ప్రజానీకం అత్యంత నమ్మకం విశ్వాసంతో మాకు అధికారం అప్పగించారు. వారి నమ్మకాన్ని విశ్వాసాన్ని ఏమాత్రం వమ్ము చేయకుండా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిగారి ఆలోచనల మేరకు రాష్ట్రంలో



భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేలా భూభారతి చట్టానికి, అలాగే ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టాం. చట్టాన్ని రూపొందించడం ఒక ఎత్తైతే దాన్ని అమలు చేయడం మరో ఎత్తు. ఈ చట్టం ఫలితాలు ప్రతి పేదవానికి అందినప్పుడే చట్టం సార్ధకత నెరవేరుతుంది. ఈ చట్టాన్ని క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయాల్సిన గురుతరమైన బాధ్యత మీ అందరిపై ఉంది. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వండి. రెవెన్యూ కార్యాలయానికి వచ్చే సామాన్యుడు సైతం సంతోషపడేలా రెవెన్యూ యంత్రాంగం పనిచేయాలి. ఇందిరమ్మ ఇండ్ల విషయానికొస్తే రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నాకూడా దాని ప్రభావం ఇందిరమ్మ ఇండ్లపై పడకుండా ప్రతి సోమవారం నిధులు విడుదల చేస్తున్నాం. మీరు చేయాల్సింది లబ్దిదారుల ఎంపిక, ఇండ్ల మంజూరు, నిర్మాణ పనుల పర్యవేక్షణ. ఈ మూడు అంశాలను పకడ్బందీగా పర్యవేక్షించాలి. క్షేత్రస్థాయిలో పర్యటించి ఇండ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించాలి. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిష్టాత్మకమైన ఈ రెండు పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి . అనర్హులని తేలితే ఇంటి నిర్మాణం మధ్యలో ఉన్నాకూడా రద్దు చేయడానికి వెనుకాడ వద్దు. ప్రతి ఇల్లు అర్హులకే అందాలి. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఒక్కో ఇంటికి 40 మెట్రిక్ టన్నుల ఇసుక అందేలా పర్యవేక్షించాలి అలాగే ఇంటి నిర్మాణానికి అవసరమైన స్టీల్, సిమెంట్ ఇటుకల కోసం



మండల స్థాయిలో ధరల నియంత్రణ కమిటీలను ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడం జరిగింది, వీలైనంత త్వరితగతిన ఈ కమిటీలు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలి” అని సూచించారు.

## రాష్ట్రానికి తగిన యూరియా కేటాయించండి

- కేంద్రానికి లేఖ రాసిన మంత్రి తుమ్మల

**హైదరాబాద్,జులై 2( వెలుతురు):**
రాష్ట్రానికి సరిపడేంత యూరియాను కేటాయించాలని కోరుతూ కేంద్రానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. యూరియా కొరతను అధిగమించేందుకు తక్షణం చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రి జగత్ ప్రకాశ్‌నడ్డాకు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు మంత్రి లేఖలు రాశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రాష్ట్రంలో యూరియా అవసరం అంతకంతకు పెరిగిపోయిందని తెలిపారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి రాష్ట్రానికి 5 లక్షల మెట్రిక్ టన్నుల కోటాను కేంద్ర ప్రభుత్వం నిర్దేశిరచిందని.. అందులో ఇప్పటి వరకు 3.06 లక్షల టన్నుల యూరియా రాష్ట్రానికి సరఫరా అయిందని చెప్పారు.అరకొర సరఫరా కారణంగా రాష్ట్రంలో దాదాపు 1.94 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కొరత ఏర్పడిందని చెప్పుకొచ్చారు. తాజాగా జులై నెలకు నిర్దేశిరచిన సప్లై ప్లాన్ ప్రకారం రాష్ట్రానికి 1.60 లక్షల మెట్రిక్ టన్నులు రావాల్సి ఉందన్నారు. కానీ అందులో 60 శాతం ఇంపో÷-టర్గ÷డ్? యూరియాను కేటాయించటం ఆందోళన కలిగిస్తోందని లేఖలో పేర్కొన్నారు.ద
దిగుమతుల ద్వారా రాష్ట్రానికి రావాల్సిన యూరియా సకాలంలో రాష్ట్రానికి చేరుకునే పరిస్థితి లేదని, ఇప్పటి వరకు ఆ యూరియాను రవాణా చేసేందుకు అవసరమైన నౌకల కేటాయింపు జరగలేదని లెటర్‌లో ప్రస్తావించారు. దీంతో ఖరీఫ్‌పంటలకు అనువైన సమయంలో యూరియా కొరత రైతులను ఆందోళనకు గురి చేస్తోందని మంత్రి తుమ్మల కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. యూరియా సరఫరాపై కేంద్రం తక్షణమే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. జులై నెలకు కేటాయించిన 0.97 లక్షల మెట్రిక్ టన్నుల ఇంపోర్టెడ్ యూరియాకు నౌకలను కేటాయించాలని కోరారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి తెలంగాణకు స్వదేశీ యూరియా సరఫరాను 30,800 టన్నుల నుంచి 60,000 టన్నులకు పెంచాలని వినతి చేశారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు తలెత్తిన యూరియా లోటును భర్తీ చేయడానికి అదనపు కోటాను కేటాయించాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు లేఖలో కోరారు.

# రాష్ట్రానికి సరిపడా యూరియాను కేంద్రం ఇచ్చింది

**- కేంద్రం నుంచి రాష్ట్రానికి ఇప్పటికే 12 లక్షల టన్నుల యూరియా: డికె అరుణ**



**హైదరాబాద్ వెలుతురు జూలై 02:**
రబీ సీజన్ కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి 12 లక్షల టన్నుల యూరియా పంపిణీ చేసిందని మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. నిజానికి ఈ సీజన్ కోసం రాష్ట్ర రైతాంగానికి సరిపోగా దాదాపు 1.5 లక్షల టన్నుల యూరియా మిగులుతుందని ఆమె అన్నారు, ఇంకా అదనంగా అవసరం అయితే ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వ సిద్ధంగా ఉందని ఆమె అన్నారు. డిఏపి కోటా 1.50 లక్షల మెట్రిక్ టన్నులు కాగా కేంద్ర ప్రభుత్వం 1.72 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరా చేసిందని అరుణ పేర్కొన్నారు. 2014 నుంచి ఇప్పటి దాకా 12 లక్షల కోట్ల కు పైగా ఎరువుల సబ్సిడీ రూపం లో కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేసిందని ఆమె చెప్పారు.

# ఫిలిప్పీన్స్‌లో కామారెడ్డి జిల్లా వైద్య విద్యార్థి మృతి

**- గుండెపోటుతో కుప్పకూలినట్లు స్నేహితుల వెల్లడి**

**కామారెడ్డి,జులై 2( వెలుతురు):**
ఫిలిప్పీన్స్‌లో కామారెడ్డి జిల్లాకు చెందిన వైద్య విద్యార్థి వడ్ల యోగి (23) మృతిచెందాడు. గుండెపోటుతో చనిపోయినట్లు అతడి బంధువులు తెలిపారు. పుట్టినరోజు నాడే మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. వివరాల్లోకి వెళితే.. దోంగ్లీ మండలం కుల్లెం గ్రామానికి చెందిన యోగి.. మూడేళ్ల క్రితం ఎంబీబీఎస్ కోసం ఫిలిప్పీన్స్ వెళ్లాడు. కళాశాలకు సెలవులు ఇవ్వడంతో 3 నెలల క్రితం స్వగ్రామానికి వచ్చి 15 రోజుల కిందటే తిరిగి అక్కడికి చేరుకున్నాడు. బుధవారం యోగి పుట్టినరోజు కావడంతో ఉదయం 8 గంటలకు అతడి కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం ఛాతీలో నొప్పి వస్తుందని యోగి తన తండ్రికి ఫోన్ చేసి చెప్పగా.. ఆస్పత్రికి వెళ్లాలని ఆయన సూచించారు. స్నేహితుల సాయంతో ఆస్పత్రికి వెళ్తుండగా మెట్లు దిగే క్రమంలో యోగి కుప్పకూలిపోయాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధరించారు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు అతడి స్నేహితులు తెలిపారు. కుమారుడి మరణవార్త విని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. తమ కుమారుడి మృతదేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు.



# సంపాదకీయం..

## జిఎస్టీ బాదుడుపై నోరు మెదపని చంద్రబాబు

జిఎస్టీ ఏ ముహూర్తాన వచ్చి చేరిందో కానీ ప్రజల నడ్డి విరుస్తోంది. ఎంతగా అంటే ఏది కొన్నా దానిపై అధిక మోతాదులో పన్నులకే సరిపోతోంది. చివరకు మనం ఆరోగ్యం కోసం తీసుకున్న ఇన్సూరెన్స్, సేవింగ్స్ కోసం తీసుకున్న జీవితభీమాలపైనా జిఎస్టీ తప్పడం లేదు. 12 నుంచి 18శాతం ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. ఎన్‌డిఎ కూటమిలో ఉన్న టిడిపి, నితీశ్ కుమార్ పార్టీలతో సహా ఇతర చిల్లర పార్టీలు కూడా దీనిపై మోడీని నిలదీయడం లేదు. ప్రజలు పడుతున్న బాధలకన్నా ఆదాయం సమకూరడమే వారికి ముఖ్యమయ్యింది. ఎందుకంటే జిఎస్టీ ఎంత వసూలు అయితే అందులో సగం రాష్ట్రాలకు వెళుతుంది. దీంతో పెన్షన్లు, కిలో రూపాయి బియ్యం ఇవ్వడం వంటివి అలవాటు చేసుకున్నారు. పెన్షన్ల పంపిణీకి స్వయంగా సిఎం చంద్రబాబు వెళ్లడం, పెద్దపెద్ద మీటింగ్‌లు పెట్టడం, చెక్కులు అందించడం దారుణం కాక మరోటి కాదు. ప్రతినెలా ఇవి ఖాతాల్లో నమోదు అవుతాయి. వీటికోసం హెలికాప్టర్లు, ప్రత్యేక విమానాలు వేసుకుని వెళ్లి చెక్కులు అందించడం దుబారా ఖర్చు కాక మరోటి కాదు. ఇంతగా దుబారా జరుగుతున్న ఎవ్వరూ నిలదీయడం లేదు. దుబారా పథకాలతో ఓట్లు దండుకునే ఎత్తులు తప్ప రాజకీయ నాయకులకు దేశం, రాష్ట్ర, ప్రజల అభివృద్ధిపై చిత్తశుద్ధి లేకుండా పోయింది. దుబారాలపై పరస్పరం విమర్శలు చేసుకోవడం ఫ్యాషన్‌గా మారింది. ఇకపోతే క్వాంటమ్, పోలవరం, అమరావతి గురించి మాట్లాడుతున్న చంద్రబాబు జిఎస్టీ వడ్డింపులపై మాట్లాడడం లేదు. ఎందుకంటే మోడీకి కోపం తెప్పించే ఏ పనీచేయక పోవడమే ఉత్తమమని భావిస్తున్నారు. గతంలో మోడీతో పెట్టుకుని ఐదేళ్లు అధికారానికి దూరంగా ఉన్న అనుభవం ఉంది. ఇకపోతే తాజా గాణాంకాల మేరకు రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లు పెరిగాయి. ఈ ఏడాది జూన్‌లో రూ.2,591 కోట్ల నికర జీఎస్టీ వసూలైంది. 2017లో జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పటి నుంచి జూన్ నెలకు ఇదే అత్యధికం. 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో మొత్తం వసూలైన నికర జీఎస్టీ రూ.8,860 కోట్లు. గతేడాది జూన్‌లో వచ్చిన రూ.3,910 కోట్ల పన్ను ఆదాయం కంటే ఇది 6.58 శాతం ఎక్కువ. ఈ ఏడాది జూన్‌లో ఐజీఎస్టీ సెటిల్మెంట్ రూ.1,365 కోట్లు వచ్చింది. వృత్తి పన్ను రూ.29 కోట్ల నుంచి రూ.49 కోట్లకు పెరిగింది. లిక్కర్‌పై వ్యాట్ రూ.61 కోట్ల నుంచి రూ.86 కోట్లకు, పెట్రోలియం ఉత్పత్తులపై వ్యాట్ రూ.1,380 కోట్ల నుంచి రూ.1,435 కోట్లకు పెరిగింది. ఇవన్నీ బాబు లాంటి వారికి ఆనందం కలిగించేవే. ఎందుకంటే ఆదాయం వస్తే తమ వాటా కూడా వస్తుందన్న ఆనందం. అందుకే బాబు జిఎస్టీపై నోరు మోఎదపడం లేదు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యాట్ స్థానంలో జీఎస్టీ పన్ను విధానాన్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఇది ప్రభుత్వానికి ఆదాయం పెరగటానికి తోడ్పడింది. గత పార్లమెంట్ సమావేశాల్లో ఇన్సూరెన్స్‌పై జిఎస్టీ తగ్గించాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కోరినా నిర్మలా సీతారామన్ ఈసడించుకున్నారు. నిజానికి ప్రజల సమస్యలను తెలుసుకునే బదులు ఎదురుదాడి చేశారు. అయితే ప్రస్తుతం మధ్యతరగతి భారతీయులకు అనుగుణంగా పన్ను రేట్లలో తగ్గింపును అందించ బోతున్నట్లు వెల్లడైంది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం అనేక వస్తువుల ధరలను అధిక జీఎస్టీ బ్రాకెట్ నుంచి తక్కువ పన్నులకు మార్చాలని కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు వెల్లడైంది. ఇదే నిజమైతే దీనిపై చర్చ చేయాలి. ఏయే రంగాల్లో ప్రజలు బాధపడుతున్నారో గుర్తించాలి. రాష్ట్రాల సిఎంలతో చర్చించాలి. అయితే ప్రస్తుతం మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి ఆదాయం కలిగిన ప్రజల కోసం జీఎస్టీ పన్నుల విషయంలో కూడా పెద్ద మార్పులకు కేంద్రం శ్రీకారం చుడుతోందని సమాచారం. దీనికింద 12 శాతం కింద ఉన్న అనేక వస్తువులపై పన్నును 5 శాతానికి తగ్గించనున్నట్లు వెల్లడైంది. నిజంగా ఇలాంటి ఆలోచన ఉంటే అనేక రంగాలపై పన్ను శాతాన్ని అత్యదికంగా 5శాతానికి తగ్గిస్తే మేలు. ఇకపోతే పన్నుల్లో హేతుబద్దత లేకపోవడం వల్ల చిన్న,మధ్యతరగి ప్రజలు, కంపెనీలు జిఎస్టీ కట్టుకోలేక దివాళా తీస్తున్నారు. వస్తువలపై డబుల్ డబుల్ పన్నులు పడుతున్నాయి. ఉప్పులు, పప్పులపై జిఎస్టీ పడ్డాక కూడా ఇడ్లీ దోశలపై పన్నులు వాయిస్తున్నారు. మధ్యతరగతి ప్రజలు హోటల్‌కు వెళ్లి టిఫిన్ చేయలేని దుస్థితి నెలకొంది. దేశంలో నిరుద్యోగ తీవ్రత చాలా ఎక్కువగా వుంది. దేశంలో పని చేయగలిగిన శ్రామికుల సంఖ్య 64 శాతానికి పెరిగిందని, కేవలం 37 శాతం మందికి మాత్రమే పనులు దొరికాయని ఓ నివేదిక తెలిపింది. యువతకు ఉపాధి కల్పించడం దేశం ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాల్‌గా మారింది. సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధ ప్రభావంతో నిరుద్యోగం మరింత తీవ్రం కానుంది. ఐటి సేవల రంగాలలో తక్కువ నైపుణ్యం ఉంటే చాలన్న రీతిలో సాగుతోంది. ఐటి కంపెనీలు కూడా ఉద్యోగులను ఉన్న పళంగా తీసేస్తున్నాయి. ప్రధాని మోడీ చెబుతున్నట్లుగా 2047 నాటికి దేశం సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే విద్యారంగం, వ్యవసాయరంగం కీలకమని నిపుణులు సూచిస్తున్నారు. అత్యధిక అక్షరాస్యత వున్న కేరళ తలసరి ఆదాయం దేశంలో మొదటి స్థానంలో వుంది. తర్వాత స్థానాల్లో తమిళనాడు, తెలంగాణ వున్నాయి. బీహార్ తలసరి ఆదాయం అతి తక్కువగా వుండడానికి అక్షరాస్యత కూడా ముఖ్య కారణమన్నారు. ఆరోగ్యం, సాంఘిక సంక్షేమం, గ్రామీణాభివృద్ధి రంగాలన్నింటికి నిధుల కేటాయింపులు తగ్గిపోతున్నాయి. మేక్ ఇన్ ఇండియా, మేడ్ ఇన్ ఇండియా నినాదాలను రాజకీయ ప్రచారం కోసం వాడుకుంటున్నారు. ప్రపంచీకరణ ఆర్థిక విధానాల వల్ల ప్రభుత్వ సేవలు కుదించుకుపోయాయి. పేద, మధ్య తరగతి వారికి వచ్చే అరకొర ఆదాయం నుండి విద్య, వైద్యానికి చేసే ఖర్చులు పెరిగిపోయాయి. ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో పాటు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు ప్రజల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. వీటిపై పన్నులు అంటే జిఎస్టీ వసూళ్లు దారుణంగా ఉన్నాయి. ఆర్థిక అంతరాలను తగ్గించడానికి సంపన్నుల మీద పన్నులు వేయడానికి మోడీ ప్రభుత్వం సిద్ధంగా లేదు. పేదరికం లేని సమాజం కోసం ప్రణాళికలు అమలు చేయడం లేదు.

# డిమాండ్‌కు అనుగుణంగా పంటలకు ప్రోత్సాహం ఏదీ

### వ్యవసాయానుబంధ రంగాలకు దక్కని ఊరట

### నిపుణుల సలహాలు పట్టించుకోని పాలకులు



**న్యూఢిల్లీ,జులై2( వెలుతురు):**
దేశంలో వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలను అభివృద్ధి చేయ లేనంతకాలం ఈ దేశం ఆర్థికంగా పురోగమించదని నిపుణులు పదేపదే సూచిస్తున్నా..అందుకు అనుగుణంగా అడుగులు వేయడం లేదు. దేశ జనాభాకు అనుగుణంగా అవసరమైన పంటలను ప్రోత్సహించాలి. వ్యవసాయ దిగుబడులను తగ్గించి, ఎగుమతులను పెంచుకోవాలి. వ్యవసాయాధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలన్న సూచనలు పెడచెవిన పెడుతున్నారు. ఈ క్రమంలో వ్యవసాయానుబంధ రంగాలను బలోపేతం చేయడం మినహా మరో గత్యంతరం లేదు. అయినా ఇటువైపు పాలకులు దృష్టి సారించడం లేదు. వ్యవసాయ రంగం నిర్లక్ష్యానికి గురి కావడంతో ఆహారభద్రత కూడా లేకుండా పోతున్నది. ఈ క్రమంలో వ్యవసాయాన్ని బలోపేతం చేస్తు తప్ప దేశం ఆర్థికంగా అభివృద్ధి సాధించలేదు. నదుల అనుసంధానం జరగడం లేదు. పూర్తి విద్యుత్ ఉత్పత్తి దిశగా పెట్టబడులు రావడం లేదు. మన దేశం అభివృద్ధి సాధించాలంటే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండాలని మోడీ ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన కొత్తలో వ్యవసాయాన్ని అభివృద్ధి చేసి, రైతుల ఆదాయాన్ని రెండింతలు చేస్తానన్న మోడీ హామీ పదేళ్లయినా అమలు కావడం లేదు. దేశ జనాభాలో 60 శాతం మందికి పైగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. అయినా ఈ రంగాన్ని పైకి తీసుకుని రావడం, వ్యవసాయాధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం జరగడం లేదు. పప్పుల ధరలు పెరుగుతున్నా, మనదేశంలో పప్పు పంటలను ప్రోత్సహించడం లేదు. నూనె ధరలు పెరుగుతున్నా, నూనెగింజల పంటలకు ప్రోత్సాహం దక్కడం లేదు. 2018-19 నాడు 7.8 శాతం అభివృద్ధితో వున్న వ్యవసాయరంగం 2024 మార్చి నాటికి 0.6 శాతానికి పడిపోయింది. వేగంగా దిగజారిపోతున్న వ్యవసాయ రంగాన్ని ఆదుకోవలసి వుంది. కానీ అలాంటి ప్రయత్నాలు జరగడం లేదు. ఆహార సబ్సిడీకి రూ.7,082 కోట్లు తగ్గించేశారు. రానున్న రోజుల్లో ఎరువులు, పురుగు మందుల ధరలు మరింతగా పెరుగుతాయి. పంటల పెట్టుబడి సహాయం పెంచకుండా, కనీస మద్దతు ధర, ఉచిత బీమా అమలు చేయకుండా వ్యవసాయ సంక్షోభాన్ని బిజెపి ప్రభుత్వం మరింత తీవ్రం చేస్తున్నది. ఆహార సబ్సిడీ తగ్గించడంతో పేదలకు అందుతున్న రేషన్ సరుకుల కోటా తగ్గిపోతుంది. ఆకలి కేకలు పెరుగుతాయి. వ్యవసాయ కూలీలకు, పేద రైతులకు కొంత ఊరటనిస్తున్న గ్రామీణ ఉపాధి హామీ పథకానికి గత బడ్జెట్‌లో కేటాయించిన రూ.86 వేల కోట్లలో, ఇప్పటికే చేసిన పనులకు చెల్లించాల్సిన బకాయిలు 44,500 కోట్ల వరకు ఉన్నట్లు అంచనా. ఇంత తక్కువ డబ్బుతో కోట్ల మంది పేదలకు పనులు ఎలా కల్పిస్తారన్నది అర్థం కావడం లేదు. అన్నింటికి మించి ఉపాధి పనులను వ్యవసాయానికి అనుబంధిం చాలన్న డిమాండ్ పట్టించుకోవడం లేదు. దేశంలో వ్యవసాయ కూలీలు దొరకడం లేదు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. అలాగే సామాన్యులకు తిండిగింజలు దొరకడం లేదు. అధిక ధరలతో సామాన్యులు ఉప్పులు, పప్పులు కొనుక్కోలేక పోతున్నారు. ఈ సమస్యలను పార్లమెంటు చర్చించదు. బయటా చర్చించడం లేదు. దీంతో ప్రధాన సమస్యలపై ప్రజల ఆవేదన పట్టించుకోవడం మానేశారు.

# బీహార్‌లో బూత్‌స్థాయి ఏజెంట్ల పెంపు

### ఆందోళనలు రాకుండా ముందే చర్యలు

### నివాసం ఉన్న చోటే ఓటు ఉండాలని ఆదేశాం



**న్యూఢిల్లీ,జులై2( వెలుతురు):**
బీహార్‌లో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కోసం బూత్ స్థాయి ఏజెంట్ల (బిఎల్ఎ)ను పెంచాలని ఎన్నికల కమిషన్ బుధవారం ఆదేశించింది. తర్వాత ఆందోళనలు లేవనెత్తకుండా ముందుగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రణాళిక ప్రకారం సజావుగా కొనసాగుతోందని, జూన్ 24న జారీ చేసిన ఆదేశాలను పాటిస్తోందని ఇసి పేర్కొంది. ఎస్ఐఆర్ ప్రక్రియ గురించి రాజకీయ పార్టీలతో బుధవారం జరగాల్సిన సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఇసి వర్గాలు తెలిపాయి. భారీ కసరత్తులో సుమారు లక్షమంది శిక్షణ పొందిన బూత్ లెవల్ అధికారులు, 243 మంది ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, 38 జిల్లా, ఎన్నికల అధికారులు, 9 డివిజన్‌ల కమిషనర్లు,బీహార్ ప్రధాన ఎన్నికల అధికారి సమన్వయంతో లక్షమంది వాలంటీర్లు పాల్గంటారు. ఇసిఐ ద్వారా నమోదు చేసిన గుర్తింపుపొందిన జాతీయ, రాష్ట్రీయ రాజకీయ పార్టీలు ఇప్పటికే పోలింగ్ స్టేషన్లలో 1.5లక్షలకు పైగా బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకున్నప్పటికీ, పార్టీలు అదనపు బిఎల్ఎలను నియమించడానికి సమయం ఉందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. తర్వాత ఫిర్యాదు చేయడం కన్నా ముందుగానే ఎక్కువ మంది బిఎల్ఎలను నియమించాలని ఇసి వర్గాలు తెలిపాయి. ఇదిలావుంటే ప్రజలు తాము ఎక్కడ నివాసం ఉంటున్నారో అక్కడే ఓటర్లుగా నమోదు చేసుకోవాలని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ స్పష్టం చేశారు. తమకు సొంత ఇల్లు వేరే చోట ఉందని అక్కడ ఓటరుగా నమోదు చేసుకోకూడదన్నారు. బిహార్‌లో ఓటర్ల జాబితాలను ప్రత్యేకంగా ముమ్మర తనిఖీ చేస్తున్ననేపథ్యంలో ఆయన ఈమేరకు తెలిపారు. నివాసం ఉంటున్న చోటే ఓటు ఉండాలన్న నిబంధన పాటించాలని అన్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ప్రజలు తాము ఏ అసెంబ్లీ నియోజకవర్గంలో నివాసం ఉంటున్నారో అక్కడ మాత్రమే ఓటుహక్కు పొందాలని తనను కలిసిన బూత్ స్థాయి అధికారులకు సీఈసీ వివరించారు. ఢిల్లీలో నివాసం ఉంటూ పట్నాలో ఇల్లు ఉందని అక్కడ ఓటుహక్కు పొందలేరని పేర్కొన్నారు. ప్రజలు తాము వలస వెళ్లిన చోట ఓటరుగా నమోదు చేసుకోవచ్చని, కాని పాత నియోజకవర్గంలో ఓటరు కార్డును ఉంచుకోవడం శిక్షార్హమైన నేరమని ఈసీ అధికారులు తెలిపారు.

# టిబెట్ బౌద్ధగురువు ఎంపికలో చైనా జోక్యం సహించడం

### తన వారసత్వం కొనసాగాలా లేదా అన్నది ప్రజలే నిర్ణయిస్తారు

### సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన దలైలామా



**న్యూఢిల్లీ,జులై2( వెలుతురు):**
టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా తాజాగా చైనాకు షాక్ ఇచ్చారు. 15వ దలైలామా ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని.. దానిని నిర్వహించే అధికారం గాడెన్ ఫోడ్రోంగ్ ట్రస్ట్‌కు మాత్రమే ఉందని తేల్చిచెప్పారు. ఈమేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు.తన వారసత్వం కొనసాగాలా, వద్దా అనే విషయాన్ని ప్రజలే నిర్ణయిస్తారని తాను 1969లోనే వెల్లడించినట్లు దలైలామా పేర్కొన్నారు. తాజా అభిప్రాయాల ఆధారంగా గాడెన్ ఫోడ్రోంగ్ ట్రస్ట్ మాత్రమే దలైలామా పునర్జన్మను నిర్ణయిస్తుందని.. ఈ ప్రక్రియలో మరెవరికీ జోక్యం చేసుకొనే అధికారం లేదని తేల్చిచెప్పారు. 2011 సెప్టెంబర్ 24నే తాను టిబెట్ బౌద్ధ మత పెద్దలు, నాయకులు, ఇతర సంస్థలతో భేటీ నిర్వహించి.. తన వారసుడి ఎంపిక కొనసాగించాలా..? అనే అంశంపై అభిప్రాయాలు కోరినట్లు పేర్కొన్నారు. దీనికి అన్నివర్గాల నుంచి సానుకూల స్పందనలు వచ్చాయన్నారు. స్పందించిన వారిలో టిబెట్ మతపెద్దలు, చైనాలోని వారు కూడా ఉన్నట్లు వెల్లడించారు. తన వారసత్వం భవిష్యత్తులో కొనసాగాలని వారంతా కోరుకున్నట్లు తెలిపారు. చాలా ఏళ్ల క్రితం దలైలామా ఒక దశలో తనతోనే ఈ సంప్రదాయం ముగిసిపోతుందని ఆందోళన చెందారు. కానీ, ఆ తర్వాత తన పునర్జన్మ టిబెట్ బయట జరగొచ్చని చెప్పారు. టిబెట్‌ను గుప్పిట పెట్టుకోవడానికి తమ చెప్పుచేతల్లో ఉండే కీలుబొమ్మను దలైలామా వారసుడిగా ఎంపిక చేయాలని చైనా ఎప్పటినుంచో ఉబలాటపడుతోంది. ఆ ప్రాంతాన్ని 1950లో ఆక్రమించిన చైనా- ఆ తరవాత దాన్ని తన భూభాగంలోకి మార్చేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసింది. ముఖ్యంగా చైనీస్ మూలాలున్న హన్ జాతి ప్రజలు ఇబ్బడిముబ్బడిగా టిబెట్‌లో స్థిరపడేలా చేసింది. ఆక్రమణ తరవాత లక్షల సంఖ్యలో అక్కడి చిన్నారులను దూర ప్రాంతాలకు తరలించి వారికి బ్రెయిన్ వాష్ చేసింది. అక్కడి పీఠభూమిలో విస్తారంగా బొగ్గు, రాగి, క్రోమియం, లిథియం, జింక్, సీసం, బోరాన్ నిక్షేపాలు ఉండడంతో వాటిపైనా చైనా కన్నేసింది. టిబెట్‌పై పట్టు కోసం భవిష్యత్తులో దలైలామా స్థానాన్ని కబ్జా చేయాలని చైనా భావించింది. ఆ స్థానం ఎంపికలో పంచయిన్ లామా పాత్ర చాలా కీలకం. టిబెట్‌లోనే ఉండిపోయిన పంచయిన్ లామా 1989లో అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఆయనపై విష ప్రయోగం చేశారంటారు. పంచయిన్ లామా వారసుడిగా ఎంపికైన బాలుడిని తన అధీనంలో ఉంచుకొన్నట్లు కొన్నేళ్ల కిందట బీజింగ్ ప్రకటించింది. ఈ ఎత్తుగడలను గ్రహించిన దలైలామా తన పునర్జన్మ టిబెట్ బయట కూడా జరగొచ్చని ప్రకటించారు. దీంతోపాటు వారసుడిని ఎంపిక చేసే ప్రక్రియ కూడా తమదేనని తేల్చిచెప్పారు.

# వరుస గుడెపోటు మరణాలు

### కోవిడ్ వ్యాక్సినలతో సంబంధం లేదు

### పరిశోధనల వివరాలు వెల్లడించి ఆరోగ్య మంత్రిత్వ శాఖ



**న్యూఢిల్లీ,జులై2( వెలుతురు):**
కరోనా మహమ్మారి తర్వాత దేశంలో ఆకస్మిక మరణాల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా 40 ఏళ్ల లోపు వారు కూడా కార్డియాక్ అరెస్ట్‌తో ప్రాణాలు కోల్పోతుండటం కలవరపెడుతోంది. కర్నాటక లోని హసన్ జిల్లాలో వరుస గుండెపోటు మరణాలపై ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలో ఐసీఎంఆర్, ఎయిమ్స్ వంటి సంస్థలు దీనిపై పరిశోధనలు చేపట్టి కీలక విషయాలు వెల్లడించాయి. ఈ మరణాలకు, కొవిడ్ వ్యాక్సిన్లతోఎలాంటి సంబంధం లేదని తమ అధ్యయనాల్లో తేలినట్లు స్పష్టం చేశాయి. మునుపటి అనారోగ్య సమస్యల ప్రభావమే ఆయా వ్యక్తుల మరణాల్లో కీలక అంశమని పేర్కొన్నాయి. ఈమేరకు అధ్యయనాల నివేదికలను కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తాజాగా ప్రకటించింది. జన్యుపరమైన సమస్యలు, జీవన శైలి, మునపటి అనారోగ్యాలు.. ఇలా ఏవైనా కావొచ్చు' అని అధ్యయనాల్లో తెలిపాయి. ఈ ఆకస్మిక మరణాలకు కొవిడ్ టీకాలే కారణమంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, తప్పుదోవ పట్టించేవేనని పునరుద్ఘాటించాయి. ఆధారాల్లేకుండా చేసే ఇలాంటి ప్రచారాలు వ్యాక్సిన్లపై విశ్వసనీయతను దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తంచేశాయి. కొవిడ్ మహమ్మారి సమయంలో ఈ టీకాల వల్లే ఎంతోమంది ప్రాణాలు నిలిచాయని గుర్తుచేశాయి. 18-45 ఏళ్ల వయసు వారిలో ఆకస్మిక మరణాలు సంభవించడంపై ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్), నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ), ఎయిమ్స్ పరిశోధనలు చేశాయి. 2023 మే-ఆగస్టు మధ్య 19 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని పలు ఆసుపత్రుల్లో సర్వే చేశాయి. ఆరోగ్యంగా కన్పించినప్పటికీ 2021 అక్టోబరు నుంచి 2023 మార్చి మధ్య ఉన్నట్టుండి మరణించిన వారి డేటాను పరిశీలించాయి. వీటిని అధ్యయనం చేసిన తర్వాత.. ఈ ఆకస్మిక మరణాలకు కొవిడ్ వ్యాక్సిన్లతో ఎలాంటి సంబంధం లేదని గుర్తించినట్లు ఆయా సంస్థలు వెల్లడించాయి. 'భారత్‌లో కొవిడ్ వ్యాక్సిన్లు సురక్షితం, సమర్థవంతమైనవి. వీటివల్ల దుష్ప్రభావాలు చాలా అరుదైన సందర్భాల్లో మాత్రమే కన్పించాయి. గుండె సంబంధిత ఆకస్మిక మరణాలకు అనేక కారణాలు ఉన్నాయి.

## మాజీ ముఖ్యమంత్రి రోశయ్య జన్మదినం జులై 4ను రాష్ట్ర వేడుకగా జరపడం విడ్డూరంగా ఉంది.

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్



**హైదరాబాద్ వెలుతురు జూలై 02:** మాజీ ముఖ్యమంత్రి తమిళనాడు గవర్నర్ రోశయ్య పుట్టినరోజు జూలై 4న తెలంగాణాలో రాష్ట్ర పండుగగా జరుపడం విడ్డూరంగా ఉందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారులుగా ఈ చర్యను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు లింగంగౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జూన్ 28న జీవో నం.853 తీసుకొచ్చి అన్ని జిల్లాల కలెక్టరేట్లలో సంబురాలు చేయమనడం దేనికి నిదర్శనం.జై తెలంగాణ అనే పదం ఎత్తితేనే సహించలేని రోశయ్యకు సంబరాలు చేయడమేమిటిని ప్రశ్నిస్తున్నాం కాంగ్రెస్ పార్టీకి ఇష్టమైతే గాంధీభవన్లో సంబరాలు చేసుకోవాలని అంతేగాని రాష్ట్రవ్యాప్తంగా చేయడం సరికాదన్నారు వెంటనే ఆ యొక్క జీవోను వెనక్కి తీసుకోవాలని అన్నారు



బిజెపి రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన సీనియర్ న్యాయవాది మాజీ ఎమ్మెల్సీ ఏన్ రామచందర్ రావు ను తన తోటి లీగల్ సెల్ సభ్యులతో బుధవారం రోజున కలిసి శుభాకాంక్షలు తెలియచేసిన బిజెపి యాచారం మండల పార్టీ అధ్యక్షులు జరుపుల విజయ్ నాయక్

**యాచారం వెలుతురు జూలై 02:**

## భగవంతుని ఆశీర్వాదంతో ప్రజల మద్దతుతో సమాజ సేవ చేస్తూ ప్రజల మన్ననలు పొందాలి

- ఎమ్మెల్యే కే.పి.వివేకానంద.






**కుత్బుల్లాపూర్ వెలుతురు జూలై 02:**
బుధవారం రోజున రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షులు, శ్రమశక్తి అవార్డు గ్రహీత ఎత్తారు మరయ్య గారి పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ గారి సమక్షంలో స్థానిక నాయకులు, సంఘ ప్రతినిధులు మరియు అభిమానుల సమక్షంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి.దఈ సందర్భంగా ఎమ్మెల్యే మరయ్య గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. “మీ సేవా ప్రయాణం భగవంతుని ఆశీర్వాదంతో, ప్రజల మద్దతుతో మరింత విస్తరించి, సమాజంలో మరింత గుర్తింపు పొందాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను” అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూధిమెట్ల సోమేష్ యాదవ్, 129 డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, 126 డివిజన్ సీనియర్ నాయకులు వేణు యాదవ్, వార్డు సభ్యులు సిద్ధికి, నిజాంపేట సీనియర్ నాయకులు సాంబశివా రెడ్డి, స్వామి మరియు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, సంఘ ప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

## దూలపల్లి PACS కు ISO & HYM సర్టిఫికేషన్

## - శుభాభినందనలు తెలిపిన ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

**దూలపల్లి వెలుతురు జూలై 02:**



బుధవారం రోజున దూలపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (PACS) ISO & HYM సర్టిఫికేషన్ అందుకున్న సందర్భంగా ఎమ్మెల్యే గారిని వారి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దూలపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (PACS) 5 ఏళ్లుగా ప్రజాప్రయోజనాలకే కట్టుబడి, ఉత్తమ పాలనతో నిరంతరంగా సేవలందించడంతో, ISO 9001:2015 మరియు HYM ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ను అందుకోవడం గర్వకారణమని ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ పేర్కొన్నారు. 1960లో స్థాపితమైన ఈ బ్యాంక్, గత 5 సంవత్సరాల్లో అత్యంత వేగంగా అభివృద్ధి చెందింది. 2019లో రూ.24.85 కోట్ల డిపాజిట్లు ఉండగా, 2024 నాటికి ఇవి రూ.56.82 కోట్లకు పెరిగాయి. అప్పుల జారీ రూ.21.22 కోట్ల నుంచి రూ.32.26 కోట్లకు, ఆస్తుల విలువ రూ.2.9 కోట్ల నుంచి రూ.9.97 కోట్లకు, లాభాలు రూ.53 లక్షల నుంచి రూ.1.25 కోట్లకు పెరిగినట్లు తెలిపారు. ఈ బ్యాంక్‌కు చెందిన రెండు భవనాలు మరియు ఐదు గోదాముల ద్వారా వార్షికంగా రూ.1.53 కోట్ల అద్దె ఆదాయం లభిస్తోంది. ఈ భవనాలు నాబార్డ్ నుండి రుణంగా పొందిన నిధులతో నిర్మించబడ్డాయి. ప్రస్తుతం బ్యాంక్ నెలకు రూ.1.19 లక్షల EMI చెల్లిస్తోంది. ప్యాక్స్ నిర్వహణ వ్యవస్థ రైతులకు మరియు ఖాతాదారులకు ప్రయోజనకరంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తోందని ఎమ్మెల్యే ప్రశంసించారు. ఈ బ్యాంక్ అభివృద్ధి ఇతర ప్యాక్స్‌కు ప్రేరణగా నిలుస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా పాక్స్ అధ్యక్షుడు నరేంద్ర రాజు, వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, డైరెక్టర్లు సిహెచ్ మధుసూదన్, పి. మల్లేష్, జి. కృష్ణ యాదవ్, డి. నరేందర్, బి. మధుసూదన్, ఎం. మదన్ రావు, ఏ. సత్యనారాయణ, సీఈవో శ్రీ కృష్ణ, మరియు ఇతర మేనేజ్మెంట్ సభ్యులు పాల్గొన్నారు.



# సీలింగ్ భూమిలో యదేచ్చగా అక్రమ నిర్మాణాలు..!




### నాడు సీలింగ్ భూమి నేను సక్రమమా ?

### నాడు అక్రమమని కూల్చివేతలు - నేడు పూర్తైన నిర్మాణాలు

### హైడ్రా ఫోకస్ కొన్నింటిపైనే ఎందుకో !

**వెలుతురు-మేడిపల్లి:**
మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం పీర్జాదిగూడ కార్పొరేషన్ పర్వతాపూర్ రెవెన్యూ పరిధిలోని సాలర్జంగ్ కంచే భూముల కథ కంచికేనా! అంటే అవుననే వాదనలు వినిపిస్తున్నాయి. సాలార్జంగ్ కంచేలోని సర్వే నెంబరు1 లో ఉన్న సీలింగ్ భూమిలో ఏలాంటి నిర్మాణాలు చేపట్టారాదని గతంలో రెవెన్యూ అధికారులు భారీ బంధోభస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. అప్పుడు పీర్జాదిగూడ కార్పొరేషన్ మేయర్ పూర్తి చేసే దశకు వచ్చాయి.

**నాడు సీలింగ్ భూమి నేడు సక్రమమెలా..?**

మేడిపల్లి రెవెన్యూ పరిధిలో పర్వతాపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 1 లో సీలింగ్ భూమి ఉందని రెవెన్యూ అధికారులు తెల్చి హద్దులు నిర్దారించారు.అనంతరం స్థానిక పోలీసుల భారీ బంధోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టి అవిశ్వాస తీర్మానం కోసమనే వాదనలు బలంగా వినిపించాయి.అనంతరం మేయర్ పీఠం హస్తగతం కావాడంతో నాడు కూల్చివేసిన నిర్మాణాలు మరలా చేపట్టి దాదాపు ఇక్కడ ఏలాంటి నిర్మాణాలు చేపట్టిన కఠిన చర్యలు ఉంటాయని సీలింగ్ ల్యాండ్ లో చేపట్టిన నిర్మాణాలను పూర్తి స్థాయిలో తొలిగించి భూమిని స్వాధీనం చేసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు.కానీ నాడు అధికారులు కూల్చి వేసిన నిర్మాణం నేడు దాదాపు పూర్తి అయ్యే దశకు చేరుకుంది.అంటే ఇక్కడ ఎమైనా లావాదేవీల మధ్య సీలింగ్ భూమి సక్రమం అయ్యిందా ? అంటే అవుననే వాదనలు వస్తున్నాయి.

**హైడ్రా ఫోకస్ కొన్నింటిపైనే ఎందుకు?**

గత నెలలో సీలింగ్ భూమిని కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలను కూల్చి వేస భూమిని స్వాధీనం చేసుకున్న హైడ్రా కు దాని పక్కన చేపట్టిన నిర్మాణం ఎందుకు కనపడలేదో ఇప్పటికీ అర్ధం కానీ అంశంగా మిగిలింది.కొన్నింటిని సీరియస్ గా కూల్చివేసే హైడ్రా ఈ విషయంలో ఎందుకంటే నాన్చివేసే ధోరణి అవలంబిస్తుందోననే సందేహాలు వినిపిస్తున్నాయి.సీలింగ్ భూముల్లో నిర్మాణాలను నిర్దాక్షిణ్యంగా నేలమట్టం చేసిన రెవెన్యూ అధికారులు ఈ విషయంలో ఎందుకు మీనవేశాలు వేస్తున్నారో ప్రజలకు అర్ధం కావాడం లేదంటా.మరీ ఇప్పటికైన పారదర్శకంగా వ్యవహరిస్తారా లేదా చూడాలి.

# పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత

## - శ్రీరాములు అందెల

**చెట్లను నాటుదాం పర్యావరణాన్ని కాపాడుదాం**

**- బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి**

**బడంగ్ పేట్ వెలుతురు జూలై 02:**
మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని నాదర్గుల్ గ్రామంలో గౌరవనీయులు శ్యామ ప్రసాద్ ప్రసాద్ ముఖర్జీ గారి బలిదాన్ దివస్ పురస్కరించుకొని బుధవారం రోజున బిజెపి కిసాన్ మోర్చా ఏపీఎంసీ కన్వీనర్ మరియు మాజీ ఎంపీటీసీ సభ్యులు ఏనుగు రామ్ రెడ్డి గారి ఆధ్వర్యంలో వారి వ్యవసాయ క్షేత్రంలో కిసాన్ సంవాద్ కార్యక్రమంలో భాగంగా అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ అందెల శ్రీరాములు, మాజీ రంగారెడ్డి రూరల్ జిల్లా బిజెపి అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి హాజరై మొక్కలను నాటడం జరిగింది. ఈ సందర్భంగా కొండపల్లి శ్రీధర్ రెడ్డి గారు మాట్లాడుతూ రోజురోజుకు ప్లాస్టిక్ వాడకం అధికం కావడంతో పర్యావరణం పై పేను ప్రభావం పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మానవత దృక్పథంతో తమ వంతుగా చెట్లను నాటి పర్యావరణన్ని పరిరక్షించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా



రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తర్రే మల్లేష్ యాదవ్, కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు రామిడి వీరకర్ణ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు ఏనుగు ప్రభాకర్ రెడ్డి, మాజీ కార్పొరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్లు తోట శ్రీధర్ రెడ్డి, నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, గూడెపు ఇంద్రసేన, గడ్డం లక్ష్మారెడ్డి, దడిగ శంకర్, రామోజీ అమితా శ్రీశైలం చారి, సహకార బ్యాంక్ డైరెక్టర్ తోట ప్రతాపరెడ్డి, మాజీ సహకార బ్యాంక్ డైరెక్టర్ ఏనుగు వెంకట్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు పాలు బాయ్ లక్ష్మణ్, గూడూరు శేఖర్ రెడ్డి, ఏనుగు రామ్ రెడ్డి, మర్రి అంజిరెడ్డి, శక్తి కేంద్ర ఇన్చార్జ్ నిమ్మల రవికాంత్ గౌడ్, ఏనుగు జంగారెడ్డి, తోట అరేందర్ రెడ్డి, ఏనుగు మోహన్ రెడ్డి, మంత్రి శ్రీధర్ ముదిరాజ్, బంగారు సుమన్, లాలం బాల నరసింహ యాదవ్, ఎడ్ల శ్రీశైలం ముదిరాజ్, భాస్కర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# డివిజన్ లో 10 నుంచి 12 చెట్లు ఉన్నాయి అవి కూడా కూలిపోయే ప్రమాదం ఉంది

**పెద్ద వర్షాలు గనుక వస్తే ఒక రెండు మూడు రోజులు ఆ చెట్లు కూడా కూలిపోయే ప్రమాదం ఉంది**

**జిహెచ్ఎంసి కమిషనర్ కన్నన్ గారి దృష్టికి తీసుకెళ్లిన కార్పోరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్**

**హైదరాబాద్ వెలుతురు జూలై 02:**
బుధవారం రోజున హిమాయత్ నగర్ డివిజన్లో ఆయిల్ సీడ్స్ కాలనీలో సెల్లార్ కన్స్ట్రక్షన్ వర్క్ జరుగుతుంది, ఫుట్పాట్ ఎన్క్రోచ్మెంట్ చేయడం వల్ల ఒక 30 సంవత్సరాల పాత చెట్టు పడిపోవడం జరిగింది, ఒక చెట్టు పెరగడానికి ఎన్నో సంవత్సరాలు పడతది కానీ కన్స్ట్రక్షన్ చేసుకోవడం కోసం వాళు ఏదైతే ఫుట్పాత్ ని ఎంకరేజ్ చేశారు దానివల్ల చెట్టు కూలిపోవడం జరిగింది . ఆ టైంలో ఆ చెట్టు కన్స్ట్రక్షన్



జరుగుతున్న ఏరియాలోకి పడింది కాబట్టి సరిపోయింది లేని పక్షంలో అది గనుక రోడ్డు మీదకు పడితే మెయిన్ రోడ్డు వాహనాలు రద్దీగా తిరిగే ప్రాంతం ఆ చెట్టు ముందరకు పడితే పెద్ద ట్రాన్స్ఫారం వయసు తెగిపోవడము చుట్టుపక్కల భారీ నష్టం జరిగేది అంతేకాకుండా ఆ ప్రాంతంలో పబ్లిక్ వాహనం కూడా ఎక్కువ తిరుగుతుంటాయి ఎవరి మీద పడిన ప్రాణనష్టం కూడా జరిగి ఉండేది కాబట్టి కనీసం తీసుకోవలసిన ముందు జాగ్రత్త చర్యలు అన్నవి ఆ కన్స్ట్రక్షన్ చేస్తున్న వారు ఎవరైతే ఉన్నారో వాళ్ళు తీసుకోకపోవడం వల్ల ఈ చెట్టు అటు కూలిపోవడం జరిగింది ఎవరైనా సరే ఇలాంటి కన్స్ట్రక్షన్స్ చేసుకున్నప్పుడు తీసుకోవాల్సిన మినిమం జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది అంతేకాకుండా ఆ ఒక్క చెట్టే కాదు ఇప్పుడు నిర్లక్ష్యం వహిస్తే అటు సైడ్ ఉన్న దగ్గర దగ్గర 10 నుంచి 12 చెట్లు ఉన్నాయి అవి కూడా కూల్పోయే ప్రమాదం ఉంది పెద్ద వర్షాలు గనుక వస్తే ఒక రెండు మూడు రోజులు ఆ చెట్లు కూడా కూలిపోయే ప్రమాదం ఉంది, అని జిహెచ్ఎంసి కమిషనర్ కన్నన్ గారి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది, రవికిరణ్ గారి దృష్టికి కార్పోరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ తీసుకువెళ్లడం జరిగింది,

# మరోమారు పాశమైలారానికి మంత్రి దామోదర

**- మీనాక్షి, మహేశ్ కుమార్ గౌడ్‌ల రాక**

**- మంత్రిని నిలదీసిన బాధిత కుటుంబాలు**

**సంగారెడ్డి,జులై2( వెలుతురు):**
సిగాచి పరిశ్రమ వద్దకు చేరుకున్న మంత్రి దామోదర రాజనర్సింహను బాధితులు నిలదీసారు. ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి బుధవారం ఉదయం ఘటనా స్థలికి చేరుకున్నారు. మంత్రి వెంట తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, జగ్గారెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా ప్రమాద స్థలిని వారు పరిశీలించారు. అయితే అధికారుల ముందు బాధితుల బంధువులు ఆందోళనకు దిగారు. మంత్రి దామోదరతో బాధితులు వాగ్వాదానికి దిగారు. మూడు రోజులైనా తమ వారి ఆచూకీ చెప్పడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చర్యలు చేపడతామంటూ బాధితులను మంత్రి దామోదర రాజనర్సింహ సముదాయించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. సిగాచి ప్రమాద ఘటనలో ఇప్పటి వరకు 36 మృతదేహాలు లభ్యమయ్యాయని.. 13 మంది మిస్సింగ్‌లో ఉన్నారని తెలిపారు. 11 మంది మృతదేహాలను అప్పగించామన్నారు. ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్ వచ్చాక మిగిలిన మృతదేహాలను వాళ్ళ కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని



అన్నారు. ప్రతిపక్షాలు దీన్ని రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ఘటనను ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని స్పష్టం చేశారు. కంపెనీ యజమాని అందుబాటులోకి వచ్చారని.. ఇప్పటికే కంపెనీపై కేసు నమోదు చేయించామన్నారు. మిగిలిన శిథిలాలు తొలగిస్తే మిగతా 11 మంది ఆచూకీ లభించే అవకాశం ఉందని మంత్రి దామోదర వెల్లడించారు. ఈ ఘటనను కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ సీరియస్‌గా తీసుకున్నారని రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ తెలిపారు. బాధితులకు నష్టపరిహారాన్ని ప్రభుత్వం ఇప్పటికే చెల్లించిందని.. కంపెనీ నుంచి కూడా బాధితులకు నష్టపరిహారం అందజేసేలా చూస్తామని అన్నారు. ఈ ఘటనపై ఇప్పటికే కమిటీ వేశామని మీనాక్షి తెలియజేశారు. ముఖ్యమంత్రి , మంత్రులు ఈ ఘటనపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందిస్తున్నామని చెప్పారు. మృతదేహాలను ప్రత్యేకంగా ఫ్రీజర్లలో మార్చురీలో భద్రపరిచామన్నారు. గాయపడిన వారికి కంపెనీ పరంగా ఆదుకుంటామన్నారు. ఈ ఘటనను ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. మరోవైపు సిగాచి పరిశ్రమలో మూడోరోజు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. భారీ క్రేన్లు, జేసీబీలతో శిథిలాల తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. అయితే తమ వారి ఆచూకీ తెలియడంలేదంటూ ఘటనా స్థలిలో బంధువుల ఆందోళనకు దిగారు.

# ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల దోపిడీని నియంత్రించాలి

బి ఆర్ ఎస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ ఎర్ర నాసర్

**వెలుతురు న్యూస్, అచ్చంపేట/అమ్రాబాద్ జూన్ 2:**
మండలం కేంద్రం లో ఏర్పాటు చేసిన సమావేశం లో ఎర్ర నాసర్ మాట్లాడుతూ.. జిల్లాలో సి బి ఎస్ ఈ కు ఇప్పటివరకు ఎలాంటి పర్మిషన్ లేకుండా కూడా సెంట్రల్ సిలబస్ పేరుతో ప్రైవేటు పాఠశాలలు తీవ్రంగా దోపిడీ చేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు పాఠశాలల్లో పదవ తరగతికి సంబంధించి ఒక్క సెక్షన్ కు మాత్రమే పర్మిషన్ ఉంది మిగతా సెక్షన్లకు పర్మిషన్ లేకుండా వేరే పాఠశాలలు నిర్వహిస్తున్నారు. అక్కడ సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. అదేవిధంగా పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్ ,డ్రస్సుల పేరుతో భారీగా పీడిస్తున్నారు. ఆ స్కూల్లో విద్య ఏం చెప్పడం లేదని చాలామంది తల్లిదండ్రులు ఆవేదనతో బాధపడుతున్నారు. గతం లో డబ్బుల దోపిడీ పేరు తో చిన్న చిన్న విద్యార్థులను చితకబదినా ఘనటనలు చాలా ఉన్నాయి. అదేవిధంగా ప్రైవేటు పాఠశాలల్లో సదుపాయాలు లేవు. అది స్కూల్ బిల్డింగ్ కాదు. స్కూల్ వాతావరణంలో నడపకుండా ఒక ఇంట్లో నడుపుతున్నారు. దానికి ఆటస్థలం లేదు కాంపౌండ్ వాల్ లేదు అసలు రూల్ ప్రకారం ఏమీ లేవు. ఫీజుల పేరు తో భారీ దోపిడీ చేస్తున్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు



ప్రతి విద్యా సంవత్సరం ఫీజులను ఇష్టానుసారంగా పెంచుతున్నారని అన్నారు. తల్లిదండ్రు లు తమ పిల్లలను మంచి భవిష్యత్తు ఇవ్వడం కోసం ఇంగ్లీష్ మీడియం లో చదివించాలని అనుకున్న కూడా ఈ ప్రవేట్ విద్యాసంస్థల్లో అధికంగా ఫీజు ఉండటం వలన వారు నిరాశ చెందవలసిన పరిస్థితి ఏర్పడుతుంది అలాగే రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో ప్రవేశపెట్టిన నిబంధనలను ఉల్లంఘించి ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల యజమాన్యం ప్రవర్తిస్తుందని , అడ్మిషన్ ఫీజు కళాశాల ఫీజు ఒకేసారి కట్టాలని విద్యార్థులని ఇబ్బందులకు గురిచేస్తుంది అంతే కాకుండా నీట్ కోచింగ్ పేరుతో విద్యార్థుల దగ్గర్నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 2 సంవత్సరాలు అవుతున్న విద్యా వ్యవస్థలో ఉన్న సమస్యలను పట్టించుకోకపోవడం ఏమిటనీ మండిపడ్డారు. అందువలన ఫీజులు నియంత్రణ చట్టం అమలు చేయడం వలన ప్రభుత్వం నిర్ణయించిన మేరకు ప్రైవేటు విద్యా సంస్థలు ఫీజులను వసూలు చేయడానికి వీలవుతుందని, ఈ చట్టం వలన బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ఉచితంగా చదవికోవడానికి ఉపయోగపడుతుందని అన్నారు. ఈ చట్టం వలన విద్యార్థుల భవిష్యత్తు మారుతుందని, అలాగే విద్యా వ్యవస్థ కూడా మెరుగుపడుతుంది.అదేవిధంగా విద్య హక్కు చట్టం 2009 నిబంధనల ప్రకారం ప్రైవేట్ విద్యా సంస్థ ల్లో 25% పేద విద్యార్థులకు విద్యా అందించాలి కానీ ఇప్పుడు ఈ ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాల వారు అట్టి నిబంధన తుంగలో తొక్కే విధంగా విద్య హక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారు. అందువలన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా విద్యార్థులకు న్యాయం చేయాలని, దీనికోసం ప్రవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తడం మల్లేష్ నోముల జగన్ గౌడ్ బరపాటి వెంకటేష్ రాములు జగన్ తదితరులు పాల్గొన్నారు.

# ఖబడ్దార్ కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి కక్ష సాధింపు చర్యలకు పాల్పడే నైజం నీది, మీ టిఆర్ఎస్ ది

**కక్ష సాధింపు చర్యలకు పాల్పడి గతంలో రాజగోపాల్ రెడ్డి గారి అభిమానుల ఉద్యోగాలు తీయించిన చరిత్ర మీది**

**ఆ విషయాన్ని తెలుసుకోకుండా అవాకులు చవాకులు పేలుతున్నారు**

**అవినీతి అక్రమాల విషయంలో ఎవరైనా ఒకటే..**

**బీసీ కార్డు వేసుకొని బదనాం చేస్తున్నావ్..**

**ఆరోజు బీసీ బిడ్డ అయిన నిన్నే మున్సిపల్ పీఠంపై కూర్చోబెట్టిన విషయాన్ని మరవద్దు**

**కమిషన్ల కోసం కాంట్రాక్టర్లను వేధించిన హీన చరిత్ర మీది..**

**మీ ప్రభుత్వంలో పనులు చేసి దగా పడ్డ కాంట్రాక్టర్లకు బిల్లులు ఇప్పించి అభివృద్ధి చేస్తున్న ఘన చరిత్ర రాజగోపాల్ రెడ్డి గారిది..**

**చండూరు వెలుతురు జూలై 02:**



గతంలో అధికారాన్ని అడ్డం పెట్టుకొని చండూరు మున్సిపల్ మాజీ చైర్మన్ తోకల వెంకన్న గ్రామకంఠం భూమిని అక్రమంగా కబ్జా చేసి నిర్మించిన భవనాన్ని కోర్టు ఆదేశాల మేరకు అధికారులు తొలగించడంతో దానిని రాజకీయం చేస్తూ బుధవారం రోజున చండూరు పట్టణంలో ఒక హైడ్రామా సృష్టించి మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారి పై అవాకులు చవాకులు అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డికి గట్టి కౌంటర్ ఇచ్చారు చండూరు మండల చండూరు పట్టణ కాంగ్రెస్ నాయకులు... కక్ష సాధింపు చర్యకు పాల్పడే చరిత్ర టిఆర్ఎస్ది కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డిదని అన్నారు కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంటసత్యం.. టిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కేవలం రాజగోపాల్ రెడ్డి గారి అభిమానిని అని తన ఉద్యోగం తీసేసారని కానీ ఏరోజు కూడా మీరు కచ్చితంగా మీరు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మేము చెప్పలేదని అన్నారు.. ఈ రోడ్లన్ని మేము అధికారంలో ఉన్నప్పుడు మంజూరు చేయించి తీసుకొచ్చినవేనని గొప్పలు చెప్పుకుంటున్న కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఇదే రోడ్డు పనులు చేసిన కాంట్రాక్టర్ ప్రభాకర్ రెడ్డి కి బిల్లులు ఇవ్వలేని స్థితికి తీసుకొచ్చారని.. రాజగోపాల్ రెడ్డి వచ్చాక టిఆర్ఎస్ కు చెందిన మనిషి అయిన కాంట్రాక్టర్ ప్రభాకర్ రెడ్డికి సుమారు 15 కోట్ల బిల్లులు ఇప్పించి అభివృద్ధిని ఆగకుండా ముందుకు తీసుకెళ్తున్నాడని అన్నారు చండూరు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దోటి వెంకన్న.. అధికారాన్ని అడ్డం పెట్టుకొని అక్రమంగా కబ్జా చేయడమే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించుకున్న భవనాన్ని కోర్టు ఆదేశాల మేరకు అధికారులు తొలగిస్తే బీసీని కాబట్టే నా పైన కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మాజీ చైర్మన్ తోకల వెంకన్న అనడం విడ్డూరంగా ఉందన్నారు చండూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఓంకారం..ఇదే బీసీ వర్గానికి చెందిన నిన్ను ఆరోజు మున్సిపల్ చైర్మన్ ను చేసిన ఘనత రాజగోపాల్ రెడ్డి గారిదేనన్నారు.. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఎక్కడ లేని విధంగా మునుగోడు నియోజకవర్గం లో మండల పార్టీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు వివిధ ముఖ్య పదవులు ఎక్కువ శాతం బీసీలకు కేటాయించిన ఘనత రాజగోపాల్ రెడ్డి గారిదన్నారు రాజగోపాల్ రెడ్డి దమ్ముంటే రా చూసుకుందాం అని కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అంటున్నారని.. నీకు సమాధానం చెప్పడానికి రాజగోపాల్ రెడ్డి అవసరం లేదు.. మేము చాలు సమాధానం చెప్పడానికి అని అన్నారు చండూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అనంత చంద్రశేఖర్.. రాజగోపాల్ రెడ్డి గారి పేరు పలికే అర్హత కూడా కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి గారికి లేదన్నారు.. మేము నిజంగా కక్ష సాధింపు చర్యలకు పాలు పడితే టిఆర్ఎస్ నాయకులు ఒక్కరు కూడా నియోజకవర్గంలో తిరగలేరని హెచ్చరించారు.. ఈ ప్రెస్ మీట్ లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంటసత్యం, చండూర్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ దోటి వెంకన్న, చండూరు పట్టణ అధ్యక్షులు అనంత చంద్రశేఖర్, చండూరు మండల అధ్యక్షుడు ఓంకారం గార్లు పాల్గొన్నారు...

# సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

**- సిఐటియు జిల్లా అధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ.**



**మునుగోడు, జూలై 2 (వెలుతురు):**
ఈనెల 9వ తేదీన కార్మికుల సంక్షేమం కోసం చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో మండల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సమస్యలను మోడీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని,కార్మికుల సంక్షేమాన్ని,చట్టాలను రద్దు చేసేందుకు కుట్ర చేస్తుందని ఆరోపించారు. కేంద్రం కొత్తగా నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చి కార్మికుల హక్కుల్ని కాలరాస్తున్నారని పేర్కొన్నారు.దేశంలో ప్రజల రెక్కల కష్టంతో నిర్మితమైన ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా అమ్ముతున్నారని విమర్శించారు.18 డిమాండ్ల సాధన కోసం జరుగుతున్న పోరాటంలో కార్మిక వర్గం,ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ వరికుప్పల ముత్యాలు, మండల నాయకులు ఎరగని లింగయ్య,ఎర్ర అరుణ,రాజు,అండాలు, పెద్దమ్మ,లక్ష్మయ్య, మండల కమిటీ సభ్యులు,యూనియన్ లీడర్స్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పలు సమస్యలను పరిష్కరించాలని ఇంచార్జ్ తహసీల్దార్ కి వినతిపత్రం అందజేత

**మునుగోడు, జూలై 2 (వెలుతురు):**
మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో బుధవారం ఇంచార్జ్ తహసీల్దార్ నేలపట్ల నరేష్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి,మిర్యాల భరత్ లు మాట్లాడుతూ సంబంధిత అధికారులు స్పందించి వీలైనంత త్వరగా పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణాన్ని చేపట్టాలని,విద్యార్థుల మధ్యాహ్న భోజనం కోసం నిర్మించిన డైనింగ్ హాల్ ను వినియోగం లోకి తీసుకురావాలని కోరారు. లేనిపక్షంలో తమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు బొడ్డుపల్లి నరేష్,యాసరాని వంశీకృష్ణ,మండల ఉపాధ్యక్షులు యాట శ్రీకాంత్,యాదయ్య, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# షుగర్ బిపి ఔషధాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జిఎస్టిని ఎత్తివేయాలి

ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు సంబు వెంకటరమణ

**వెలుతురు న్యూస్, అచ్చంపేట/అమ్రాబాద్ జూన్ 2:**
ఒకే దేశం ఒకే పన్ను అని ఈనెల ఒకటవ తారీఖున ప్రారంభమైన జీఎస్టీ పన్ను షుగర్, బిపి ఔషధాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జి ఎస్ టి ని రద్దు చేయాలని ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు శంభు వెంకటరమణ, జూలూరి సత్యనారాయణ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం షుగర్, బిపి అన్ని వయసుల వారిని పట్టిపీడిస్తున్న వ్యాధులనీ జనాభాలో 60% ప్రజలకు బీపీ షుగర్ ఔషధాలు అత్యవసర



పడుతున్నాయని వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకొని బిపి షుగర్ బారిన పడిన ప్రజలను ఆర్థిక భారం నుంచి ఆదుకోవాలని వెంటనే అట్టి ఔషధాలపై జి.ఎస్.టి నీ రద్దు చేయాలని వారు కోరారు.

# మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 ద్వారా వేతనాలు చెల్లించాలి: తపస్




**టేక్మాల్ వెలుతురు జూలై 02:**
ప్రస్తుత విద్యా సంవత్సర సభ్యత్వ అభియాన్ లో భాగంగా టేక్మాల్ మండలంలో వివిధ పాఠశాలల్లో తపస్ సభ్యత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా తపస్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ మాట్లాడుతూ 0 1 0 ద్వారా మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలని, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు ఎలక్షన్ ముందు ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని, వారి సమ్మె కాలపు వేతనాన్ని చెల్లించాలని, ఉద్యోగ,ఉపాధ్యాయులకు క్యాష్ లెస్ హెల్త్ కార్డులను మంజూరు చేయాలని, పెండింగ్లో ఉన్న డిఏ మరియు పిఆర్సిలను వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టేక్మాల్ తపస్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్ రెడ్డి, సతీష్, మోడల్ స్కూల్ ఉపాధ్యాయ సంఘం నాయకులు కిరణ్మయి, రవికుమార్,అపారంజిత, పార్థసారధి, అనిల్ తదితరులు పాల్గొన్నారు

# మాజీమంత్రి, గిరిజన నేత కవాసీ లఖ్మాకు సీతక్క పరామర్శ

**- రాయపూర్ జైలుకు వెళ్లి పరామర్శ**

**- కుట్రపూరితంగా కేసులు పెట్టారని విమర్శ**

**రాయపూర్,జులై 2( వెలుతురు):**



చత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్ సెంట్రల్ జైలులో ఆ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మాజీ మంత్రి కవాసీ లఖ్మాను మంత్రి సీతక్క పరామర్శించారు. మంత్రి సీతక్క వెంట ట్రైకార్ చైర్మన్, ఆదివాసి కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు బెల్లయ్య నాయక్ ఇతర నేతలు జైలులో లఖ్మాను పరామర్శించి ఆయన కుటుంబ సభ్యులకు, అనుచరులకు సంఘీభావం తెలిపారు. అనంతరం స్థానిక మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు. మాజీ మంత్రి ఆరు సార్లు ఎంఎల్ఎ, ఆదివాసీల అగ్రనేత కవాసీ లఖ్మాని అకారణంగా అరెస్టు చేశారన్నారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే లఖ్మాని బిజెపి ప్రభుత్వం అక్రమ కేసులతో వేధిస్తోందని ఆరోపించారు. నిరాధారమైన కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఏలాంటి సాక్షాధారాలు లేకుండానే తప్పుడు కేసులతో ఆరు నెలలుగా జైలులో పెట్టారని ఆరోపించారు. బస్తర్‌లో ఆదివాసీల గొంతుకగా ఉన్న లఖ్మా అక్రమ అరెస్టును ఖండిస్తున్నామన్నారు. ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసీలను బిజెపి ప్రభుత్వం బలవంతంగా తరిమి వేస్తోందని విమర్శించారు. ఆదివాసీల అణిచివేతలో భాగంగానే లఖ్మాపై తప్పుడు కేసులు నమోదు చేశారని ఆరోపించారు. కవాసీ లఖ్మా కుటుం బానికి కాంగ్రెస్ అండగా నిలుస్తోందన్నా. ఆయనకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పక్షాన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# ఆదివాసి చెంచు గిరిజనులకు పండ్ల మొక్కలు అందజేసిన కోనేరు సంస్థ




**వెలుతురు న్యూస్, అచ్చంపేట జూన్ 2:**
కోనేరు సంస్థ ఆధ్వర్యంలో లింగాల మండలంలోని వడ్డె రాయవరం, అవసలికుంట, కొత్త కుంటపల్లి, అప్పాయి పల్లి, బల్మూరు మండలం అంబగిరి, అచ్చంపేట మండలం ఐనోల్, బొమ్మనపల్లి గ్రామాలలోని ఆదివాసి చెంచు గిరిజన కుటుంబాలకు పండ్ల మొక్కలు జామ, నేరేడు, నిమ్మ, మామిడి ఉసిరి మొక్కలను ఆయా గ్రామాల చెంచు ప్రగతి సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేయడం జరిగిందని కోనేరు సంస్థ ప్రాజెక్టు మేనేజర్ పెద్దులయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసి చెంచు గిరిజనులకు ఆహార ధాన్యాల పంటలు , కూరగాయలతో పాటు పండ్ల మొక్కలను సాగు చేసుకుని ఆర్థికంగా ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ మొక్కలను పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇట్టి అవకాశాన్ని చెంచు గిరిజన రైతులు మొక్కలను పెంచి పోషించుకుని వాటి పొలాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల చెంచు ప్రగతి సేవా కమిటీ సభ్యులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మలబార్ గోల్డ్ పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వ మద్దతును ఉపసంహరించుకోవాలి

**- స్వర్ణకార వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలి.**

**- జిల్లా స్వర్ణకార సంఘం ఉపాధ్యక్షుడు కన్నెకంటి వెంకటేశ్వరాచారి**

**రామన్నపేట వెలుతురు న్యూస్ జులై 02**



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలో మలబార్ గోల్డ్ కార్పొరేట్ సంస్థ సుమారు రూ"700 కోట్ల పెట్టుబడితో ప్రారంభించనున్న కర్మాగారం రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా,ప్రారంభించబోతుండడాన్ని జిల్లా స్వర్ణకార సంఘం తరఫున తీవ్రంగా ఖండిస్తున్నాం.ఈ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చేతి వృత్తులకు చేయూతను అందించవలసిన,ప్రభుత్వాలు కార్పొరేట్ వ్యవస్థకు వెన్నుదన్నుగా ఉంటూ తరతరాలుగా,కులవృత్తులను నమ్ముకున్న స్వర్ణకారుల బ్రతుకులను చిన్నాభిన్నం చేసే ఇలాంటి నిర్ణయాల వల్ల మా స్వర్ణకార వృత్తిదారులు ఇంకా పనులు కోల్పోయే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. ఓవైపు కార్పొరేట్ జ్యువెలరీ షాపుల మూలంగా వృత్తులు కోల్పోయి మా స్వర్ణకారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, ఓవైపు పెరుగుతున్న బంగారం ధరల మూలంగా పనులు లేక ఇప్పటికే అనేకమంది స్వర్ణకారులు ఆత్మహత్యలు చేసుకుంటున్న తరుణంలో ప్రభుత్వం చేపడుతున్న ఇలాంటి చర్యలను మేము తీవ్రంగా ఖండిస్తూ ఇప్పటికైనా ప్రభుత్వం కార్పొరేట్ జ్యువెలరీ వ్యవస్థకు,అందించదలచుకున్న మద్దతును ఉపసంహరించుకొని స్వర్ణకార వృత్తిదారులకు మద్దతు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ సమావేశంలో నాయకులు శ్రీరామోజు నరసింహాచారి,చోల్లేటి చంద్రశేఖర్ చారి మారోజు రాఘవాచారి శుభకోటి శశి కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

# జనం పల్లి పాల సంఘం చైర్మన్ గా బండ దామోదర్ రెడ్డి ఏకగ్రీవం ఎన్నిక



**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 02**
మండలం జనం పల్లి పాల సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి బండ దామోదర్ రెడ్డి చైర్మన్ గా ఏకీగ్రంగా ఎన్నికైనారు. నూతన డైరెక్టర్లుగా మేడమైన కృష్ణ యాదవ్, బండ పులేందర్ రెడ్డి ఏకీ గ్రంగా ఎన్నికయ్యారు. నూతన చైర్మన్ గా ఎన్నికైన బండ దామోదర్ రెడ్డి నీ మరియు నూతన డైరెక్టర్ లను కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు డైరెక్టర్లు గోగు పద్మ వెంకటేశ్వర్లు యాదవ్, అక్కినపల్లి నాగేష్, బట్టు నరసింహ యాదవ్, గోగు మాధవి శ్రీశైలం, యాదవ్, పోషబోయిన చిన్న నరసింహ యాదవ్, చొప్పరి మల్లేష్ యాదవ్, ఏరా బోయిన యాదయ్య యాదవ్ ,పాల సెంటర్ కార్యదర్శి పున్న ఉపేందర్ తదితరులు పాల్గొని అభినందించారు.

# ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం విషయమై ప్రత్యేక కార్యక్రమం

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 02:**



బుధవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయం నందు ప్రభుత్వము ప్రతిష్టాత్మకముగా చేపట్టిన కార్యక్రమామైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం విషయమై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడమైనది. ఇట్టి సమావేశంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించి అవసరమగు సామాగ్రి మరియు ఇతరములు అనగా ఇసుక, ఇటుక, రాయి, కంకర, సిమెంట్,ఐరన్ తదితర రవాణా మొదలగు వాటికి సంబంధించి, సంబంధిత యజమానులతో మరియు తాపీ మేస్త్రీలతో చర్చించి సరసమైన ధరను మండల స్థాయిలో, మండల కమిటీ చే నిర్ణయించనైనది.ఇట్టి సమావేశం లో యాకూబ్ నాయక్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి అధ్యక్షతన,తహసిల్దార్ రామన్నపేట ,మండల పంచాయతీ అధికారి,ఎస్సై మల్లయ్య రామన్నపేట ,పి ఆర్ ఏ ఈ గాలయ్య ,సురేష్ హౌసింగ్ ఏ ఏఈ అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు మరియు సిమెంటు, కంకర, ఇటుక, స్టీలు, సిమెంట్ సప్లైదారులు, తాపీ మేస్త్రీలతో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం విషయమై క్షుణ్ణముగా సమీక్ష నిర్వహించి ధరను నిర్ణయించనైనది.ఇట్టి సమావేశం యందు ఇందిరమ్మ ఇండ్లను 400 నుండి 600 స్క్వేర్ ఫీట్ల లో ఇంటి నిర్మాణమునకు గాను పేదలకు సరసమైన ధరలను నిర్ణయించినందున అందరూ ఆమోదించినారు. ఎంపీడీవో రామన్నపేట.

# ఫార్మా భూములపై కాంగ్రెస్ గద్దలు

- అడ్డంగా దోచుకుంటున్న నేతలు
- రైతులను మోసం చేస్తున్నా పట్టించుకోరా: కెటిఆర్



**హైదరాబాద్,జులై 2( వెలుతురు):** హైదరాబాద్ ఫార్మాసిటీ భూములను కాంగ్రెస్ పార్టీ నేతల దోపిడి చేస్తున్నారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో గెలవగానే ఫార్మాసిటీ ప్రాజెక్టును రద్దు చేసి, భూములను రైతన్నలకు తిరిగి ఇస్తామని చెప్పిన హామీ ఏమైందని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని తుంగలో తొక్కిన ముఖ్యమంత్రి, తమ కాంగ్రెస్ లీడర్లతో కలిసి ఫార్మాసిటీ భూములను కొట్టేస్తున్నారు. ఫార్మాసిటీ భూములపై కాంగ్రెస్ నేతలు గద్దల మాదిరి వాలి దోచుకుంటున్నారు. ఫార్మాసిటీ కోసం భూములు ఇచ్చిన రైతన్నలకు నష్టపరిహారంగా కేటాయించిన ఇండ్ల స్థలాలను కాంగ్రెస్ నేతలు తమ పేర్లపై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. రైతన్నలకు దక్కాల్సిన ఇండ్ల స్థలాలను అతి తక్కువ రేట్లకు బలవంతంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. రైతన్నలకు నష్టపరిహారం గా దక్కాల్సిన దానిని కాంగ్రెస్ నేతలు ఎందుకు దోచుకుంటున్నారని నిలదీసారు. రాష్ట్ర అభివృద్ధి కోసం భూములు ఇచ్చిన రైతన్నలను కూడా వదలకుండా, దోపిడి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ తీరు సిగ్గుచేటు అని కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు మరిచిపోయి, ఇప్పుడు రైతులకు ఇవ్వాల్సిన భూములను కాంగ్రెస్ నేతలు స్వాధీనం చేసుకుంటున్నారన్న ఆరోపణలు చేశారు. కేటీఆర్ ఎక్స్ వేదికగా చేసిన పోస్ట్‌లో, 'రంగారెడ్డి జిల్లాలో ఫార్మాసిటీ కోసం భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం ఇప్పటి వరకు హక్కుగా రావాల్సిన ఇంటి స్థలాలను ఇవ్వలేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్టు, మీర్‌ఖాన్‌పేట లేఅవుట్‌లో పొజిషన్ ఇవ్వడమైతే ఫలించలేదని గుర్తు చేశారు.రాష్ట్ర అభివృద్ధికి తమ భూములు ఇచ్చిన రైతన్నలను వదలకుండా, నష్టపరిహారంగా ఇచ్చే భూముల్ని కూడా దోచుకుంటున్న తీరు సిగ్గుచేటు అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ మండిపడ్డారు.

# తెలంగాణలో చంద్రబాబు కోవర్టులు

- వారికి నల్లా, విద్యుత్ కనెక్షన్లు కట్ చేయాలి
- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హాట్ కామెంట్స్



**హైదరాబాద్,జులై 2( వెలుతురు):** ఏపీ సీఎం చంద్రబాబు కోవర్టులు తెలంగాణలో ఉన్నారంటూ జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్న లెటర్లు రాసుడు కాదుని, ఇరిగేషన్ ప్రాజెక్టులు, రోడ్డు కాంట్రాక్టులు చూసేది వాల్లే అని విమర్శించారు. ఆ కోవర్టులకు కరెంట్ కనెక్షన్, నల్లా కనెక్షన్‌లు కట్ చేయండని విజ్ఞప్తి చేశారు. మంచిగ మాట్లాడితే ఆంధ్ర వాళ్లు మాట వినరు అని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు. 'బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఎమ్మెల్యేగా ఒక సూచన చేస్తున్నా. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్న లెటర్లు రాసుడు కాదు. సీఎం చంద్రబాబు కోవర్టులు తెలంగాణలో ఉన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు, రోడ్డు కాంట్రాక్టులు చూసేది వాల్లే. ఆ కోవర్టులకు కరెంట్ కనెక్షన్, నల్లా కనెక్షన్‌లు కట్ చేయండి. ఇరిగేషన్ ప్రాజెక్టు పైసలు ఒక్క రూపాయి ఇవ్వకండి. వాల్లే చంద్రబాబు వద్దకు వెల్లి కాళ్లు పట్టుకొని బనకచర్ల బంద్ పెట్టిస్తారు. మంచిగ మాట్లాడితే ఆంధ్ర వాళ్లు మాట వినరు' అని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

# ఫిష్ వెంకటేశ్ ఆరోగ్యం విషమం

- వైద్యానికి ఆదుకోవాలని కూతురు వినతి



**హైదరాబాద్,జులై 2( వెలుతురు):**
తన తండ్రి ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తోందని, దీనస్థితిలో ఉన్న తమను ఆదుకోవాలంటూ ఫిష్ వెంకట్ కుమార్తె స్రవంతి కోరుతున్నారు. నాలుగేళ్లుగా రెండు కిడ్నీలూ చెడిపోవడం తో డయాలసిస్ ద్వారా చికిత్స పొందుతున్నారు వెంకట్. ప్రస్తుతం బోడుప్పల్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. రెండు కిడ్నీలు మార్పిడి చేయాలని, ఆరోగ్యం క్షీణిస్తోందని వైద్యులు చెప్పినట్లు స్రవంతి తెలిపారు. వైద్య సేవలు పొందలేని దీన స్థితిలో ఉన్నామని, దాతలు ఎవరైనా సాయం చేయాలని ఆమె కోరుతున్నారు. 'ఆది', 'దిల్', 'అత్తారింటికి దారేది', 'డీజే టిల్లు' వంటి పలు హిట్ సినిమాల్లో వెంకట్ నటించిన విషయం తెలిసిందే.

# ఫార్ములా ఈ..కార్ రేస్ కేసు

- అరవింద్ కుమార్‌కు ఎసిబి మరోసారి నోటీసులు



**హైదరాబాద్,జులై 2( వెలుతురు):**
ఫార్ములా ఈ..కార్ రేస్ కేసులో ఐఎఎస్ అరవింద్ కుమార్‌కు ఎసిబి మరోసారి నోటీసులు జారీ చేసింది. గురువారం ఉదయం 11.30 గంటలకు విచారణకు హాజరు కావాలని ఎసిబి నోటిసుల్లో పేర్కొంది. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో ఫార్ములా ఈ కార్ రేసింగ్ పోటీలు నిర్వహించిన విషయం తెలిసింది. ఈ ఫార్ములా కార్ రేస్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిధుల చెల్లింపు జరిగిందన్న అభియోగాలపై ఎసిబి కేసు నమోదు చేసింది. ఈ కేసులో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ను ఎ1, ఐఎఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను ఎ2, హెచ్ఎండిఎ మాజీ చీఫ్ ఇంజనీర్ బిఎల్ఎన్ రెడ్డిని ఎ3 నిందితులుగా చేర్చారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, ఐఎఎస్ అరవింద్ కుమార్, బిఎల్ఎన్ రెడ్డిలను ఇప్పటికే ఎసిబి అధికారులు విచారించారు. కెటిఆర్‌ను ఇటీవల విచారించిన అధికారులు ఆయన ఇచ్చిన స్టేట్‌మెంట్‌తో ఐఎఎస్ అరవింద్ కుమార్‌ను విచారించేందుకు నోటిసులు ఇచ్చినట్లు సమాచారం.

# కాంగ్రెస్ ప్రభుత్వం నగర పెండింగ్ అభివృద్ధి పనుల పూర్తి కోసం 100 కోట్లు నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించిన బిజెపి...

కాంగ్రెస్ సర్కార్ కరీంనగర్ నగర పాలక సంస్థకు ఇప్పటివరకు ఒక్క రూపాయి నిధులు కూడా ఇవ్వలే...

కరీంనగర్లో ఇన్నేళ్లుగా జరిగిన అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వమే నిధులిచ్చింది..

కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ చొరవతో కేంద్రం నుండి 800 కోట్లు విడుదల చేయడంతో స్మార్ట్ సిటీ లో భాగంగా నగర రూపురేఖలు మారాయి.

నగర వ్యాప్తంగా అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి...

కరీంనగర్ పట్టణ అభివృద్ధిపై కాంగ్రెస్ కు చిత్తశుద్ధి లేదు...

బిజెపి నాయకులు, మాజీ మేయర్ సునీల్ రావు..



**కరీంనగర్ వెలుతురు జూలై 02:**
కరీంనగర్ నగరంలో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని, పట్టణ ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలు పరిష్కరిం కోరుతూ బిజెపి నాయకులు , మాజీ మేయర్ యదగిరి సునీల్ రావు ఆధ్వర్యంలో బుధవారం రోజున జిల్లా కలెక్టర్, మున్సిపల్ కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్ పమేలా సత్పతి ని బిజెపి శ్రేణులు కలిసి వినతిపత్రం సమర్పించారు . ఈ సందర్భంగా మాజీ మేయర్ సునీల్ రావు మాట్లాడుతూ నగరంలో పెండింగ్లో ఉన్న పనులను పూర్తి చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం 100 కోట్ల రూపాయలు విడుదల చేసి,నగర ప్రజల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నగరపాలక సంస్థ పరిదిలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదని , నగరపాలక సంస్థ కు ఇప్పటి వరకు ఒక్క రూపాయి నిధులు కూడా విడుదల చేయలేదన్నారు. దీంతో నగర వ్యాప్తంగా అభివృద్ధి కుంటుబడిపోయిందని , ఎక్కడి కక్కడ పనులు నిలిచిపోయాయని తెలిపారు. ప్రస్తుతం ఈ సమస్య తీవ్రరూపం దాల్చిందని, అందుకే జిల్లా కలెక్టర్, మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ దృష్టికి తీసుకువచ్చామన్నారు. ముఖ్యంగా గత ఆరు సంవత్సరాల కాలంలో నగరంలో ఏమైనా అభివృద్ధి పనులు జరిగాయి అంటే అవి కేవలం కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చిన నిధులతో మాత్రమేన్నారు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కేంద్ర ప్రభుత్వం నుండి 8 వందల కోట్లు విడుదల చేయించడంతోనే స్మార్ట్ సిటీలో నగరం అభివృద్ధి చెందిందని, పట్టణ రూపురేఖలు మారాయని చెప్పారు.అమృత్ 1,2 పథకం ద్వారా 279 కోట్లతో త్రాగు నీటికి సంబంధించిన పనులు గతంలో నగరంలో పూర్తి చేయగా ప్రస్తుతం విలీన డివిజన్ల లో కొనసాగుతున్నాయన్నారు. 15 ఫైనాన్స్ 100 కోట్ల నిధుల నుండి నగరంలో గత ఆరు సంవత్సరాల కాలం పెద్ద ఎత్తున పనులు చేపట్టడం జరిగిందని , గత ఆరు సంవత్సరాల కాలంలో అప్పుడు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం గానీ ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గానీ నగరపాలక సంస్థ అభివృద్ధి కోసం రూపాయి ఇచ్చిన చరిత్ర లేదన్నారు. ప్రస్తుతం నగరపాలక సంస్థ ప్రజల కోసం సొంతంగా నిధులు పెట్టి అభివృద్ధి పనులు చేయలేని స్థితిలో ఉందన్నారు.నగరంలో వసూలు అయ్యే పన్నులు నగరపాలక సంస్థ వ్యవహారాలకే సరిపోతాయని , ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టే స్థితిలో నగరపాలక సంస్థ లేదన్నారు. 2023 నుండి కరీంనగర్ నగరంలో దాదాపు 70 చోట్ల అప్పటి కాంట్రాక్టర్లు రోడ్లను తవ్వి వదిలి పెట్టి పోవడం వల్ల నగరంలో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఆ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినట్టు ఆయన ఈ సందర్భంగా చెప్పారు. వర్షకాలం వచ్చింది కాబట్టి పెండింగ్ లో ఉన్న పనుల వల్ల ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నా రని , రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 100 కోట్లు రూపాయలు గ్రాంటు రూపంలో నగరపాలక సంస్థ కు విడుదల చేయాలని , ప్రభుత్వం నుండి నిధులను విడుదల చేయించేలా కలెక్టర్ స్పెషల్ ఆఫీసర్ చొరవ తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కరీంనగర్ నగరం అభివృద్ధి పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటే , ప్రభుత్వం మళ్లీ చుట్టు ప్రక్కల ఉన్న 5 గ్రామాలను విలీనం చేసి మున్సిపల్ పరిదిని పెంచి నగరపాలక సంస్థ పైన ఎనలేని భారం మోపే దుస్థితిని తెచ్చిందన్నారు. ప్రభుత్వానికి కరీంనగర్ అభివృద్ధిపై చిత్తశుద్ధి లేకపోవడం దురదృష్టకరమన్నారు. 5 లక్షల జనాభా ఉన్న నగరాన్ని ఇంకా పెంచుకుంటూ పోయి... ప్రభుత్వం ఎలాంటి సహకారం అందించ కుండ ఏ విధంగా అభివృద్ధి పనులు కొనసాగుతాయని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగా నగర ప్రజల సమస్యలు తీర్చుతుందో అర్థం కానటువంటి పరిస్థితి ఉంది కాబట్టి బీజేపి పక్షాన మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి ని కలిసి వినతి పత్రం అందించామని పేర్కొన్నారు. ప్రస్తుతం అధికార పార్టీ , ప్రజా ప్రతినిధులు ఎవరు కరీంనగర్ నగరాన్ని పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ కి చెందిన ఏ నాయకుడు కూడ కరీంనగర్ నగరాన్ని , సమస్యలను పట్టించుకునే పరిస్థితిలో లేరని, ఎంత సేపు వారి పనులు రాజకీయాలు తప్ప కరీంనగర్ ను పట్టించుకునే నాధుడు లేడన్నారు. అధికారులే ప్రజల బాధలు సమస్యలను అర్థం చేసుకోవాలని నగరంలో ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరించడానికి మున్సిపల్ కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్ చొరవ తీసుకోవాలని బారతీయ జనతాపార్టీ పక్షాన విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కరీంనగర్ పట్టణ సమస్యలు పరిష్కరించలేని పక్షంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపి పార్టీ మాజీ కార్పోరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అగ్నిమాపక కేంద్రం స్థలాన్ని శుభ్రం చేయండి...

## మున్సిపల్ కమీషనర్ కి వినతిపత్రం



**బొల్లారం వెలుతురు జూలై 02:**
బొల్లారం మున్సిపల్ పరిధిలోని బాలాజీ నగర్ లో కొన్ని సంవత్సరాలక్రితం అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు కోసం ప్రభుత్వం స్థలాన్ని కేటాయించింది. అట్టి స్థలంలో అధికారులు అగ్నిమాపక కేంద్రం నిర్మాణం చేపట్టలేదు. బుధువారం బాలాజీ నగర్ కి చెందిన కొంతమంది యువత గుండ్ల భార్గవ్ రెడ్డి ఆధ్వర్యంలో బొల్లారం మున్సిపల్ కమీషనర్ బి. కిషన్ ని మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరం బాలాజీ నగర్ లో నిరూపయోగంగా ఉన్న అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చెసిన స్థలాన్ని శుభ్ర పరిచి యువత అందులో అట స్థలంగా వాడుకునేందుకు అవకాశం కల్పించాలంటూ వినతిపత్రం అందచేశారు. ఇప్పటికే ఆ స్థలంలో భవన వ్యర్థాలు, చెత్త, చెదారంతో పాటు కొన్ని నిరూపయోగ మొక్కలతో నిండిపోయిందని అట్టి స్థలన్ని శుభ్ర పరిచి యువకులకు క్రీడా సామర్థ్యం పెంచుకోవడానికి ఆ స్థలాన్ని శుభ్రం చేయించాలని ఒక వినతిపత్రం ఇచ్చారు. అనంతకుముందు బాలాజీ నగర్ యువకులు కమిషనర్ ని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఓ నరసింహులు, హరీష్, అర్జున్, ఆనంద్, ఆదర్శ్, యువరాజ్, విజయ్, ప్రిన్స్, కుందన్, సతీష్ తదితరులు ఉన్నారు





# బనకచర్లపై దుష్ప్రచారాలు ఆపండి

- అసెంబ్లీలో మేం చర్చకు సిద్ధం..మీరు సిద్ధమా
- సిఎం రేవంత్‌కు బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు సవాల్



**హైదరాబాద్,జులై2( వెలుతురు):**
బనకచర్లపై అసెంబ్లీలో చర్చకు తాము రెడీ.. సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధమా అని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావుసవాల్ విసిరారు. బనకచర్లపై అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డిని నిలదీస్తామని అన్నారు. బుధవారం తెలంగాణభవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. . అసెంబ్లీలో బనకచర్లపై చర్చ జరుగుతున్నప్పుడు తమ మైక్ కట్ చేయకూడదని కోరారు. రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమ ద్రోహి.. సీఎం హోదాలోనూ రేవంత్‌రెడ్డి తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణలు చేశారు. రేవంత్‌రెడ్డి తెలంగాణకు పట్టిన అబద్దాల వైరస్ అని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. బయట వారికి సద్దులు కడుతూ.. ఇంటి మనిషి కేసీఆర్‌పై నిందలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ .. హైదరాబాద్‌లో కాకుండా అమరావతి నుంచి ఇచ్చినట్లుందని విమర్శించారు. ఉత్తమ్ పీపీటీ.. ఏపీ సీఎం చంద్రబాబు తయారు చేశాడా అనే అనుమానం కలుగుతోందని అన్నారు. చంద్రబాబు తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకున్న విషయాన్ని పీపీటీలో ఎందుకు చూపించలేదని ప్రశ్నించారు. అహంకారంతో మాట్లాడితే.. రేవంత్‌ను ప్రజలు పాతాళానికి తొక్కుతారని హెచ్చరించారు. తెలుగుదేశం, చంద్రబాబుతో ఉన్న అనుబంధాన్ని రేవంత్‌రెడ్డి ఇంకా మర్చిపోలేకపోతున్నారని విమర్శించారు మాజీ మంత్రి హరీశ్‌రావు. విభజన హామీల ముసుగులో ప్రజాభవన్ వేదికగా బనకచర్ల ఒప్పందం కుదిరిందని, ప్రజాభవన్ వేదికగా 2024 జులై 6వ తేదీన రేవంత్ తెలంగాణకు మరణశాసనం రాశారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపణలు చేశారు. సెప్టెంబర్ 23వ తేదీన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సతీసమేతంగా బెజవాడ పోయి బజ్జీలు తిని బనకచర్లకు పచ్చజెండా ఊపారని విమర్శించారు. బీఆర్ఎస్ పోరాటంతోనే కేంద్ర ప్రభుత్వం బనకచర్లకు అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ చచ్చిన పాము అయితే.. ఎందుకు తమపై విమర్శలు చేస్తున్నారని నిలదీశారు. కేసీఆర్ పేరు ఎత్తకుండా ఒక్కసారైనా రేవంత్‌రెడ్డి ఉండగలరా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా కాకుండా.. రేవంత్‌రెడ్డి ఇంకా ప్రతిపక్ష నేత మాదిరిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇరు రాష్ట్రాలు కూర్చుని ఆమోదయోగ్యంగా మాట్లాడుకుందామని మాత్రమే కేసీఆర్ అన్నారని తేల్చిచెప్పారు మాజీ మంత్రి హరీశ్‌రావు. బిఆర్ఎస్ హయాంలో బనకచర్లపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు క్లారిటీ ఇచ్చారు. రేవంత్‌రెడ్డే సతీసమేతంగా ఉత్తమ్‌ను విజయవాడ పంపించారని ఆరోపించారు. చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క ఎమ్మెల్యే, ఎంపీ సీటు కూడా గెలవలేదని.. అంతమాత్రాన ఆ పార్టీ చచ్చిన పాము అవుతుందా అని ప్రశ్నించారు. చచ్చిన పాము ముచ్చట్లు రేవంత్‌రెడ్డి రాహుల్ గాంధీకి చెప్పుకోవాలని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి చెప్పేవన్నీ అబద్ధాలేనని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర హక్కుల కోసం కాకుండా.. రాజకీయ ప్రయోజనాల కోసమే రేవంత్ మాట్లాడుతున్నారని ÷ర్ అయ్యారు. బనకచర్లపై మంత్రి ఉత్తమ్ ఇచ్చిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌కు ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను ఎందుకు పిలవలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నల వర్షం కురిపించారు.

# ఐదేళ్ల వరకు నేనే ముఖ్యమంత్రిని

**మార్చడానికి బిజెపి, జెడిఎస్‌లు కాంగ్రెస్ అధిష్టానమా**

**మీడియా సమావేశంలో వెల్లడించి సిఎం సిద్ధరామయ్య**

**సిద్ధరామయ్యకు మద్దతు ఇవ్వడం నా విధి అన్న డికె శివకుమార్**

బెంగళూరు,జులై 2( **వెలుతురు**):
కర్ణాటకలో నాయకత్వ మార్పు అంశంపై కొన్ని రోజులుగా వినిపిస్తోన్న వ్యాఖ్యలకు చెక్ పడింది. ఐదేళ్లు తానే కర్ణాటక ముఖ్యమంత్రిగా కొనసాగుతానని సిద్ధరామయ్య స్పష్టంచేశారు. 'నేను సీఎంగా కొనసాగుతా. మీకెందుకు అలాంటి అనుమానాలు ఉన్నాయని బుధవారం మీడియాకు వెల్లడించారు. సీఎం మార్పు గురించి విపక్ష పార్టీలు భాజపా, జేడీఎస్ చేస్తోన్న వ్యాఖ్యలను కొట్టిపారేశారు. వారేమైనా కాంగ్రెస్ అధిష్ఠానమా అని ప్రశ్నించారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ.. సిఎంకు అండగా ఉండటం తప్ప నాకు మరో గత్యంతరం లేదు. నేను ఆయనకు మద్దతు ఇవ్వాలి. అధిష్ఠానం ఏం చెబితే అది చేయాలని అన్నారు. ఇటీవల కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే



ఇక్బాల్ హుస్సేన్ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. మరో రెండు, మూడు నెలల్లో ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించే అవకాశముందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఎవరు కృషి చేశారో అందరికీ తెలుసని.. ప్రస్తుతం పార్టీ అధిష్ఠానం శివకుమార్ గురించే మాట్లాడుతోందన్నారు. సెప్టెంబర్ తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో 'విప్లవాత్మక' పరిణామాలు నెలకొంటాయని కర్ణాటక మంత్రి కె.ఎన్.రాజన్న కూడా ఇటీవల పేర్కొన్నారు. దీంతో త్వరలోనే నాయకత్వ మార్పు తథ్యమని అధికార పార్టీలోనూ విస్తృత చర్చ నడిచింది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి పదవిపై రాష్ట్ర కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లు రెండున్నరేళ్ల పాటు పదవిలో కొనసాగేలా అంగీకారానికి వచ్చారనే వార్తలూ వచ్చాయి. పలు కేసుల్లో సిద్ధరామయ్య పేరు బయటకు రావడంతో సీఎంగా ఆయనను తొలగించాలన్న డిమాండ్లు తెర పైకి వస్తున్నాయి. శివకుమార్ కూడా ఎప్పటికైనా ముఖ్యమంత్రి పదవిని స్వీకరిస్తాననే బహిరంగంగానే చెబుతున్నారు. ఆ నేపథ్యమూ ఈ చర్చకు దారితీసింది. అయితే వ్యాఖ్యలను డీకే శివకుమార్, కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రణదీప్ సూర్జేవాలా ఇప్పటికే ఖండించిన సంగతి తెలిసిందే. 'నా తరఫున ఎమ్మెల్యేలు మాట్లాడాలని కోరుకోవడం లేదు. 2028లో రాష్ట్రంలో జరిగే ఎన్నికల పైనే నేతల దృష్టి ఉండాలి. నేను తొలుత పార్టీ కార్యకర్తను. అన్నింటికంటే పార్టీనే ముఖ్యం' అని డీకే స్పష్టంచేశారు. రాష్ట్రంలో నాయకత్వ మార్పు లేదని సూర్జేవాలా వెల్లడించారు. ఈ ఊహాగానాల వెనక భాజపా కుట్ర ఉందని విమర్శించారు.

## చేనేత కార్మికుల రుణమాఫీకి 33 కోట్లు

**- 5691 మంది చేనేత కార్మికులకు లబ్ది**

**- పరిపాలన అనుమతులు జారీచేసినట్లు మంత్రి తుమ్మల వెల్లడి**



**హైదరాబాద్,జులై 2( వెలుతురు):**
ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు, చేనేత కార్మికులకు లక్ష వరకు రుణమాఫీ కోసం రూ. 33 కోట్లకు పరిపాలన అనుమతులు జారీ చేయడం జరిగిందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. దీంతో 5,691 మంది చేనేత కార్మికులకు లబ్ది చేకూరుతుందని ఆయన అన్నారు. ఇంతకుముందు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం 2017 ఏప్రిల్ 1వ తేది నుండి 2024 మార్చి 31 వరకు అన్ని బ్యాంకులు మరియు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల్లో చేనేత వస్త్రాల ఉత్పత్తి, వృత్తి సంబంధిత కార్యకలాపాల కోసం తీసుకొన్న రూ. లక్ష వరకు రుణాల (అసలు, వడ్డీ కలిపి)కే మాఫీ వర్తిస్తుందని మంత్రి తెలిపారు. మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాల వారిగా లబ్దిదారుల వెరిఫికేషన్ పక్రియ కొనసాగు తుందని, వెరిఫికేషన్ పూర్తయిన వెంటనే కార్మికుల ఖాతాలలో రుణమాఫిని జమ చేయడం జరుగుతుందని అన్నారు. రుణ మాఫీ జరిగిన అనంతరం చేనేత కార్మికులు కోరుకుంటే బ్యాంకర్లు మళ్లీ ఆ మేరకు రుణాన్ని బ్యాంకులు మంజూరు చేస్తాయని మంత్రిగారు పేర్కొన్నారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి చేనేత కార్మికుల సంక్షేమం కోసం దాదాపు 920 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. చేనేత కార్మికులకు ఎల్లప్పుడు పనికల్పించాలనే ఉద్దేశ్యంతో అన్ని ప్రభుత్వ శాఖలు ÷ుఉఅక్ష నుండే వస్త్రాలు కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇచ్చినట్టు, అందుకు అనుగుణంగా ఇప్పటికే 579 కోట్ల విలువైన వస్త్రాలకు వివిధ ప్రభుత్వ శాఖల నుండి ఆర&ధర్లు వచ్చాయని అన్నారు. ఇందిరా మహిళాశక్తి చీరల పథకం ద్వారా సిరిసిల్లలోని 16 వేల మరమగ్గాలకు నిరంతరం పని కల్పించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. 193 కోట్లు చేనేత అభయహస్తం పథకాన్ని అమలు చేస్తున్నామని, గత ప్రభుత్వం కార్మికులకు చెల్లించకుండా వదిలేసిన 290 కోట్లను నేతన్నకు చేయూత పథకం కింద కార్మికుల ఖాతాలలో జమ చేశామన్నారు. మా ప్రభుత్వం చేనేత కార్మికుల అభివృద్ధి కోసం కట్టుబడి ఉందని ఆయన ఈ సందర్భంగా మరోసారి తెలియజేశారు.

## సిగాచి పేలుడు ఘటనపై నిపుణుల కమిటీ

**- నెలరోజుల్లో నివేదిక అందించాలని ఆదేశం**

**హైదరాబాద్,జులై 2( వెలుతురు):**
సంగారెడ్డి జిల్లా పాశమైలారం పేలుడు ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. సీఎస్ఐఆర్ శాస్త్రవేత్త బి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. ఈ కమిటీలో సభ్యులుగా చీఫ్ సైంటిస్ట్ టి. ప్రతాప్‌కుమార్, విశ్రాంత శాస్త్రవేత్త సూర్యనారాయణ, పుణెకి చెందిన భద్రతాధికారి సంతోష్ ఘుగే ఉన్నారు. పాశమైలారం ప్రమాదానికి గల కారణాలతో పాటు కర్మాగారాల భద్రతా నియమావళి పాటించారా? లేదా? అనే అంశాలను కమిటీ తెలుసుకోనుంది. ఈ ఘటనపై నెలరోజుల్లో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. భవిష్యత్తులో రసాయన కర్మాగారాల్లో ఇలాంటి ఘటనలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచించాలని ప్రభుత్వం కోరింది. ఈ కమిటీకి డైరెక్టరేట్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సహకారం అందించాలని ఆదేశించింది.మరోవైపు సిగాచి పరిశ్రమ వద్దకు మంత్రి దామోదర రాజనర్సింహ, ఆ పరిశ్రమ ప్రతినిధులు వెళ్లారు. ఘటనాస్థలం నుంచి శిథిలాల తరలింపు ప్రారంభమైంది. ఈ కమిటీలో బి.వెంకటేశ్వర్,(ఏమిరేట్ సైంటిస్ట్) చైర్మన్‌గా, ప్రతాప్ కుమార్ చీఫ్ సైంటిస్ట్, డా. సూర్యనారాయణ (రిటైర్డ్ సైంటిస్ట్), సంతోష్, సేఫ్టీ ఆఫీసర్ పూణె సభ్యులుగా ఉన్నారు. ఈ ప్రమాదంపై నెల రోజుల్లో దర్యాప్తు చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ ఘటనలో ఇప్పటివరకు 40 మంది మృతి చెందారని, 33 మందికి గాయాలైనట్టు కంపెనీ సెక్రటరీ వివేక్ కుమార్ వెల్లడించారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారంతో పాటు అన్ని రకాల బీమా ÷-లకెయిమ్‌లు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఇక, ఘటనాస్థలాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఫ్యాక్టరీలో బీహార్, ఎంపి, ఎపి, ఒడిశా ప్రాంతాలకు చెందినవారు పని చేస్తున్నట్టు తెలిసిందని అన్నారు. యాజమాన్యంతో చర్చించి, మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయలు, వికలత్వం సంభవించి విధులకు వెళ్లలేని వారికి రూ.10 లక్షలు, స్వల్పంగా గాయపడి పని చేసుకోగలిగిన వారికి ఐదేసి లక్షలు పరిహారం అందేలా చూస్తామని అన్నారు. ఈ దుర్ఘటనలో క్షతగాత్రులకు అయ్యే వైద్య ఖర్చులన్నీ నూటికి నూరు శాతం తమ ప్రభుత్వం భరిస్తుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుబాల్లోని పిల్లలకు ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యను అందిస్తామని తెలిపారు. తక్షణ సాయంగా మృతుల కుటుంబాలకు రూ. లక్ష, గాయపడిన వారికి రూ.50 వేలు జిల్లా కలెక్టర్ నిధుల నుంచి ఇస్తున్నట్టు సిఎం ప్రకటించారు.

## ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

**- ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి**

**హైదరాబాద్,జులై 2( వెలుతురు):**
అధికారంలో ఉన్నా లేకపోయినా, ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని మంత్రి వాకిటి శ్రీహరి చెప్పారు. పేదల ఆకలి తీర్చడం, బడుగు బలహీన వర్గాల అవసరాలను తీర్చడమే కాంగ్రెస్ అసలైన లక్ష్యమని అన్నారు. ప్రతి బుధవారం సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సూచన మేరకు మంత్రులతో ముఖాముఖి కార్యక్రమాన్ని



నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో ప్రజల నుండి వచ్చిన వినతులను స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి ప్రయత్నించామని చెప్పారు.ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వ అభిమతాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాదాపు 90 వినతులు వచ్చినట్లు తెలిపారు. వీటిలో అధికంగా ధరణి బాధితుల సమస్యలే ఉన్నాయని చెప్పారు. ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వమంతా కృషి చేస్తోందని తెలిపారు. ఓ పేదవాడు నేరుగా మంత్రిని కలిసి సమస్య వినిపించడం కాంగ్రెస్ ప్రభుత్వంలోనే సాధ్యమవుతుందన్న సంగతి ప్రజలు గుర్తుపెట్టుకోవాలన్నారు. అలాగే, బనకచర్ల ప్రాజెక్ట్ విషయంలో హరీష్ రావు తడబడినట్లు స్పష్టంగా అర్థమవుతోందని శ్రీహరి పేర్కొన్నారు. 100 టీఎంసీల నీరు వృథాగా పోతుందన్న వార్తలు మీడియాలో వచ్చినట్లు తెలిపారు. ఈ అంశంపై ఎక్కడైనా చర్చకు సిద్ధమని అన్నారు. వచ్చే వారం కృష్ణ నదీ జలాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర బీజేపీ నేతలపై కూడా మంత్రి శ్రీహరి తీవ్ర విమర్శలు చేశారు. బీసీల పట్ల బీజేపీ అనుసరిస్తున్న వైఖరి మరోసారి బయటపడిందన్నారు. గతంలో బండి సంజయ్‌ను తొలగించి కిషన్ రెడ్డికి రాష్ట్ర అధ్యక్ష పదవిని అప్పగించిన తీరు ఈ విషయాన్ని స్పష్టంగా చూపుతుందని విమర్శించారు. కుల గణన సర్వే అనంతరం కూడా బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. బీఆర్ఎస్ పార్టీలో కవితకు కీలక పదవి ఇవ్వాలన్న సూచన చేస్తూ, రైల్ రోకో కార్యక్రమం చేపట్టేముందు పార్టీలో బీసీలకు ప్రాధాన్యత కలిగిన పదవి ఏర్పాటు చేయాలని అన్నారు.

## వీసా విద్యార్థులకు మరో గండం

### పరిమిత కాల వీసాలను విధించే యోచనలో ట్రంప్



**వాషింగ్టన్,జులై 2( వెలుతురు):**
అమెరికాలో చదువుల కోసం ప్రయత్నిస్తున్న విద్యార్థులకు అగ్రరాజ్యం మరో షాక్ ఇవ్వబోతోంది. అగ్రరాజ్యంలో ఉంటున్న విదేశీ విద్యార్థులపై మరో ఆంక్షల కత్తి వేలాడుతోంది. ఇప్పటికే వీసాల జారీకి 'సోషల్ మీడియా వెట్టింగ్'ను కఠినంగా అమలుచేస్తోన్న అగ్రరాజ్యం.. తాజాగా మరో మార్పు తీసుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. విద్యార్థి వీసాలకూ పరిమిత కాల గడువు విధించేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ ప్రతిపాదనలు చేసింది. దీంతో విదేశీ విద్యార్థులకు కొత్త గుబులు పట్టుకుంది. దీనిప్రకారం చదువుకునే సమయం వరకే వీసా అనుమతులు ఉండనున్నాయి. ఈ ప్రతిపాదన లపై న్యాయనిపుణులు, విద్యార్థుల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ మార్పుల వల్ల విద్యార్థులపై అదనపు భారం పడుతుందని, అనవసరపు గందరగోళానికి దారితీస్తుందని పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కాగా.. ఈ మార్పులు అమల్లోకి వస్తే భారతీయ విద్యార్థులపై అధిక ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రస్తుతం 3.3లక్షల మందికి పైగా భారతీయులు అమెరికా వర్సిటీల్లో చదువుకుంటున్నారు. ప్రస్తుతం ఎఫ్-1 వీసాలపై అమెరికాలో ఉన్న అంతర్జాతీయ విద్యార్థులు, జే-1 వీసాలపై వచ్చిన ఎక్స్ఛేంజ్ విజిటర్లకు 'డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్' వెసులుబాటు ఉంది. అంటే.. వారు ఎంతకాలం చదవాలనుకుంటే లేదా ఇంటర్న్ ప్రోగ్రామ్‌లో పాల్గొనాలనుకుంటే.. అంతకాలం అగ్రరాజ్యంలో ఉండే ఛాన్స్ ఇంతవరకు ఉంది. . ఎక్స్ఛేంజ్ విజిటర్స్‌గా వచ్చే విద్యార్థులు, ప్రొఫెసర్లు, స్కాలర్లు, స్పెషలిస్ట్‌లు, ట్రైనీలు, ఇంటర్న్‌లు, ఫిజీషియన్లకు కూడా ఈ సదుపాయం వర్తిస్తుంది. అయితే, ఈ ఫ్లెక్సిబుల్ స్టూడెంట్ వీసా సిస్టమ్‌లో మార్పులు తీసుకొచ్చేందుకు ఇప్పుడు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ విభాగం సిద్ధమైంది. విద్యార్థి వీసాలకు కూడా గడువు విధించేలా 'పరిమిత కాల నివాస అనుమతి'తో కూడిన వీసాలను మంజూరుచేయాలని ప్రతిపాదించింది. అంటే, ఇకపై విద్యార్థి వీసాలకు కూడా టైం లిమిట్ విధించనున్నారు. దీంతో గడువు తీరిన తర్వాత వీసా పొడిగింపునకు విద్యార్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదనలను సమీక్షించేందుకు ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బ్జడెట్ విభాగానికి పంపించారు. అనంతరం దీన్ని ఫెడరల్ రిజిస్ట్రర్‌లో పబ్లిష్ చేస్తారు. ఆ తర్వాత ప్రతిపాదనలపై 30 లేదా 60 రోజుల వరకు ప్రజాభిప్రాయాలను స్వీకరించి తుది నిర్ణయం తీసుకుంటారు. ప్రజల నుంచి ఎలాంటి అభిప్రాయాలు తీసుకోకుండానే తక్షణమే అమల్లోకి వచ్చేలా దీనిపై మధ్యంతర ఉత్తర్వులు కూడా జారీ చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

## కర్నూలు- విజయవాడ మధ్య ఇండిగో విమాన సర్వీసులు

**న్యూఢిల్లీ,జులై 2( వెలుతురు):**
కర్నూలు- విజయవాడ మధ్య ఇండిగో విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి. పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు దిల్లీ నుంచి వర్చువల్‌గా దీన్ని ప్రారంభించారు. వారానికి మూడు రోజులపాటు కర్నూలు-విజయవాడ మధ్య సర్వీసులను ఇండిగో సంస్థ నడపనుంది. త్వరలో ప్రతిరోజూ ఉండేలా చర్యలు తీసుకుంటామని రామ్మోహన్‌నాయుడు తెలిపారు. కర్నూలు నుంచి మిగిలిన ప్రాంతాలకు కూడా సర్వీసులు నడిపేలా చూస్తామన్నారు. విమాన సర్వీసుల ప్రారంభం సందర్భంగా విమానాశ్రయం వద్ద మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎంపీ బైరెడ్డి శబరి తదితరులు ప్రయాణికులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కర్నూలు డిప్యూటీ కలెక్టర్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పుష్ప తరహాలో గంధం చెక్కల తరలింపు

**- ముఠాను అరెస్ట్ చేసిన ఎస్‌వోటి పోలీసులు**

**హైదరాబాద్,జులై 2( వెలుతురు):**
శ్రీ గంధం చెక్కలను అక్రమ రవాణా చేస్తున్న ముఠాను మాదాపూర్ ఎస్‌వోటి, చేవెళ్ల పోలీసులు అరెస్ట్ చేశారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలోని బస్తేపూర్‌లో సోదాలు నిర్వహించిన పోలీసులు వెయ్యి కిలోల శ్రీగంధం చెక్కలను స్వాధీనం చేసుకున్నారు. వాటిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. చెక్కలను తరలిస్తున్న డిసిఎంను సీజ్ చేశారు. మహారాష్ట్ర నుంచి రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం నాగర్‌గూడలోని ఓ పర్ఫ్యూమ్ ఫ్యాక్టరీకి ఈ చెక్కలను తరలిస్తున్నారు. 'పుష్ప' సినిమా తరహాలో డిసిఎంలో చెక్కలను దాచారు. వీటి విలువ రూ.30 లక్షలు ఉంటుందని చేవెళ్ల ఎసిపి కిషన్ తెలిపారు. డిసిఎం డ్రైవర్ అబ్దుల్ అజీజ్, సూపర్‌వైజర్ సోహెబ్, రైతు విజయ్ హనుమంతును పోలీసులు అరెస్ట్ చేశారు. ఫ్యాక్టరీ యజమాని అబ్దుల్ కుర్ఫీ, మేనేజర్ సిద్ధిఖ్ పరారీలో ఉన్నారు. పట్టుకున్న ముగ్గురిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు.. పరారీలో ఉన్నా వాళ్ల కోసం గాలిస్తున్నారు.

## ఎపి కేడర్ ఐపీఎస్ సిద్దార్థ కౌశల్ రాజీనామా

**- వ్యక్తిగత కారణాలతో తప్పకుంటున్నట్లు వెల్లడి**

**అమరావతి,జులై 2( వెలుతురు):**
తాను ఐపీఎస్‌కి స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్లు సిద్దార్థ్ కౌశల్ బుధవారం అమరాతిలో వెల్లడించారు. తన రాజీనామా లేఖను డీజీపీకి పంపినట్లు ఆయన తెలిపారు. తాను ఐఐఎం విద్యార్థినని.. ఈ నేపథ్యంలో తనకు మంచి ఆఫర్ రావడంతో ఈ ఐపిఎస్ ఉద్యోగానికి




రాజీనామా చేసినట్లు సిద్దార్థ్ కౌశల్ వివరణ ఇచ్చారు. తాను ఒత్తిళ్ల కారణంగా ఈ ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు వస్తున్న వార్తల్లో ఏ మాత్రం వాస్తవం లేదన్నారు. తనపై వస్తున్న వార్తలను ఈ సందర్భంగా ఆయన ఖండించారు. కుటుంబ సభ్యులతో చర్చించిన తరువాతే ఉద్యోగానికి రాజీనామా చేయాలని తాను నిర్ణయానికి వచ్చానని కౌశల్ వెల్లడించారు. ఇక ఆంధ్రప్రదేశ్.. తన సొంత రాష్ట్రంగా పరిగణిస్తానని ఆయన చెప్పుకొచ్చారు. తనకు సేవ చేసేందుకు అవకాశం ఇచ్చిన ఏపీ ప్రభుత్వానికి, సీనియర్లకు, సహచరులకు ఈ సందర్భంగా సిద్దార్థ్ కౌశల్ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో సైతం సమాజానికి సేవ చేసేందుకు కృషి చేస్తానని అన్నారు.

## హిమాచల్‌లో భారీ వర్షాలు

**- ఉధృతంగా ప్రవహిస్తున్న బియాస్ నది**

**- 51 మంది మృతి చెందినట్లు ప్రకటన**



**చండీఘడ్,జులై 2( వెలుతురు):**
హిమాచల్‌ప్రదేశ్ లో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు ఆకస్మిక వరదలు సంభవించాయి. ఎక్కడికక్కడ కొండచరియలు విరిగిపడుతున్నాయి.ఈ వర్షాకాల సీజన్‌లో ఇప్పటి వరకూ 51 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తాజాగా వెల్లడించారు.భారీ వర్షాలకు హిమాచల్ ప్రదేశ్‌లోని మండి జిల్లాలో బియాస్ నది ఉప్పొంగి ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తోంది. చండీగఢ్-మనాలీ హైవేలోని మండి-మనాలీ మార్గంలో అనేక చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొండచరియలు విరిగిపడిన కారణంగా రాకపోకలు నిలిచిపోయాయి. రాష్ట్రంలోని ప్రధాన నదులకు వరద ప్రవాహం పెరిగింది. పలు లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి. అనేక రోడ్లు ధ్వంసమయ్యాయి. హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలోని స్టేట్ ఎమ్జంగ్గ÷న్సీ ఆపరేషన్ సెంటర్ జూన్ 20 నుంచి జులై 2 వ తేదీ వరకూ రాష్ట్రంలో వర్షాల కారణంగా జరిగిన నష్టంపై ఓ నివేదిక విడుదల చేసింది. ఆ నివేదికలో రాష్ట్రంలోని 12 జిల్లాల్లో ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలను వెల్లడించింది. 'ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం, పిడుగులు పడటం వంటి వర్షాల కారణంగా సంభవించిన ప్రమాదాల్లో 51 మంది మరణించారు. దాదాపు 22 మంది గల్లంతయ్యారు. మండి జిల్లాలో అత్యధికంగా 10 మంది మరణించారు. వర్షాలకు సంబంధించిన ఘటనల్లో 103 మంది గాయపడ్డారు' అని సదరు నివేదికలో వెల్లడించింది. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా పలు జిల్లాల్లో అధికారులు పాఠశాలలను మూసివేశారు. మండి, సిర్మౌర్ జిల్లాల్లోని దాదాపు 250కిపైగా రహదారులను అధికారులు మూసివేశారు. అంతేకాదు 614 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 130 నీటి సరఫరా పథకాలు ప్రభావితమయ్యాయి. ఇక భారీ వర్షాల నేపథ్యంలో హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రానికి భారత వాతావరణ శాఖ (ఎఓఆ) రెడ్ అలర్ట్ జారీ చేసింది.

## మాజీ ప్రధాని షేక్ హసీనాకు 6నెలల జైలుశిక్ష

**ఢాకా,జులై 2( వెలుతురు):**
బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు కోర్టు ధిక్కరణ కేసులో అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ 6 నెలల జైలుశిక్ష విధించింది. ఐసీటీ చైర్మన్ జస్టిస్ ఎండీ గోలం మోర్తుజా మొజుందార్ నేతృత్వంలో త్రిసభ్య ధర్మాసనం ఈ తీర్పును



వెలువరించినట్టు 'ఢాకా ట్రిబ్యూన్' తెలిపింది. సుమారు ఏడాది క్రితం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చోటుచేసుకున్న ఆందోళనల నేపథ్యంలో షేక్ హసీనా పదవీచ్యుతురాల య్యారు. వెంటనే దేశం వదిలిపెట్టి భారతదేశంలో ఆశ్రయం పొందుతున్నారు. ఢాకా కేంద్రంగా ఉన్న ఇంటర్నేషనల్ క్రైమ్ ట్రిబ్యునల్ షేక్ హసీనాకు గత జూన్‌లో అరెస్టు వారెంట్ చేసింది. బంగ్లాలోని తాత్కాలిక ప్రభుత్వం సైతం షేక్ హసీనాను రప్పించే ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో షేక్ హసీనాకు కోర్టు ధిక్కరణ కింద ఐసిటీ 6 నెలల జైలు శిక్ష విధించింది. బంగ్లా నుంచి పారిపోయిన 11 నెల తర్వాత హసీనాకు ఒక కేసులో జైలుశిక్ష పడటం ఇదే మొదటిసారి. కాగా, ఇదే కేసులో హసీనాతో పాటు గోవిందగంజ్‌కు చెందిన రాజకీయ నేత షకీల్ అకాండ్ బుల్బుల్‌కు కూడా ట్రిబ్యునల్ రెండు నెలల జైలుశిక్ష విధించింది. బంగ్లాదేశ్‌లో రాజకీయ అనిశ్చితి, ఆందోళనలు పతాక స్థాయికి చేరుకోవడంతో 2024 ఆగస్టు 5న షేక్ హసీనా ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసారు. ఢాకాలోని అధికార నివాసాన్ని ఖాళీ చేసి దేశం వదిలిపెట్టారు. అనంతరం క్రమంలో ఆమె న్యూఢిల్లీ చేరుకున్నారు. సురక్షిత ప్రాంతంలో ప్రస్తుతం ఆశ్రయం పొందుతున్నారు. స్వదేశంలో రిజర్వేషన్ ఆందోళనలు చెలరేగడం, ఆ తర్వాత జరిగిన అల్లర్లలో 1,400 మంది ప్రాణాలు కోల్పోయారని షేక్ హసీనాపై నేరాభియోగాలు నమోదయ్యాయి. అయితే తనపై వచ్చిన ఆరోపణలను షేక్ హసీనా తోసిపుచ్చారు.

## పాపికొండల విహారయాత్ర నిలిపివేత

**అల్లూరు,జూలై2( వెలుతురు):**
భారీ వర్షాల నేపథ్యంలో అల్లూరి జిల్లాలోని దేవీపట్నం నుంచి పాపికొండల విహారయాత్రను జలవనరుల శాఖ తాత్కాలికంగా నిలిపివేసింది. వర్షంతో పాటు గోదావరిలో నీటిమట్టం పెరుగుతున్న కారణంగా అధికారులు ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు దేవీపట్నం మండలం దండంగి, డి.రావిలంక గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ రహదారిపై గోదావరి వరద ప్రవాహం పెరిగింది. దీంతో గండి పోచమ్మ ఆలయం వైపునకు రాకపోకలు నిలిచిపోయాయి.పోలవరం ప్రాజెక్ట్ పరిసర ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో పాటు నదీ పరివాహక ప్రాంతాల నుంచి నీరు భారీగా గోదావరిలోకి వచ్చి చేరుతోంది. పోలవరం ప్రాజెక్ట్ స్పిల్‌వే వద్ద నీటిమట్టం 27.16 మీటర్లకు పెరిగింది. ఇదిలావుంటే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఆంధ్ర, ఒడిశా సరిహద్దులోని డుడుమ జలాశయం వద్ద నీటిమట్టాలు ప్రమాదస్థాయికి చేరుకున్నాయి. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 2,590 అడుగులు కాగా.. ప్రస్తుతం 2588.3 అడుగులకు చేరుకుంది. దీంతో ఏడో నంబరు గేటు ద్వారా వెయ్యి క్యూసెక్కుల వరద నీటిని దిగువన బలిమెల జలాశయానికి విడుదల చేస్తున్నారు. వరద ఉధృతి తగ్గకపోతే మరిన్ని గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

# వెలుతురు

జనరల్ వార్తలు

https://epaper.velthuru.com


## జైలునుంచి విడుదలయిన వంశీ

- బెయిల్ రద్దు చేయాలని సుప్రీంలో పిటిషన్
- ప్రభుత్వ వాదనను తోసిపుచ్చిన సుప్రం



**విజయవాడ, జులై 2( వెలుతురు):**
మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వల్లభనేని వంశీ విడుదలయ్యారు. బుధవారం విజయవాడ జైలు నుంచి వంశీ విడుదల అయ్యారు. నకిలీ ఇళ్లపట్టాల కేసులో వంశీకి నూజివీడు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో మధ్యాహ్నం వంశీ బెయిల్ ఆర్డర్ కాపీలతో విజయవాడ సబ్ జైలుకు ఆయన తరపు న్యాయవాదులు చేరుకున్నారు. అలాగే మాజీ మంత్రి పేర్ని నాని, తలశిల రఘురామ్ కూడా సబ్ జైలు దగ్గరకు వచ్చారు. జైలు అధికారులకు వంశీ న్యాయవాదులు బెయిల్ ఆర్డర్ కాపీలను సమర్పించిన తర్వాత మాజీ ఎమ్మెల్యే జైలు నుంచి బయటకు వచ్చారు. కాగా.. వివిధ కేసుల్లో దాదాపు 137 రోజులుగా వంశీ జైలులో ఉన్న విషయం తెలిసిందే. కాగా.. 2019 సార్వత్రిక ఎన్నికల్లో గన్నవరం నియోజకవర్గంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నకిలీ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారంటూ వంశీపై ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న వంశీ బెయిల్ కోసం నూజివీడు కోర్టును ఆశ్రయించారు. దీనిపై నాలుగు వారాల క్రితమే వాదనలు ముగియగా.. మంగళవారం వంశీకి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అలాగే వంశీపై ఉన్న రెండు కేసుల్లో కూడా గత నెలలోనే ఆయనకు బెయిల్ మంజూరు అయ్యింది. తాజాగా నకిలీ ఇళ్లపట్టాల కేసులో బెయిల్ రావడంతో ఈరోజు వంశీ జైలు నుంచి విడుదలయ్యారు.మరోవైపు అక్రమ మైనింగ్ కేసులో వంశీకి ఇచ్చిన బెయిల్ రద్దు చేయాలంటూ ఏపీ ప్రభుత్వం వేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టులో విచారణకు వచ్చింది. అక్రమ మైనింగ్‌పై దర్యాప్తు నివేదికను సీల్డ్ కవర్‌లో అందజేయాలని ఆదేశించిన సుప్రీం కోర్టు తదుపరి విచారణను ఈనెల 17కు వాయిదా వేసింది. అలాగే బెయిల్ రద్దు చేయాలన్న ప్రభుత్వ వాదనను తోసిపుచ్చింది.

## బిసి రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలు

- 17న రైలురోకో చేసి తీరుతాం
- ఖమ్మంలో పోస్టర్ ఆవిష్కరించిన కవిత



**ఖమ్మం, జులై 2( వెలుతురు):**
42 శాతం బీసీ రిజర్వేషన్లు ఆమోదం పొందిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విలేకర్లతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చేందుకు జులై 17వ తేదీన రైలు రోకో కార్యక్రమానికి పిలుపు నిచ్చామని తెలిపారు. ఈ రైలు రోకోలో అత్యధిక సంఖ్యలో పాల్గొని.. బీసీ రిజర్వేషన్లు ఉద్యమానికి మద్దతు తెలపాలంటూ ఖమ్మం జిల్లా ప్రజలకు ఈ సందర్భంగా ఆమె పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్క బీసీ బిడ్డ పాల్గొనాలన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో కేంద్రాన్ని ఒప్పించే బాధ్యత తెలంగాణ రాష్ట్ర నూతన బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన రామచందర్‌రావుదే బాధ్యత అని కవిత స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా రైలు రోకోకు బీఆర్ఎస్ పార్టీ పిలుపు నిచ్చింది. అందులోభాగంగా ఇటీవల అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్సీ కవిత విడుదల చేశారు. ఖమ్మం జిల్లా అంటేనే ఉద్యమాల ఖిల్లా అని గుర్తు చేశారు. అయితే వైరా నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల గురించి ఆలోచించండి.. అంతేకానీ బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసుల గురించి కాదంటూ కాంగ్రెస్ పార్టీ నేతలకు కవిత చురకలంటించారు. పోలవరం - బనకచర్ల నీటి విషయంలో ఖమ్మం జిల్లాలోని ముగ్గురు మంత్రులు మాట్లాడాలని ఈ సందర్భంగా కవిత డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ ఇస్తామని అనేక సభలలో ఆ పార్టీ నేతలు హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. వైరా మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ మరణం బీఆర్ఎస్ పార్టీతోపాటు ఖమ్మం జిల్లాకు తీరని లోటన్నారు. మదన్ లాల్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని చెప్పారు. మదన్‌లాల్ కుటుంబానికి తమ పార్టీ అండగా ఉంటుందని ఈ సందర్భంగా కవిత భరోసా ఇచ్చారు.

## పాశమైలారం ఘటనపై దర్యాప్తు చేపట్టాలి: ఓవైసీ



**హైదరాబాద్, జులై 2( వెలుతురు):**
సంగారెడ్డి జిల్లాలోని సిగాచీ ఫార్మా కంపెనీలో పేలుడు సంభవించి పెద్ద సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు మరణించిన ఘటనపై ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. అదొక దురదృష్టకరమైన ఘటన అని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. ఈ ఘటనలో 38 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని, ఇది బాధాకరమైన ఘటన అని అన్నారు. మృతుల్లో ఎక్కువగా జార్ఖండ్‌కు చెందిన వారు ఉన్నారని తెలిపారు. గుర్తించలేనంతగా కాలిపోయిన మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు చేస్తున్నారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి సందర్శించిన తర్వాతనైనా ఘటనపై వేగంగా దర్యాప్తు జరుగుతుందని ఆశిస్తున్నానని అన్నారు. ఈ ప్రమాదంలో సిగాచీ ఫార్మా ఫ్యాక్టరీ యాజమాన్యం తప్పిదం ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని ఒవైసీ డిమాండ్ చేశారు. కాగా సిగాచీ ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలిపేయి పెద్ద సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారు. సోమవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది.

# కనీసం ముగ్గురు పిల్లలను కనండి

**న్యూయార్క్, జులై 2( వెలుతురు):**
ఎక్స్ వేదికగా ఓ వినియోగదారు చేసిన పోస్టుకు మస్క్ స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఫార్చ్యూన్ నివేదికను ప్రస్తావిస్తూ.. జనాభా స్థిరంగా కొనసాగాలంటే ఒక మహిళకు సగటున 2.1 మంది పిల్లలు సరిపోరని, ఆ సంఖ్య 2.7గా ఉండాలని శాస్త్రవేత్తలు చెబుతున్నారని ఆ పోస్టులో పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికాలో ఈ రేటు 1.66గా ఉండగా, ఇటలీలో 1.29, జపాన్‌లో 1.3గా ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. పిల్లలు లేనివారు, లింగ అసమతుల్యత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ కొత్త సంఖ్యను నిర్ధారించినట్లు తెలిపారు. ఈ పోస్టును రీపోస్ట్ చేసిన మస్క్ “పిల్లలు లేనివారు లేదా ఒక్కరే బిడ్డ ఉన్నవారి లోటును భర్తీ చేయాలంటే, పిల్లలు ఉన్నవారు కచ్చితంగా ముగ్గురిని కనాలి. లేకపోతే జనాభా కుప్పకూలిపోతుంది” అని వ్యాఖ్యానించారు. తన మాటలను ఇప్పుడు నమ్మకపోయినా, 20 ఏళ్లలో నిజం తెలుస్తుందని ఆయన హెచ్చరించారు. జననాల రేటు తగ్గడానికి, గతంలో నాగరికతలు అంతరించిపోవడానికి మధ్య బలమైన సంబంధం ఉందని మస్క్ ఎప్పటినుంచో వాదిస్తున్నారు. పురాతన రోమ్ పతనానికి తక్కువ జననాల రేటే ప్రధాన కారణమని, కానీ చాలా మంది చరిత్రకారులు ఈ విషయాన్ని



పట్టించుకోలేదని ఆయన గతంలో వ్యాఖ్యానించారు. మస్క్‌కు ప్రస్తుతం 14 మంది సంతానం ఉండటం గమనార్హం. మస్క్ ఆందోళనలకు బలం చేకూరుస్తూ ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఫండ్ నివేదిక కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా సంతానోత్పత్తి రేట్లు గణనీయంగా తగ్గుతున్నాయని ‘ది రియల్ ఫెర్టిలిటీ క్రైసిస్’ పేరుతో విడుదలైన 2025 ప్రపంచ జనాభా నివేదికలో వెల్లడించింది.

పిల్లల పెంపకం ఖర్చు విపరీతంగా పెరగడం, సరైన భాగస్వామిని ఎంచుకోవడంలో జాప్యం వంటి కారణాలతో చాలా మంది కోరుకున్నంత మంది పిల్లలను కనలేకపోతున్నారని పేర్కొంది. ఈ నివేదికలో భారత్‌కు సంబంధించిన ఆందోళనకరమైన విషయాలు కూడా ఉన్నాయి. భారతదేశంలో మొత్తం సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) 1.9కి పడిపోయిందని, ఇది జనాభా స్థిరత్వానికి అవసరమైన 2.1 కంటే తక్కువని యూఎన్ఎఫ్‌పీఏ స్పష్టం చేసింది. “విద్యావకాశాలు మెరుగుపడటం, పునరుత్పత్తి ఆరోగ్య సంరక్షణ అందుబాటులోకి రావడం వల్ల 1970లో 5గా ఉన్న సంతానోత్పత్తి రేటు ప్రస్తుతం 2కి తగ్గింది. ఇది గొప్ప ప్రగతే అయినప్పటికీ, తగ్గుతున్న రేటు భవిష్యత్తులో సవాళ్లను విసరనుందని యూఎన్ఎఫ్‌పీఏ ఇండియా ప్రతినిధి ఆండ్రియా ఎం వోజ్నార్ తెలిపారు.

# ఐదు దేశాల్లో మోడీ టూర్...

**న్యూఢిల్లీ, జులై 2( వెలుతురు):**
భారత ప్రధాని నరేంద్ర మోడీ నేటి నుంచి ఎనిమిది రోజుల పాటు ఐదు దేశాల సుదీర్ఘ పర్యటనకు బయలుదేరనున్నారు. గత దశాబ్ద కాలంలో మోడీ చేస్తున్న అత్యంత సుదీర్ఘమైన విదేశీ పర్యటన ఇది. ఈ పర్యటనలో ఆయన ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియా దేశాలను సందర్శించనున్నారు. ముఖ్యంగా బ్రెజిల్‌లో జరిగే బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనడం ఈ పర్యటనలోని ప్రధాన ఉద్దేశ్యం. గ్లోబల్ సౌత్ దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడం, వాణిజ్యం, రక్షణ, శక్తి రంగాల్లో సహకారాన్ని పెంపొందించడంపై ప్రధాని మోడీ దృష్టి సారించనున్నారు. అలాగే, ప్రధానమంత్రి బ్రెజిల్‌లో జరిగే కీలకమైన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలోనూ పాల్గొంటారు.ప్రధాని మోదీ చివరి ఎనిమిది రోజుల పర్యటన జులై 2015లో ఆరు దేశాల పర్యటనకు వెళ్లారు. ఆ సమయంలో ప్రధాని మోడీ రష్యాతోపాటు ఐదు మధ్య ఆసియా దేశాలను సందర్శించారు. ఈ పర్యటన రక్షణ, అరుదైన భూమి ఖనిజాలు, ఉగ్రవాద నిరోధక చర్యలపై సహకారం వంటి అంశాలపై దృష్టి సారిస్తుందని అధికారులు తెలిపారు.మోడీ పర్యటన ఘనాతో ప్రారంభమైంది. మూడు దశాబ్దాల తర్వాత భారత ప్రధాని ఘనాలో పర్యటించడం ఇదే మొదటిసారి.ఘనా అధ్యక్షుడితో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఆర్థికం, ఇంధనం, రక్షణ రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవడంపై చర్చిస్తారు. పశ్చిమ ఆఫ్రికా రాష్ట్రాల ఆర్థిక సంఘం, ఆఫ్రికన్ యూనియన్‌తో భారతదేశ సంబంధాలను బలోపేతం చేయడానికి ఈ పర్యటన దోహదపడుతుంది.వ్యాక్సిన్ హబ్‌ను ఏర్పాటు చేయడానికి మద్దతు ఇస్తారు.ఘనా పార్లమెంటును ఉద్దేశించి ప్రసంగిస్తారు. పశ్చిమ ఆఫ్రికాలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఘనా ఒకటి. ఘనా ఎగుమతులకు భారతదేశం అతిపెద్ద గమ్యస్థానం. ఘనా నుంచి భారతదేశం చేసే దిగుమతుల్లో బంగారం 70 శాతానికి పైగా ఉంది. జనవరిలో ఘనా అధ్యక్షుడిగా ఎన్నికైన జాన్ మహామా, 2015లో ఇండియా-ఆఫ్రికా ఫోరం సమ్మిట్ కోసం భారతదేశాన్ని సందర్శించిన సంగతి తెలిసిందే. జులై 3-4: ట్రినిడాడ్ అండ్ టొబాగో ఘనా పర్యటన అనంతరం కరేబియన్ దేశమైన ట్రినిడాడ్ అండ్ టొబాగోకు మోడీ బయలుదేరుతారు. 1999 తర్వాత భారత ప్రధాని ఈ దేశంలో పర్యటించడం ఇదే ప్రథమం. ట్రినిడాడ్ అండ్ టొబాగో అధ్యక్షురాలు క్రిస్టీన్ కార్లా కంగలూ, ప్రధాన మంత్రి కమ్లా పెర్సాద్-బిస్సేసర్‌లతో మోడీ సమావేశమవుతారు. ఈ దేశ పార్లమెంటు ఉమ్మడి సమావేశంలో ప్రధాని మోడీ ప్రసంగించనున్నారు. ఇరు దేశాల మధ్య దీర్ఘకాలిక, చారిత్రక సంబంధాలకు ఈ పర్యటన కొత్త ఊపునిస్తుందని విదేశాంగ శాఖ తెలిపింది. ఆరోగ్యం, డిజిటల్ టెక్నాలజీ, రక్షణ రంగాల్లో సహకారంపై దృష్టి సారిస్తారు. ఘనా నుంచి మోడీ జులై 3 నుంచి రెండు రోజుల పర్యటన కోసం ట్రినిడాడ్, టొబాగోకు వెళతారు. 1999 తర్వాత భారత ప్రధానమంత్రి ఆ దేశానికి చేయడం ఇదే మొదటిసారి. జులై 4-5: అర్జెంటీనా కరేబియన్ దేశం నుంచి నేరుగా దక్షిణ అమెరికాలోని అర్జెంటీనాకు ప్రధాని వెళ్తారు. అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలీతో విస్తృత స్థాయి చర్చలు జరుపుతారు. రక్షణ, వ్యవసాయం, మైనింగ్, చమురు, గ్యాస్, పునరుత్పాదక శక్తి, వాణిజ్యం, పెట్టుబడులు వంటి కీలక రంగాల్లో ఇండియా-అర్జెంటీనా భాగస్వామ్యాన్ని మరింత మెరుగుపరచడంపై దృష్టి పెడతారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని విదేశాంగ శాఖ పేర్కొంది. జులై 5-8: బ్రెజిల్ అర్జెంటీనా పర్యటన ముగిసిన తర్వాత, జూలై 5 నుంచి 8వ తేదీ వరకు బ్రెజిల్‌లో ప్రధాని మోడీ పర్యటిస్తారు.రియో డి జనీరోలో జరిగే 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ఆయన పాల్గొంటారు. ఇది ప్రధానిగా మోడీ నాలుగో బ్రెజిల్ పర్యటన. సదస్సు సందర్భంగా పలు దేశాధినేతలతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై దృష్టి సారించి, ఉగ్రవాదంపై కఠిన వైఖరిని BRICS సదస్సులో వినిపించనున్నారు. డిఫెన్స్, ట్రేడ్, టెక్నాలజీ, ఇంధన సహకారంపై చర్చలు జరుగుతాయి. 2026లో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు భారత్ చేపట్టనున్న నేపథ్యంలో, ప్రస్తుత సదస్సు కీలకమైనది.



బ్రెజిల్‌లో బ్రిక్స్ నాయకుల శిఖరాగ్ర సమావేశం.. అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా ద సిల్వా ఆహ్వానం మేరకు మోడీ బ్రెజిల్ పర్యటనలో నాల్గవ, అతి ముఖ్యమైన దశలో భాగంగా పర్యటించనున్నారు. జులై 5 నుంచి 8 వరకు బ్రెజిల్‌లో జరిగే 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి మోడీ హాజరవుతారు. ఆ తర్వాత రాష్ట్ర పర్యటన చేస్తారు. ప్రధానమంత్రిగా మోడీ బ్రెజిల్‌కు ఇది నాల్గవ పర్యటన అవుతుంది. 17వ బ్రిక్స్ నాయకుల శిఖరాగ్ర సమావేశం రియో డి జనీరోలో జరుగుతుంది. జులై 8-9: నమీబియా ఈ సుదీర్ఘ పర్యటన చివరి దశ నమీబియా. భారత ప్రధాని నమీబియాలో పర్యటించడం ఇది మూడోసారి. నమీబియా అధ్యక్షుడు నెతుంబో నంది-నదిత్వాతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. నమీబియా పార్లమెంటును ఉద్దేశించి ప్రసంగించనున్నారు. గ్రీన్ ఎనర్జీ, వాటర్ టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి, భారతదేశ యునైటెడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ అమలు వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయి. ఈ పర్యటన భారతదేశం తన “గ్లోబల్ సౌత్” దేశాలతో సంబంధాలను బలోపేతం చేసుకోవడంతోపాటు కీలకమైన ప్రాంతీయ, అంతర్జాతీయ వేదికలపై తన ప్రభావాన్ని విస్తరించడంలో కీలక పాత్ర పోషించనుంది. రక్షణ, వాణిజ్యం, ఇంధన భద్రత, వ్యూహాత్మక ఖనిజాలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు వంటి రంగాల్లో సహకారాన్ని పెంపొందించడంపై ఈ పర్యటన ప్రధానంగా దృష్టి సారించనుంది.

# రామచంద్రరావుకు అంత వీజీయే కాదు...



**హైదరాబాద్, జులై 2( వెలుతురు):**
తెలంగాణ బీజేపీ అధ్యక్ష ఎన్నికలు ఎట్టకేలకు నిర్వహించారు. కొత్త సారధిగా మాజీ ఎమ్మెల్యే ఎన్.రామచందర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు మంగళవారం అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, సీనియర్ నాయకులు రామచందర్‌రావును అభినందించారు. శుభాకాంక్షలు తెలిపారు. బీసీ నినాదం వేళ.. ఓసీ నేత తెలంగాణ సారథి కావడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. మరోవైపు కొత్త సారథికి పార్టీలో సరికొత్త సవాళ్లు ఎదురుకాబోతున్నాయి.తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన ఎన్. రామచందర్‌రావు ముందు రాజకీయ సవాళ్లు, అవకాశాలతో కూడిన కీలక బాధ్యత ఉంది. రాష్ట్రంలో మూడు నెలల్లో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు జరుగనున్నాయి. గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో సాధించిన విజయాలను కొనసాగిస్తూ, 2028 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం సాధించాలన్న బీజేపీ అధిష్టానం ఆకాంక్షలను నెరవేర్చాల్సి ఉంది. పార్టీలోని అసంతృప్తులను సమన్వయం చేస్తూ, క్షేత్రస్థాయిలో సంస్థాగత బలోపేతం చేయాల్సి ఉంది.ఎవరు అనువన్నా.. కాదనా?న్నా.. బండి సంజయ్ బీజేపీ తెలంగాణ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక పార్టీకి గణనీయమైన మైలేజీ వచ్చింది. గణనీయమైన పురోగతి సాధించింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 1 సీటు సాధించిన బీజేపీ, 2023లో 8 అసెంబ్లీ సీట్లు, 2024 లోక్‌సభ ఎన్నికల్లో 8 సీట్లతో 35.08% ఓటు షేర్‌ను సాధించింది. ఈ విజయాలను స్థానిక సంస్థల ఎన్నికలైన పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కొనసాగించడం రామచందర్‌రావు ముందున్న తొలి సవాలు. ఈ ఎన్నికలు పార్టీ క్షేత్రస్థాయి బలానికి పరీక్ష. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పార్టీ సందేశాన్ని విస్తృతంగా చేరవేయడం కీలకం. వచ్చే ఏడాది జరిగే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో గతానికన్నా బలమైన ప్రదర్శన చేయడం రామచందర్‌రావు ఎదుర్కొనే మరో సవాల్.రామచందర్‌రావు నియామకం పార్టీలో కొంత వివాదానికి దారితీసింది. ముఖ్యంగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పార్టీకి రాజీనామా చేశారు. ఈటల రాజేందర్, బండి సంజయ్, ధర్మపురి అరవింద్ వంటి నాయకులు అధ్యక్ష పదవికి ఆశించారు. అయితే రామచందర్‌రావును ఎంపిక చేయడం వెనుక అధిష్ఠానం ఆలోచన అతని అనుభవం, ఆర్ఎస్ఎస్‌తో సన్నిహిత సంబంధాలు, వివాదరహిత ఇమేజ్ కీలకంగా ఉన్నాయి. అయితే, రామచందర్‌రావుకు ఇప్పుడు అసంతృప్త నాయకులను కలుపుకొని, వివిధవర్గాల మధ్య సమతుల్యత సాధించడం అతిపెద్ద సవాల్. రాజాసింగ్ వంటి నాయకుల అసంతృప్తిని తగ్గించడం, ఈటల రాజేందర్ వంటి బీఆర్ఎస్ నుంచి వచ్చిన సీనియర్ నాయకులను సమర్థవంతంగా వినియోగించుకోవడం నాయకత్వ నైపుణ్యానికి ఓ పరీక్ష. రామచందర్‌రావు గతంలో సంఘటన పర్వ్ సభ్యత్వ డ్రైవ్‌లో కన్వీనర్‌గా పనిచేసి, తెలంగాణలో బీజేపీ సభ్యత్వాన్ని 12 లక్షల నుంచి 40 లక్షలకు పెంచారు. ఈ అనుభవం ఆయనకు క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో ఉపయోగపడనుంది. అయితే, రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లతో తీవ్ర పోటీ ఉన్న నేపథ్యంలో, గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ ఆధారాన్ని విస్తరించడం, యువత, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ఓబీసీ మోర్చా, ఏబీవీపీ వంటి విభాగాల ద్వారా ఆకర్షించడం అవసరం.2028లో తెలంగాణలో అధికారం సాధించాలన్న బీజేపీ అధిష్టానం లక్ష్యం రామచందర్‌రావుపై ఒత్తిడిని పెంచుతుంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ 65 సీట్లతో అధికారంలోకి రాగా, బీఆర్ఎస్ 39 సీట్లతో ప్రధాన ప్రతిపక్షంగా నిలిచింది. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఈ రెండు పార్టీలను ఢీకొట్టి, రాష్ట్రంలో మొదటిసారి అధికారంలోకి రావాలంటే, రామచందర్‌రావు బీఆర్ఎస్, కాంగ్రెస్ ఓటు బ్యాంకులను చీల్చే వ్యూహాలను రూపొందించాలి. ఇందుకోసం, స్థానిక నాయకులను బలోపేతం చేయడం, హిందుత్వ ఎజెండాతోపాటు అభివృద్ధి, సామాజిక న్యాయం వంటి అంశాలను సమతుల్యం చేయడం అవసరం.తెలంగాణలో వచ్చే ఎన్నికల నాటికి బీజేపీ, బీఆర్ఎస్, టీడీపీ కలిసి పోటీ చేసే అవకాశం ఉందని కొంతమంది రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రామచందర్‌రావు నియామకం వెనుక టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఉన్నారన్న ప్రచారం జరుగుతోంది. ఇలాంటి పరిస్థితిలో కుదిరితే పొత్తు పెట్టుకోవడం.. లేదంటే విపక్షాలను చిత్తు చేయాల్సిన ఎత్తులు వేయాల్సిన బాధ్యత రామచందర్‌రావుపై ఉంది. ఈ సమీకరణాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, స్థానిక స్థాయిలో పార్టీ బలాన్ని పెంచడంపై దృష్టి సారించాలి.

# శంషాబాద్‌లో వర్షాలతో మేఘావృతం

- విమానాలకు ప్రతికూల వాతావరణం



హైదరాబాద్, జులై 2( వెలుతురు):
రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో నిన్న సాయంత్రం నుంచి కుండపోత వర్షం కురుస్తోన్న సంగతి తెలిసిందే. మంగళవారం అర్ధరాత్రి ప్రతికూల వాతావరణం ఏర్పడడం కారణంగా.. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానాల ల్యాండింగ్‌కు అధికారులు అనుమతివ్వలేదు. దీంతో కొన్ని విమానాలు బెంగళూరు, విజయవాడ వైపు మళ్లించారు. లక్నో, కోల్‌కతా, ముంబై, జైపూర్ నుంచి వచ్చే విమానాలను బెంగళూరు ఎయిర్‌పోర్టుకు మళ్లించారు. బెంగళూరు నుంచి హైదరాబాద్ వచ్చే ౹÷÷-లట్‌ను విజయవాడకు మళ్లించారు. ఇక బుధవారం ఉదయం నాటికి వాతావరణం అనుకూలంగా ఉండడంతో.. అన్ని విమానాలు యథావిధిగా కొనసాగుతున్నాయని శంషాబాద్ ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు.

# శ్రీశైలానికి కొనసాగుతున్న వరద ఉధృతి



శ్రీశైలం, జులై 2( వెలుతురు):
శ్రీశైలం జలాశయానికి వరద నీటి ప్రవాహం కొనసాగుతూనే ఉన్నది. జూరాల నుంచి శ్రీశైలానికి 83.224 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. అదే విధంగా జలాశయం పూర్తిస్థాయి నీటినిల్వ 885 అడుగులు కాగా ప్రస్తుతం ప్రస్తుత నీటిమట్టం 875.2 అడుగులు ఉండగా పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 215.8 టీఎంసీలు కాగా ప్రస్తుతం 164.7 టీఎంసీలు ఉన్నాయి. శ్రీశైలం కుడి, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రాలో విద్యుదుత్పత్తి కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. విద్యుత్ ఉత్తత్తి చేసి35,315 క్యూసెక్కులు దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.

# కొన్ని వస్తువులపై జిఎస్టీ భారం తగ్గింపు

- ప్రభుత్వ యోచనలో ఉన్నట్లు సమాచారం

న్యూఢిల్లీ,జులై 2( వెలుతురు):
ఈ ఏడాది ఆదాయ పన్నుల రాయితీల రూపంలో మధ్యతరగతి వర్గానికి ఉపశమనం కల్పించిన కేంద్ర ప్రభుత్వం మరో చర్యకు సిద్ధమవుతోంది. మధ్యతరగతి, తక్కువ ఆదాయ కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని వస్తు సేవల పన్ను(జీఎస్‌టీ) తగ్గించాలని భావిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. 12 శాతం జీఎస్టీ స్లాబ్‌ను పూర్తిగా తొలగించం లేదా ప్రస్తుతం 12 శాతం పన్ను విధించబడుతున్న అనేక వస్తువులను దిగువన 5 శాతంలోకి తిరిగి చేర్చడం వంటి వాటి గురించి కేంద్రం ఆలోచిస్తోంది. ఈ అరేంజ్మెంట్ మధ్యతరగతి, ఆర్థికంగా బలహీన వర్గాలు ఉపయోగించే టూత్‌పేస్ట్, టూత్ పౌడర్, డుగులు, కుట్టు యంత్రాలు, ప్రెషర్ కుక్కర్లు మరియు వంటగది పాత్రలు, ఎలక్ట్రిక్ ఐరన్‌లు, గీజర్‌లు, చిన్న సామర్థ్యం గల వాషింగ్ మెషీన్లు, సైకిళ్లు, రూ. 1,000 కంటే ఎక్కువ ధర కలిగిన రెడీమేడ్ దుస్తులు, రూ. 500 నుండి రూ. 1,000 మధ్య ధర కలిగిన పాదరక్షలు, స్టేషనరీ వస్తువులు, టీకాలు, సిరామిక్ టైల్స్, వ్యవసాయ ఉపకరణాలు వంటి వాటి ధరలు తగ్గే అవకాశం ఉంది. మార్పులు అమలు చేయబడితే ఈ వస్తువులు చాలా వరకు తక్కువ ధరలకు వస్తాయి. మరోవైపు, ప్రభుత్వం సరళీకృతమైన, సులభంగా పాటించే జీఎస్టీని కూడా పరిశీలిస్తోంది. అయితే, ఈ చర్యల వల్ల ప్రభుత్వంపై రూ. 40,000 కోట్ల నుంచి రూ. 50,000 కోట్ల వరకు భారాన్ని మోపుతుందని తెలుస్తోంది. అయితే, వినియోగం పెరిగితే జీఎస్టీ వసూల్లు పెరుగుతాయని కేంద్రం నమ్ముతోంది. మరోవైపు, కేంద్రం ఈ చర్యలకు ఒప్పుకున్నా రాష్ట్రాలు ఏ విధంగా భావిస్తాయనేది చూడాలి. ఉ÷ కింద, రేటు మార్పులకు ఉ÷ కౌన్సిల్ నుండి ఆమోదం అవసరం. ఇప్పటి వరకు జీఎస్టీ కౌన్సిల్ చరిత్రలో ఒకసారి మాత్రమే ఓటింగ్ జరిగింది. ప్రతీ నిర్ణయం కూడా ఏకాభిప్రాయం ప్రకారమే తీసుకుంది. ఈ నెల చివర్లో జరిగే 56వ కౌన్సిల్ సమావేశంలో ఈ అంశం ప్రస్తావనకు వస్తుందని భావిస్తున్నారు.

# తమిళనాడులో పవన్‌పై కేసు

- మండిపడ్డ బిజెపి అధ్యక్షుడు మాధవ్



విజయవాడ,జులై 2(వెలుతురు):
ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ నేతలపై తమిళనాడులో కేసు పెట్టడం మురుగన్‌పై దాడిగా భావిస్తామని ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. పవన్ కల్యాణ్, బీజేపీ నేతలపై తమిళనాడు ప్రభుత్వం కేసు పెట్టడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తమిళనాడు ప్రభుత్వంపై మాధవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే తమిళనాడు ఎన్నికల్లో డీఎంకే ఓటమి తథ్యమని పీవీఎన్ మాధవ్ తెలిపారు. తమిళనాడులోదుర్మార్గపు పాలన ఉందని విమర్శించారు. సనాతన ధర్మం నాశనం అయిపోవాలని, వేదాంగాలపైన నీచమైన ఆలోచన కలిగిన ప్రభుత్వం తమిళనాడులో ఉందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం విజయవాడలో జాతీయ హిందూ ధార్మిక సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పలువురు మఠాధిపతులు, పీఠాధిపతులు, మాధవ్, గజల్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవ్ మీడియాతో మాట్లాడారు. అన్నామలైకి అండగా పవన్ కల్యాణ్ కూడా రంగంలోకి దిగారని చెప్పుకొచ్చారు. పవన్ కల్యాణ్, అన్నామలైకి తాము అండగా ఉంటామని పీవీఎన్ మాధవ్ ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా గోమాతను జాతీయ జంతువుగా గుర్తించాలని స్వామి శ్రీనివాసానంద సరస్వతి సూచించారు. ఉత్తరాదిలో చాలా దేవాలయాలు మద్యం, మాంస రహితంగా ఉన్నాయని వెల్లడించారు. తిరుమల, తిరుపతిలను కూడా మద్యం, మాంస రహితంగా చేయాలని కోరారు. తిరుమల తిరుపతిని పవిత్రంగా ఉంచి.. టెంపుల్ సిటీగా ప్రకటించాలని సూచించారు. అయోధ్యలాగా తిరుపతి తిరుమలను మద్యం, మాంస రహితంగా, అన్యమత ప్రచార రహితంగా చేయాలని అన్నారు. దేవాలయాల భూములు, ఆస్తులను సంరక్షించాలని స్వామి శ్రీనివాసానంద సరస్వతి కోరారు.

# ఎపి ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన జగన్

## ఇంటింటికీ టిడిపి కార్యక్రమంలో మంత్రి నిమ్మల

భీమవరం,జులై 2( వెలుతురు):
వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి నిమ్మల రామానాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. జగన్ ఏపీ ఆర్థిక పరిస్థితిని చిన్నాభిన్నం చేసి అప్పుల పాల్జేశారని ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన నష్టం కన్నా.. జగన్ ఐదేళ్ల పాలనలోనే ఏపీకి ఎక్కువ నష్టం జరిగిందని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2024 ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలతో విస్తృతమైన సంక్షేమ అజెండాను ప్రకటించారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మరో రెండు పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేయనుంది. ఈ మేరకు మంత్రి నిమ్మల రామానాయుడు ఈ రెండు పథకాల గురించి కీలక ప్రకటన చేశారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం పథకాన్ని ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీ నుంచి అమల్లోకి తీసుకువస్తున్నామని మంత్రి




నిమ్మల రామానాయుడు ప్రకటించారు. అలాగే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు ఇవ్వబోతున్నామని స్పష్టం చేశారు. బుధవారం పశ్చిమగోదావరి జిల్లాలో మంత్రి నిమ్మల రామానాయుడు పర్యటించారు. పాలకొల్లు నియోజకవర్గంలో సుపరిపాలనలో తొలి అడుగు.. ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై వివరిస్తున్నామని చెప్పుకొచ్చారు. తమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చూసిన ప్రజలు తమది మంచి ప్రభుత్వమని చెబుతున్నారని పేర్కొన్నారు. పేదరికాన్ని పారద్రోలేలా మార్గదర్శకుల సహకారంతో పీ4ను అమలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అన్నింటినీ అమలు చేస్తున్నామని చెప్పుకొచ్చారు మంత్రి నిమ్మల రామానాయుడు. కూటమి పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు. సీఎం చంద్రబాబు ఏపీ ఆర్థిక పరిస్థితిని చక్కబెడుతూనే ప్రతి ఇంటికి సంక్షేమాన్ని, ప్రగతిని అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని ఉద్ఘాటించారు.


# మేడారం సమ్మక్క జాతర తేదీలు ఖరారు

## జనవరి 28 నుంచి 31 వరకు నాలుగు రోజుల జాతర

ములుగు, జులై 2( వెలుతురు):
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవతల మహా జాతర తేదీలు ఖరారయ్యాయి. మేడారం మహా జాతర 2026 తేదీలను కోయ పూజారులు ప్రకటించారు. 2026 జనవరి 28 నుంచి 31 వరకు జాతర జరుగనుంది. మేడారంలో 2026లో నిర్వహించే శ్రీ సమ్మక్క సారలమ్మ మహాజాతర తేదీలను పూజారులు ఖరారు చేశారు. జాతర తేదీలను పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు ప్రకటించారు. బుధవారం మేడారంలోని ఎండోన్‌మెంట్ కార్యాలయంలో పూజారులు, పుర ప్రజలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు మాట్లాడారు. 2026 జనవరి 28వ తేదీ నుంచి మేడారం జాతర ప్రారంభం అవుతుందని తెలిపారు. 28న బుధవారం సాయంత్రం కన్నెపల్లి నుండి సారలమ్మ, పూనుగొండ్ల నుండి పగిడిద్దరాజు, కొండాయి నుండి గోవిందరాజులను గద్దెలపైకి తీసుకొస్తారని, జనవరి 29వ సాయంత్రం చిలుకలగుట్ట నుండి సమ్మక్క తల్లిని గద్దె మీదకు తీసుకొస్తారని తెలిపారు. అదేవిధంగా జనవరి 30వ తేదీన వన దేవతలకు మొక్కులు చెల్లింపులు, జనవరి 31వ తేదీన తల్లుల వన ప్రవేశం



ఉంటుందని ప్రకటించారు. అనివార్య కారణాల రీత్యా 2024 జాతర తేదీలను 9 నెలల ముందుగానే ప్రకటించారు. నాలుగు రోజుల పాటు ఈ జాతర జరుగుతుంది. ఆపై 30న వన దేవతలకు భక్తులు తమ తమ మొక్కులను చెల్లించే కార్యక్రమం ఉంటుంది. 31న సాయంత్రం 6 గంటల సమయంలో సమ్మక్క, సారలమ్మ దేవతలు, గోవింద రాజు, పగిడిద్ద రాజు దేవుళ్ల వన ప్రవేశంతో జాతర ముగుస్తుందని కోయ పూజారులు వెల్లడించారు. ఈ జాతరకు ఏర్పాట్లు



పూజారుల (వడ్డెలు) సంఘం
శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర, మేడారం
శ్రీ సమ్మక్క - సారలమ్మ (తాడ్వాయి) మండలం,
ములుగు జిల్లా, తెలంగాణ రాష్ట్రం,
రిజిష్టర్ నెం : 22

సెల్ : 94410 02258
సెల్ : 94947 52076
తేది : 01.07.2025

| | | |
|---|---|---|
| 28-01-2026 | బుధవారము | : సాయంత్రం 6 గం॥ లకు శ్రీ సారలమ్మ అమ్మవారు గద్దెకు వచ్చుట మరియు శ్రీ గోవింద రాజు, పగిడిద్ద రాజులు గద్దెలకు వచ్చుట |
| 29-01-2026 | గురువారము | : సాయంత్రం 6 గం॥ లకు శ్రీ సమ్మక్క అమ్మవారు గద్దెకు వచ్చుట |
| 30-01-2026 | శుక్రవారము | : మొక్కుబడులు సమర్పించుకొనుట |
| 31-01-2026 | శనివారము | : సాయంత్రం 6 గం॥లకు తిరిగి శ్రీ సమ్మక్క సారలమ్మ అమ్మవార్లు మరియు శ్రీ గోవింద రాజు, పగిడిద్ద రాజులు, వనప్రవేశం చేయుట. |

తమ విధేయులు
పూజారి సంఘం అధ్యక్షులు
శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర, మేడారం

చేయాల్సిందిగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పూజారులు కోరుతున్నారు. కాగా.. తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన మేడారం జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలం మేడారం జాతర జరుగుతుంది. ప్రతీ రెండు సంవత్సరాలకు ఒకసారి ఈ జాతరను నిర్వహిస్తుంటారు. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద గిరిజన పండుగగా ప్రసిద్ధి చెందింది.

# కర్ణాటక కాంగ్రెస్ లో మళ్లీ అలజడి

బెంగళూరు, జులై 2( వెలుతురు):
కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై మరోసారి ఊహాగానాలు ఊపందుకున్నాయి. విజయదశమి నాటికి అధికార కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రి పీఠంతోపాటు పిసిసి అధ్యక్ష స్థానం, మంత్రివర్గంలో మార్పులు చోటుచేసుకుంటాయని కొద్ది రోజులుగా కాంగ్రెస్ అసమ్మతి నేతలు బహిరంగంగానే ప్రకటనలు చేస్తున్నారు. అయితే అధికార మార్పిడి ఉండబోదని, సిద్ధరామయ్యే పూర్తికాలం పదవిలో కొనసాగుతారని ఆయన వర్గం నేతలు ధీమాగా ఉన్నారు. ఒకవేళ ముఖ్యమంత్రి స్థానాన్ని ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్‌కు వదిలి పెట్టాల్సిన పరిస్థితి వస్తే పిసిసి అధ్యక్ష పదవిని తనకు చిరకాలంగా మద్దతు ఇస్తూ వస్తున్న మంత్రి సతీశ్ జారి?హెూళికి కట్టబెట్టాలని సిద్ధరామయ్య పార్టీ అధిష్ఠానాన్ని కోరినట్లు సమాచారం.మరోవైపు కర్ణాటకలో అధికార మార్పిడి గురించి సోమవారం విలేఖరులు అడిగిన ప్రశ్నకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ, అంతా పార్టీ అధిష్ఠానవర్గం చేతుల్లో ఉందని వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ విషయంపై ప్రతిపక్ష బిజెపి నేత తేజస్వి సూర్య స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీలో అధిష్ఠానవర్గం అనేది దయ్యం లాంటిదని, అది ఎవరికీ కనిపించదు, వినిపించదని ఎద్దేవా చేశారు. పార్టీకి అధ్యక్షుడు అధిష్ఠానం కానప్పుడు మరెవరని కూడా ఆయన ఎదురుప్రశ్న వేశారు. మరోవైపు రాష్ట్ర కాంగ్రెస్‌లో ఎలాంటి లుకలుకలు లేవని, తాను, శివకుమార్‌లు కలిసి బాగానే పని చేస్తున్నామని చెప్పడానికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రయత్నిస్తున్నారు. మైసూరులో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఇరువురు నేతలు చేతులు పట్టుకుని పైకెత్తి తాము కలిసే ఉన్నామని చెప్పే ప్రయత్నం చేశారు.అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటినుంచీ ఇరువురు నేతలు కలిసి ఉన్నట్లు పైకి కనిపించినా ఇద్దరి మధ్య దూరం కొనసాగుతూనే ఉందనేది పార్టీ వర్గాల అభిప్రాయం. వాస్తవానికి 2023లో కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించినప్పటినుంచి కూడా ముఖ్యమంత్రి పీఠంపై వివాదం కొనసాగుతూనే ఉంది. సిఎం పదవికోసం సిద్ధరామయ్యతో పాటు శివకుమార్ కూడా గట్టిగానే ప్రయత్నించారు. ఇరువురూ చెరి రెండున్నరేళ్లు సిఎం




పదవి చేపట్టేలా ఒప్పందం కుదిరినట్లు అప్పట్లో పెద్ద ఎత్తున ప్రచారం కూడా జరిగింది. అయితే దీనిపై అటు పార్టీ అధిష్ఠానం కానీ, ఇటు సిద్ధరామయ్య, శివకుమార్‌లు కానీ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. రాష్ట్రంలో సిద్ధరామయ్య ముఖ్యమంత్రి పదవి చేపట్టి రెండేళ్లు పూర్తి కావస్తుండడంతో ఇప్పుడు మరోసారి నాయకత్వం మార్పుపై ఊహాగానాలు మొదలయ్యాయి.వాస్తవానికి ముడా స్కామ్, వాల్మీకి కార్పొరేషన్ కుంభకోణం వెలుగులోకి వచ్చినప్పటినుంచి సిద్ధరామయ్య ముఖ్యమంత్రి పదవినుంచి తప్పుకోవాలని అటు ప్రతిపక్ష బిజెపితో పాటుగా ఇటు కాంగ్రెస్‌లోని అసమ్మతి నేతలు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. అంతేకాదు, సిద్ధరామయ్య తప్పుకోకపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రెండుగా చీలిపోతుందని అప్పుడు 'సందట్లో సడేమియా'గా తాము అధికారంలోకి రావచ్చని కాషాయ నేతలు భావిస్తున్నారని, కాంగ్రెస్‌లో అసమ్మతి కుంపట్ల వెనుక ఆ పార్టీ హస్తముందన్న విమర్శలు కూడా ఉన్నాయి. అధికారంలోకి రావడంకోసం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి ఖాళీ ఖజానా పెద్ద అడ్డంకిగా మారడంతో సిద్ధరామయ్య సర్కార్‌పై ప్రజల్లో అసహనం మొదలైంది. దీనికి తోడు నిధులు లేకపోవడం, ఎక్కడికక్కడ అభివృద్ధి కార్యక్రమాలు ఆగిపోవడంతో అధికార పార్టీ నేతల్లో సైతం అసంతృప్తి ఉంది. ఈ తరుణంలో మళ్లీ పార్టీలో అసమ్మతి గళం బలంగా వినిపించడం మొదలైంది.డిప్యూటీ సిఎం శివకుమార్ రెండు, మూడు నెలల్లో ముఖ్యమంత్రి అవుతారంటూ ఆయనకు సన్నిహితుడైన కాంగ్రెస్ ఎంఎల్‌ఎ ఇక్బాల్ హుస్సేన్ రెండు రోజుల క్రితం సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది చివర్లోగా కర్ణాటకలో నాయకత్వ మార్పు చేయాలని అధిష్ఠానం భావిస్తోందనే ఊహాగానాలు వినిపిస్తున్న తరుణంలో ఇక్బాల్ కామెంట్స్ రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ఎవరు చెమటోడ్చారో అందరికీ తెలుసునని కూడా ఆయన వ్యాఖ్యానించడం గమనార్హం. తాను దాపరికపు మాటలు చెప్పనని, వాస్తవాలే చెప్తున్నానని ఆయన చేసిన వ్యాఖ్యలతో పరిస్థితి చేయిదాటేలా ఉందని కాంగ్రెస్ అధిష్ఠానం కూడా భావించినట్లు కనిపిస్తోంది.కర్ణాటక పార్టీ వ్యవహారాల ఇంచార్జి, పార్టీ ప్రధాన కార్యదర్శి రణదీప్ సింగ్ సుర్జేవాలాను హుటాహుటిన బెంగళూరుకు పంపించింది. మూడు రోజులపాటు రాష్ట్రంలోనే ఉండనున్న ఆయన అసమ్మతి ఎంఎల్‌ఎలందరితో ముఖాముఖి మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకుంటారని, ఆ తర్వాత అధిష్ఠానానికి ఆయన అందించే నివేదికపై సిద్ధరామయ్య భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఏదిఏమైనా కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిస్థితి మొదటినుంచీ కలహాల కాపురంగానే ఉండడం గమనార్హం. పార్టీ అధికారంలో ఉన్న మూడు రాష్ట్రాల్లో అత్యంత కీలకమైన కర్ణాటకలో పరిస్థితితో కాంగ్రెస్ అధిష్ఠానానికి కూడా తల బొప్పి కడుతోంది.

## సింగారెడ్డి స్కూలు హెడ్ మాస్టర్ రిటైర్మెంట్

ఘటనంగా వీడ్కోలు పలికిన విద్యార్థులు, గ్రామస్థులు

ఖమ్మం జులై 2( వెలుతురు):
ఖమ్మం జిల్లా నేలకొండపల్లికి చెందిన హరి శ్రీనివాస్ నేలకొండపల్లిలో సింగారెడ్డి ప్రాథమిక పాఠశాలలో గత 12 సంవత్సరాలుగా పాఠశాల హెడ్మాస్టర్ గా పనిచేస్తున్నారు. పాఠశాలను అన్ని రంగాల్లో మేటీగా నిలిపి పాఠశాలకు రాష్ట్రస్థాయిలోనే ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారు. తాను చదివిన పాఠశాలకే ప్రధాన ఉపాధ్యాయుడిగా వచ్చారు.

నాటి నుంచి పాఠశాల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేశారు. ఉపాధ్యాయులకు మార్గనిర్దేశం చేస్తూ విద్యార్థులతో మమేకమై వారి అభివృద్ధికి తోడ్పాటు అందించారు. తమకు నచ్చిన ప్రధాన ఉపాధ్యాయుడు పదవి విరమణ చేపడుతున్న సందర్భంలో ఘనంగా వీడ్కోలు పలకాలని విద్యార్థులు నిర్ణయించారు. ఉపాధ్యాయులు విద్యార్థులు కలసి వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.

ప్రధానోపాధ్యాయులతో పాటు ఆయన సతీమణి పై పూలు చల్లుతూ, కోలాటం ఆడుతూ, డబ్బుకు వాయిద్యాల మధ్య ఉపాధ్యాయిని ఇంటి నుంచి కిలోమీటర్ దూరం ఉన్న పాఠశాలకు తీసుకువెళ్లారు.

స్వయంగా విద్యార్థులే కోలాటం ఆడుతూ స్వాగతం పలుకుతూ పాఠశాల వద్దకు తీసుకువెళ్లి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

https://epaper.velthuru.com

వెలుతురు

cinema

# వార్-2ను తెలుగులో రిలీజ్ చేయనున్న నాగవంశీ

యంగ్ టైగర్ ఎన్టీఆర్ భారీ యాక్షన్ మూవీ వార్ 2. బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్ తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోబోతున్నాడుఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్స్, గ్లిమ్స్ సినిమాపై అంచనాలు భారీగా పెంచేశాయి. ఎన్టీఆర్, హృతిక్ మధ్య వచ్చే



యాక్షన్ ఎపిసోడ్స్ ఫ్యాన్స్ కు విజువల్ ఫీస్ట్ ఇస్తాయని యూనిట్ కూడా బలంగా నమ్ముతోంది. యష్ రాజ్ ఫిల్మ్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం ఏడాది ఆగస్టు 14 న ఈ సినిమా వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. ఈ సినిమా తెలుగు రైట్స్ ను సితార ఎంటె÷-టంల్గ÷నమెంట్స్ నాగవంశి సుమారు రూ. 90 కోట్లకు కొనుగులు చేసారు. తెలుగు సినిమా చరిత్రలో ఒక నాన్ తెలుగు సినిమాకు ఈ ధర పలకడం హిస్టరీ. కేవలం ఎన్టీఆర్ నటిస్తుండడంతోనే ఆ రేట్ పలికిందనేది వాస్తవం. అనుగుణంగానే వార్ 2 తెలుగు స్టేట్స్ రిలీజ్ ను అదే స్థాయిలో రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాడు నాగవంశీ. ఆగస్టు 14న తెల్లవారు జామున షోస్ వేసేలా ఎ÷-లాన్ చేస్తున్నాడట. ఇప్పటికే అందుకు అందుకోసం థియేటర్స్ తో చర్చలు కూడా చేస్తున్నారట. భారీ యాక్షన్ ఎంటె÷-టంల్గ÷నర్ గా వస్తున్న వార్ 2 ను తెలుగు రాష్టాల్లో మొదటి రోజు బి÷-గగెస్ట్ నంబర్స్ ఉండబోతున్నాయి. అలాగే తమిళ సుపర్ స్టార్ రజనీకాంత్, లోకేష్ కనకరాజ్ కాంబోలో వస్తున్న పాన్ ఇండియా బి÷-గగెస్ట్ మల్టీస్టారర్ కూలీతో పోటీగా రిలీజ్ అవుతుంది వార్ 2.




# నెగెటివ్ ప్రచారానికి చెక్

## మంచు విష్ణును ఫాలో అవుతానన్న దిల్ రాజు

నెగెటివ్ ట్రోలింగ్‌ని, ఫేక్ రివ్యూస్‌ని అరికట్టడంలో మంచు విష్ణుని ఫాలో అవుతాం అని ప్రముఖ నిర్మాత దిల్ రాజు అన్నారు.. 'కన్నప్ప' మూవీ విషయంలో ఆయన తీసుకున్న నిర్ణయం చాలా ఉపయోగపడేదని అభినందించాడు. ఇకపై మేము కూడా అదే ఫాలో అవుతామని చెప్పారు. మంచు విష్ణు నటించిన 'కన్నప్ప' జూన్ 27న ప్రేక్షకుల ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమా రిలీజ్‌కి రెండు రోజుల ముందే మంచు విష్ణు ఓ హెచ్చరికను జారీ చేశారు. 'కన్నప్ప' సినిమాని టా÷-గ్గ÷ట్‌గా చేసుకొని కావాలని ఎవరైన నెగెటివ్‌గా పోస్టులు పెట్టిన, వ్యక్తిగత టార్గెట్ చేసిన.. ఉద్దేశ్యపూర్వకంగా విమర్శలు చేస్తూ పరువుకు భంగం కలిగిస్తే కోర్టు ద్వారా చర్యలు తీసుకుంటాం' అని హెచ్చరిస్తూ పబ్లిక్ కాషన్ నోటీస్‌ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇది మంచి ఫలితాన్ని ఇచ్చింది. రిలీజ్ తర్వాత



ఫేక్ రివ్యూస్, నెగెటివ్ ట్రోలింగ్ పెద్దగా జరగలేదు. ట్వీటర్‌లో సినిమాపై, మంచు ఫ్యామిలీపై నెగెటివ్ పోస్ట్‌లు పెట్టలేదు. సినిమాకు విమర్శల కంటే ప్రశంసలే ఎక్కువగా వచ్చాయి. అయితే ఈ విషయంలో దిల్ రాజు విష్ణు పద్దతికి ఫిదా అయ్యారు..ఆయన నిర్మించిన తాజా చిత్రం 'తమ్ముడు' జులై 4న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఆయన మీడియాతో ముచ్చటిస్తూ.. నెగెటిట్ ట్రోలింగ్‌పై స్పందించారు.. ' 'కన్నప్ప చిత్రబృందం మంచి నిర్ణయం తీసుకుంది. రిలీజ్‌కు ముందే అలా ఒక హెచ్చరిక జారీచేసింది.. దీంతో ఫేక్ రివ్యూస్, నెగెటివ్ ట్రోలింగ్, పైరసీ తగ్గిపోతుంది. అలా అని రివ్యూస్‌ని ఆపడం మా ఉద్దేశం కాదు. రివ్యూస్ రాయండి. కానీ రాసే ముందు ఒక్కసారి ఆలోచించండి. సినిమాపై కావాలని నెగెటివ్‌గా రాస్తే.. ఎక్కువగా నష్టపోయేది నిర్మాత మాత్రమే. హీరోలు, దర్శకులు ఈ సినిమా కాకపోతే మరో సినిమాతో హిట్ కొడతారు. కానీ నిర్మాత అయితే ఆ సినిమాకు డబ్బులు పోగొట్టుకోవాల్సిందే కదా? అది దృష్టిలో పెట్టుకొని జన్యూన్‌గా రివ్యూస్ ఇవ్వండి. దయచేసి హెల్ప్ చేయకపోయినా పర్లేదు ..డ్యామేజ్ మాత్రం చేయద్దు' అని దిల్ రాజు విజ్ఞప్తి చేశాడు.

# నటనను వదిలేశానంటూ రూమర్లు

## అలాంటిదేమీ లేదన్న నటి కోమలి ప్రసాద్


లుగు చిత్రసీమలో తనదైన ముద్ర వేసుకుని నటిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది కోమలి ప్రసాద్. ఇటీవల నాని 'హిట్ 3' మూవీలో ముఖ్యపాత్ర పోషించిన ఈ ముద్దుగుమ్మ, త్వరలో 'శశివదనే' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. అయితే ఈ నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా ఆమె గురించి కొన్ని అబద్ధపు పుకార్లు చక్కర్లు కొడుతున్నాయి. నటనకు గుడ్ బై చెబుతూ డాక్టర్ వృత్తిలోకి మారిపోయింది అని పుకార్లు వినిపించడంతో, కోమలి తానే స్వయంగా స్పందించారు.. 'అందరికీ నమస్కారం. ఇటీవల నా గురించి డాక్టర్‌గా మారిపోయానని, నటనను పూర్తిగా వదిలేశానని కొన్ని అసత్య వార్తలు ప్రచారంలో ఉన్నాయి. కొందరు ప్రముఖ మీడియా సంస్థలు కూడా దీనిని నిజమైందన్నట్లుగా ప్రచారం చేయడం బాధాకరం. ఇది పూర్తిగా అసత్యం. నిజానికి ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ సినిమాల్లో నా స్థానం సంపాదించుకున్నాను. ఆ శివుని ఆశీస్సులతో నా నటనా ప్రస్థానం కొనసాగుతోంది. ఈ రకమైన రూమర్లు నాలోను, నా శ్రేయోభిలాషుల్లోను అనవసరంగా ఆందోళన కలిగిస్తున్నాయి. ఇలాంటి తప్పుడు వార్తలు వ్యాప్తి చెందకూడదని మనస్ఫూర్తి వేడుకుంటున్నాను. అందుకే ఈ పోస్ట్ ద్వారా నిజాన్ని మీ అందరితో పంచుకోవాలనుకున్నాను. నటన నాకు ఒక్క ఉద్యోగం మాత్రమే కాదు.. అది నా జీవన విధానం. చివరి శ్వాస వరకు నేను నటనతోనే జీవించాలనుకుంటున్నాను. ప్రస్తుతం కొత్త స్క్రిప్ట్‌లను ఎంతో జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటున్నాను. త్వరలోనే మీ అందరినీ గర్వపడేలా చేసే కొత్త ప్రాజెక్ట్‌ల వివరాలతో మీ ముందుకు వస్తాను. నా ప్రయాణంలో వెన్నెముకలా నిలిచిన నా శ్రేయోభిలాషులకు, నన్ను నమ్మిన ప్రతి ఒక్కరికి నా హృదయపూర్వక ధన్యవాదాలు' అని కోమలి ప్రసాద్ తేల్చిచెప్పింది.



# రామాయణం ఫస్ట్ పార్ట్ షూట్ పూర్తి

## నేడు గ్లింప్స్ విడుదల అంటూ ప్రచారం

బాలీవుడ్‌లోని ప్రముఖ దర్శకుల్లో ఒకరైన నితేష్ తివారీ దర్శకత్వంలో రూపొందుతోన్న పాన్-ఇండియా మైథలాజికల్ మూవీ 'రామాయణ' .తొలి భాగం షూటింగ్ పూర్తి చేసుకున్నట్లు సమాచారం. భారీ స్థాయిలో రూపొందుతోన్న ఈ సినిమా దేశవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానుల్లో భారీ అంచనాలు పెంచుతుంది. ఇందులో రణబీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతగా కనిపించనుండగా, కన్నడ రాక్‌స్టార్ యష్ రావణుడి పాత్రలో నటిస్తున్నారు. అలాగే కాజల్ అగర్వాల్ మండోదరి పాత్రలో నటించనుందన్న వార్తలు వెలువడుతున్నాయి. తాజాగా షూటింగ్ పూర్తి చేసుకున్న సందర్భంగా సినిమా యూనిట్ కేక్ కట్ చేస్తూ జరుపుకున్న సంబరాలు సోషల్ మీడియాను హీటెక్కిస్తున్నాయి. ఫోటోలు, వీడియోలు ఇంటర్నెట్‌లో వైరల్ అవుతున్నాయి. ఈ చిత్రం రెండు భాగాలుగా తెరకెక్కుతోంది. తొలి భాగాన్ని 2026 దీపావళికి, రెండో భాగాన్ని 2027 దీపావళికి విడుదల చేయాలని మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. షూటింగ్ పూర్తయినందున, సినిమాకు సంబంధించిన గ్లింప్స్ వీడియోను జూలై 3న విడుదల చేయనున్నట్లు సమాచారం. ఈ ఈవెంట్‌కు టీమ్ మొత్తం హాజరుకానున్నారు. బెంగళూర్‌లో జరగనున్న ఈ కార్యక్రమం కోసం తారలంతా అక్కడికి బయల్దేరుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. చిత్రంలో లక్ష్మణుడిగా రవి దూబె కనిపించనుండగా, కైకేయిగా లారా దత్తా, శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్, హనుమాన్‌గా సన్నీ డియోల్, దశరథుడిగా అరుణ్ గోవిల్ కనిపించి అలరించనున్నారు. ఇక యష్ ఈ చిత్రంలో నటించడమే కాకుండా, సినిమాని నిర్మిస్తున్నారు. ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషలతో పాటు పలు ఇతర భారతీయ భాషల్లో విడుదల కానుంది. భారీ స్థాయిలో నిర్మితమవుతున్న ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి మరిన్ని అప్‌డేట్స్ త్వరలో వెల్లడించనున్నట్టు చిత్ర బృందం తెలిపింది. రామాయణం రూపంలో భారతీయ సినీ చరిత్రలో మరో విజువల్ వండర్ రాబోతుందన్న ఊహలు జోరుగా వినిపిస్తున్నాయి.







# విశ్వంభర గ్రాఫిక్స్ హాలివుడ్‌కు అప్పగింత

తెలుగు ఫిల్మ్ ఇండస్టీ నుంచి వస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియన్ మూవీలలో 'విశ్వంభర' ఒకటి. అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో త్రిష కథానాయికగా నటిస్తుండగా.. వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం వీఎఫ్ఎక్స్ పనుల్లో బిజీగా గడుపుతుంది. సినిమా టీజర్‌పై విపరీతంగా ట్రోల్స్ రావడంతో గ్రాఫిక్స్‌పై మరింత కష్టపడుతున్నారు మేకర్స్. అయితే ఈ సినిమా గ్రాఫిక్స్‌కి సంబంధించి తాజాగా ఒక వార్త వైరల్‌గా మారింది. ఈ సినిమా గ్రాఫిక్స్ పనులను హాలీవుడ్‌కి చెందిన వీఎఫ్ఎక్స్ స్టూడియోకి అప్పగించినట్లు తెలుస్తుంది. ఈ హాలీవుడ్ స్టూడియో విశ్వంభర సినిమాకు సాలిడ్ అవుట్ పుట్‌ని అందించబోతున్నట్లు తెలుస్తుంది. ఈ పనులు కంప్లీట్ అయిన అనంతరం సినిమా విడుదల తేదీని మేకర్స్ అనౌన్స్ చేయబోతున్నట్లు సమాచారం. మరోవైపు అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరు ఒక సినిమా చేస్తున్నాడు. కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతుంది. సోషియో ఫాంటసీ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ తెరకెక్కిస్తున్నారు.

# వెలుతురు

రాష్ట్రీయం । జాతీయం

https://epaper.velthuru.com

గురువారం 3 జులై 2025






Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com